www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 21-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 35

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి సా. 5.40 తదుపరి చతుర్దశి; నక్షత్రం: స్వాతి పూర్తి; వర్జ్యం: ఉ. 11.50-1.34; దుర్ముహూర్తం: ఉ. 8.19-9.11, రా. 10.16-10.59; అమృతఘడియలు: రా. 10.14-11.58; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.38

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విద్యాసేవలో... 50వ సంవత్సరము

...మా వద్ద లక్షలాది మంది విద్యార్థులు చదువుకున్నారు...

వేల వేల మంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానములలో ఉన్నారు

చదువు... క్రమశిక్షణ.. ఆరోగ్యము... ఒత్తిడిలేని విద్యతో ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తున్న...



Madala Subrahmaneyswara Rao
Founder & Managing Director



Dr. M. SURYASEKHAR
M.B.B.S., M.B.A.,
Chief Executive Director



M. SUSHMA
MSIS., M.B.A.,
Executive Director

ESTD : 1975

• LKG to Intermediate - State Syllabus • LKG to +1 & +2 CBSE Syllabus • Co-education • Residential School & College

SRI VISWASANTHI
EDUCATIONAL INSTITUTIONS

• Recognised by Govt. of A.P.
• Affiliated to B.I.E., A.P.

STATE & CBSE

• Affiliated to CBSE, Delhi.

LKG to 10th, Inter (MPC & BiPC) | LKG to X & XI, XII (PCM & PCB)

IIT & Medical Foundation from VI to X Classes



Madala Prameela Rani
Founder



Dr. M. RAJASEKHAR
M.B.B.S., M.S. (Ortho)
Director



Dr. M. NEELIMA
M.B.B.S.,
Director

Separate Sections & Hostel
for... BOYS & GIRLS
A.C. CAMPUS
NCC "A" & "B" Certificates

శ్రీ విశ్వశాంతి జూనియర్ కాలేజి

VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.
Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666, 833 300 0899.
Web Site : www.sriviswasanthischools.in   E - mail Id : director.sriviswasanthi@gmail.com

ADMISSIONS ARE IN PROGRESS
SINGLE CAMPUS
with Limited Strength

పచ్చని చక్కటి గ్రామీణ వాతావరణంలో, 80 ఎకరాల స్థలములో, విశాలమైన భవనాలు, 20 ఎకరాల ఆటస్థలము, అత్యంత అర్హత, అనుభవము, అంకిత భావముగల అధ్యాపక బృందముతో ఎక్కడా బ్రాంచీలు లేకుండా, మేనేజ్‌మెంట్ 50 స॥ల నుండి క్యాంపస్‌లోనే ఉంటూ... అతి సాధారణ విద్యార్థిని కూడా అసాధారణ విద్యార్థిగా తీర్చిదిద్దుతూ, రాష్ట్రస్థాయిలో మరియు జాతీయస్థాయిలో 50 సం॥లుగా అద్భుత ఫలితాలు సాధిస్తున్నది **"శ్రీ విశ్వశాంతి"**

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ స్కూల్ - స్టేట్ సిలబస్

LKG నుండి 10వ తరగతి వరకు రెగ్యులర్ సిలబస్‌తోపాటు IIT & NEET Foundationలో Special Teachersచే Selected Studentsకి ప్రత్యేక శిక్షణ. ప్రతి విద్యార్థి మీద వ్యక్తిగత శ్రద్ధ. **State Levelలో టాప్ ర్యాంక్స్.**

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి

MPC, BiPCలలో IIT-JEE Main, Advanced, Eamcet, NEETలలో IPEతో పాటు అత్యంత అనుభవముగల సూపర్ సీనియర్ లెక్చరర్స్‌చే Limited Studentsతో Personal Supervisionతో ప్రత్యేక శిక్షణ ఇస్తూ... State Level & All India Levelలో టాప్ ర్యాంక్స్ సాధిస్తున్నాము.

♦ అత్యంత ప్రతిభగల విద్యార్థులకు ఇంటర్‌లో చేరుటకు మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాము.

శ్రీ విశ్వశాంతి CBSE రెసిడెన్షియల్ స్కూల్

LKG నుండి 10 వరకు ఆంధ్ర, తెలంగాణ నుండే కాకుండా భారతదేశములోని 18 రాష్ట్రాల నుండి విద్యార్థులు రెగ్యులర్ CBSE సిలబస్‌తోపాటు 6th నుండి 10th వరకు Selected Studentsకి IIT & NEET Foundationలో ప్రత్యేక టీచర్స్‌తో ప్రత్యేకశిక్షణ. All India Levelలో Top Ranks సాధిస్తున్న స్కూల్ **"శ్రీ విశ్వశాంతి"**.

శ్రీ విశ్వశాంతి CBSE సీనియర్ సెకండరీ రెసిడెన్షియల్ స్కూల్

XI & XII Classes (+1, +2) PCM, PCBలలో రెగ్యులర్ సిలబస్‌తోపాటు Day 1 నుండి IIT-JEE Main, Advanced & NEETలలో Super Senior Lecturersచే ప్రత్యేక కోచింగ్ ఇస్తూ... All India Levelలో Top Ranks సాధిస్తోంది.

♦ CBSE +1లో చేరుటకు మెరిట్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ ఇస్తున్నాము.

నోట్: సొంత డైరీఫామ్ కలిగి విద్యార్థినీ విద్యార్థులకు పుష్టికరమైన ఆహారము అందిస్తూ, ఆరోగ్యము మీద ప్రత్యేక శ్రద్ధ. Sports, Games & Other Activitiesకు అత్యంత ప్రాధాన్యత. Karate, Yoga, Skating, Scouts, NCC, Cricket, Hand Ball, Basket Ball, Volley Ball, Ball Badminton, Kho-Kho, Kabaddi, Athletics etc... అధునాతన కంప్యూటర్ ల్యాబ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్స్, లైబ్రరీ కలిగియున్న సంస్థ.

50 సంవత్సరముల నుండి మమ్ములను ప్రోత్సహిస్తూ, సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు స్నేహితులకు, బంధువులకు, బంధువులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదములు. - శ్రీ విశ్వశాంతి కుటుంబం



రూ. లక్ష దాటిన వెండి

హైదరాబాద్‌లో ఒక్కరోజే 4,500 పెరుగుదల.. సరికొత్త రికార్డు గరిష్ఠానికి కిలో ధర

10 గ్రాముల బంగారం రూ.75,000 ఎగువకు



హైదరాబాద్: దేశీయంగా విలువైన లోహాల ధరలు మరింత ఎగబాకాయి. వెండి సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రేటు సోమవారం మరో రూ.540 పెరిగి రూ.75,160కి చేరుకుంది. 22 క్యారెట్ల స్వచ్ఛత లోహం రూ.500 పెరుగుదలతో రూ.68,900కు అమ్ముడైంది. కాగా, కిలో వెండి ఏకంగా రూ.4,500 ఎగబాకి రూ.1,01,000 ధర పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ సెంటర్ (కామెక్స్)లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,454 డాలర్లు, సిల్వర్ 32.75 డాలర్లకు ఎగబాకాయి. మున్ముందు వీటి ధరలు మరింత పెరిగేందుకే అధిక అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. త్వరలోనే ఔన్స్ బంగారం 2,500-2,550 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

కారణమేంటి..?

అమెరికాలో రిటైల్ ధరల ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో ఫెడ్ రేట్ల తగ్గింపు ప్రక్రియ త్వరలోనే (జూన్ లేదా సెప్టెంబరులో) ప్రారంభం కావచ్చని, ఈ ఏడాదిలో ఫెడరల్ రిజర్వ్ కనీసం రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఊపందుకోవడం బులియన్ ధరల ర్యాలీకి ప్రధాన కారణమైంది. మళ్లీ పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి.

ఫెడ్ రేటు డౌన్.. గోల్డ్, సిల్వర్ అప్!

అమెరికాతో పాటు మిగతా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లూ త్వరలో వడ్డీ రేట్లను తగ్గించే ఆలోచనలో ఉన్నాయి. వచ్చే నెలలోనే వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలున్నాయని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ సంకేతాలిచ్చారు. స్వీడన్ సెంట్రల్ బ్యాంక్ కూడా వడ్డీ రేట్ల తగ్గింపును ప్రారంభించింది. సాధారణంగా ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. దాంతో విలువైన లోహాల నుంచి పెట్టుబడులు వీటిలోకి మళ్లుతుంటాయి. కాగా, వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి ప్రవహిస్తుంటాయి.

ఆయిల్ ఇండియా బోనస్ షేరు

ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు జారీ

క్యూ4 లాభం రూ.2,333 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్) వాటాదారులకు బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. వారి వద్ద ఉన్న ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు జారీ చేయనున్నట్టు తెలిపింది. అలాగే రూ.10 ముఖ విలువ గల (బోనస్‌కు ముందు) ఒక్కో షేరుపై రూ.3.75 తుది డివిడెండ్ కూడా ప్రకటించింది. బోనస్ అనంతరం తుది డివిడెండ్ రూ.2.50 అవుతుంది. ఇప్పటికే కంపెనీ రెండు విడతలుగా చెల్లించిన మధ్యంతర డివిడెండు రూ.12 (బోనస్‌కు ముందు) ఇది అదనం. కాగా మార్చి త్రైమాసికంలో కంపెనీ 18 శాతం వృద్ధితో రూ.2,332.94 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.1,979.74 కోట్లు. క్రూడాయిల్ ధరల పెరుగుదల లాభాల వృద్ధికి దోహదపడినట్టు కంపెనీ ప్రకటించింది. ఇదే కాలంలో టర్నోవర్ కూడా 16% వృద్ధితో రూ.10,375.09 కోట్లకు చేరింది. క్రూడాయిల్ ఉత్పత్తి, విక్రయం ద్వారా సమకూరిన ఆదాయం 18 శాతం వృద్ధి చెందగా గ్యాస్ ఉత్పత్తి విక్రయం ద్వారా మాత్రం ఆదాయం 16.5 శాతం క్షీణించింది. మార్చి 31వ తేదీతో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరంలో లాభం 29 శాతం క్షీణించి రూ.6,980.45 కోట్లకు దిగివచ్చింది.

ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్‌లోకి నెక్స్ట్‌వేవ్

» బిట్స్ పిలానీతో జట్టు

» నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆఫర్

హైదరాబాద్: ఎడ్‌టెక్, స్కిల్లింగ్ ప్లాట్‌ఫామ్ నెక్స్ట్‌వేవ్.. ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్ విభాగంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం బిట్స్ పిలానీతో జట్టు కట్టింది. ఇందులో భాగంగా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును ఆఫర్ చేయనుంది. ముందుగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్యాంపస్‌లో 750 మంది విద్యార్థులతో ఈ కోర్సును ప్రారంభించనున్నట్లు నెక్స్ట్‌వేవ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అట్లూరి తెలిపారు. మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, డేటా ఎనలిటిక్స్ రంగాలపై ఈ కోర్సు ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుందని చెప్పారు. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా ఈ కోర్సు కరిక్యులమ్‌ను రూపొందించినట్లు రాహుల్ తెలిపారు. జూలై 15న ప్రారంభం కానున్న ఈ నాలుగేళ్ల కోర్సు ఫీజు రూ.14 లక్షలని పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన అనంతరం బిట్స్ పిలానీ గ్రాడ్యుయేషన్ పట్టాను ఇస్తుందని తెలిపారు. కాగా వచ్చే ఏడాది కాలంలో బెంగళూరు, చెన్నై, పుణె, కోచి నగరాలకు ఈ కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం మొత్తం పది క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో క్యాంపస్ ఏర్పాటు కోసం రూ.15 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు రాహుల్ చెప్పారు. కాగా ఇప్పటికే ఐటీ రంగంలో పని చేస్తున్న వారు తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకునేందుకు గాను ప్రత్యేకంగా బూట్ క్యాంప్ కోర్సును నిర్వహిస్తున్నట్లు రాహుల్ తెలిపారు.

నరెడ్కో ఏపీ చైర్మన్‌గా హరిబాబు

తాడేపల్లి టౌన్ : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ (నరెడ్కో-ఏపీ) చైర్మన్‌గా గడ్డిపాటి హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా గద్దె చక్రధర్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షులుగా పరుచూరి కిరణ్ కుమార్, వై దుర్గాప్రసాద్, తాళ్లూరి శివాజీగా నియమితులయ్యారు. సెక్రటరీ జనరల్‌గా ఎం సీతారామయ్య, కోశాధికారిగా చావా రమేష్‌ను ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు వీరు ఈ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చక్రధర్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగం అభ్యున్నతికి నరెడ్కో ఏపీ కృషి చేస్తుందని తెలిపారు. నరెడ్కో ఏటా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరులలో ప్రాపర్టీ షోలను నిర్వహిస్తోందన్నారు.

పెట్ ఫుడ్స్ విభాగంలోకి గ్రోవెల్

» పుల్లర్, డాట్‌గుడ్ బ్రాండ్‌తో ఉత్పత్తుల విడుదల



హైదరాబాద్: ఆక్వాకల్చర్ ఫీడ్స్ కంపెనీ గ్రోవెల్ గ్రూప్.. పెంపుడు జంతువుల పోషకాహార (పెట్ ఫుడ్స్) విభాగంలోకి ప్రవేశించింది. పుల్లర్, డాట్‌గుడ్ బ్రాండ్ పేరుతో పెట్ బిస్కెట్స్ (ట్రీట్)ను కంపెనీ విడుదల చేసింది. వ్యాపార కార్యకలాపాల విస్తరణలో భాగంగా పెంపుడు జంతువుల పోషకాల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రమోటర్ గ్రూప్, గ్రోవెల్ ఎంఎస్ఆర్ కార్తీక్ తెలిపారు. దేశీయ పెట్ పరిశ్రమ ఏటా 10 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని, 2027 నాటికి ఇది 100 కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పెట్ ట్రీట్స్ మార్కెట్ రూ.650 కోట్లుగా ఉందని, 2027 నాటికి రూ.1,900-2,000 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గ్రోవెల్ గ్రూప్.. ఆక్వా ఫీడ్స్, ఫార్ములేషన్, సీఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారాలను నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం కంపెనీ వార్షిక టర్నోవర్ రూ.2,000 కోట్లుగా ఉందని కార్తీక్ తెలిపారు. కంపెనీ హైదరాబాద్‌లో రెండు ఫార్ములేషన్ యూనిట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయపాలెంలో రెండు ఫీడ్స్, సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్వహిస్తోందన్నారు. కాగా ఈ పెట్ ఫుడ్ కోసం సింగరాయపాలెంలోని ప్రత్యేకంగా రెండు ప్రొడక్షన్ లైన్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఈ విభాగంలో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు కార్తీక్ తెలిపారు. దేశవ్యాప్తంగా 300కు పైగా నగరాల్లోని రెండువేలకు పైగా ఔట్‌లెట్స్‌లో పుల్లర్, డాట్‌గుడ్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని గ్రోవెల్ గ్రూప్ పెట్ ఫుడ్ బిజినెస్ హెడ్ జేఎస్ రామకృష్ణ తెలిపారు.

- ఆజూనీ బయోటెక్ రైట్స్ ఇష్యూ మంగళవారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ రైట్స్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.43.81 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరును రూ.5కు ఆఫర్ చేస్తోంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ కార్యకలాపాల విస్తరణ, కార్పొరేట్ అవసరాలు, ప్లాంట్ మెషినరీ కొనుగోళ్ల కోసం వెచ్చించనుంది. ఈ నెల 31న ఈ ఇష్యూ ముగియనుంది.

- పటేల్ కంటైనర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో వ్యూహాత్మక వాటా కొనుగోలుకు అహ్మదాబాద్‌కు చెందిన సెల్విన్ ట్రేడర్స్ లిమిటెడ్ ఆమోదం తెలిపింది. పటేల్ కంటైనర్‌లో కంపెనీ తొలుత 36 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఆ తర్వాత రెండేళ్లలో ఈ వాటాను 51 శాతానికి పెంచుకోనుంది. కాగా మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.291.19 కోట్ల ఆదాయంపై రూ.3.53 కోట్ల లాభాన్ని ప్రకటించింది.

ఆచితూచి అడుగేయండి!

స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు చివరి దశకు చేరుకోవటం, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు ఇందుకు కారణం. పెరిగిన పుట్, కాల్ నిష్పత్తిని బట్టి చూస్తే మదుపరులు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. ఈ వారం నిఫ్టీకి 22,400 వద్ద మద్దతు, 22,550 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. సూచీలు హఠాత్తుగా పెరుగుతూ, తగ్గుతూ వస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టీవీఎస్ మోటార్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మార్చి త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించి ఉండటంతో మూమెంటమ్ పెరిగింది. గత శనివారం ఈ షేరు రూ.2,191 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,320/2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,180 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీఈఎల్: ఈ కౌంటర్ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. బెంచ్‌మార్క్ సూచీలు ఆటుపోట్లకు లోనైనా ఇది మాత్రం నిలకడగా సాగుతోంది. చివరి ఐదు సెషన్లలో షేరు ధర 15 శాతం పెరిగింది. గత శనివారం ఈ షేరు 4.43 శాతం లాభంతో రూ.259.20 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.255 శ్రేణిలో ప్రవేశించి రూ.325 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.240 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ: మంచి అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్‌లో స్వల్ప కరెక్షన్ జరిగింది. మళ్లీ ఇప్పుడు జీవితకాల గరిష్ఠాన్ని దాటే క్రమంలో సాగుతోంది. తక్కువ వాల్యూమ్ ట్రేడవటాన్ని బట్టి చూస్తే ఈ షేర్లను వదులుకోవటానికి ఇన్వెస్టర్లు ఇష్టపడటం లేదు. గత శనివారం రూ.173 స్థాయిలో ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.170 స్థాయిలో ప్రవేశించి రూ.225/240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.163 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వేదాంత లిమిటెడ్: ఈ కౌంటర్‌లో చాలా కాలం పాటు కరెక్షన్ జరిగింది. మంచి బేస్ ఏర్పడిన అనంతరం ఏప్రిల్‌లో అప్‌ట్రెండ్ మొదలైంది. రూ.438 స్థాయిలో కీలక నిరోధాన్ని అధిగమించింది. మూమెంటమ్ ఇలాగే కొనసాగితే సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని తాకటం ఖాయంగా కనిపిస్తోంది. గత శనివారం ఈ షేరు రూ.458 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.455 స్థాయిలో ప్రవేశించి రూ.485/510 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.440 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్‌లో కన్సాలిడేషన్ జరుగుతోంది. ఈ షేర్లు సైడ్‌వేస్‌లో చలిస్తూ ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి చేరుకున్నాయి. పెరుగుతున్న మూమెంటమ్, వాల్యూమ్‌ను బట్టి చూస్తే దాన్ని అధిగమించే అవకాశం కనిపిస్తోంది. గత శనివారం రూ.890 వద్ద ముగిసిన ఈ షేరులో ఇన్వెస్టర్లు అదే స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.955/1,055 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.870 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

పవర్‌మెక్ లాభంలో 13 % వృద్ధి

హైదరాబాద్: విద్యుత్, మౌలిక వసతుల రంగంలోని హైదరాబాద్‌కు చెందిన పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.84.41 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.74.57 కోట్లతో పోల్చితే లాభం 13% పెరిగింది. కంపెనీ ఆదాయం రూ.1,183.20 కోట్ల నుంచి రూ.1,311.86 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుకు రూ.2 తుది డివిడెండ్‌కు ఆమోదం తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,160 ▲	68,900 ▲	1,01,000 ▲
ముంబై	73,383 ▼	67,219 ▼	86,373 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	154
వరంగల్	150	గుంటూరు	154
కరీంనగర్	150	ఒంగోలు	154
మహబూబ్‌నగర్	152	చిత్తూరు	160
కర్నూలు	152	నెల్లూరు	160
విశాఖపట్నం	146	అనంతపురం	154
గోదావరి	154		

స్పోర్ట్స్

దీప్తి ప్రపంచ రికార్డు

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణం కైవసం

పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత

కన్నీటి కష్టాలు దాటుకొని..



కోబ్ (జపాన్): తెలుగమ్మాయి జీవాంజి దీప్తి విశ్వ వేదికపై సంచలన ప్రదర్శనతో మెరిసింది. ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో రికార్డుతో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. సోమవారం ఇక్కడ జరిగిన మహిళల 400 మీటర్ల టీ20 క్లాస్ విభాగం రేసును దీప్తి 55.07 సెకన్లలో పూర్తి చేసి చాంపియన్‌గా నిలిచింది. ఈ క్రమంలో గతేడాది అమెరికా అథ్లెట్ బ్రిన్నా క్లార్క్ నెలకొల్పిన ప్రపంచ రికార్డు (55.12 సె.)ను దీప్తి బద్దలుకొట్టింది. ఐసెల్ ఒండర్ (టర్కీ-55.19)కు రజతం, లిజాంషెలా అంగులో (ఈక్వెడార్- 56.68 సె)కు కాంస్య పతకాలు దక్కాయి. అంతకుముందు రోజు దీప్తి హీట్స్‌లో 56.18 సెకన్లతో ఆసియా రికార్డు టైమింగ్‌ను నమోదుచేసి ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. ఈ టోర్నీలో విజయంతో దీప్తి త్వరలో జరిగే పారిస్ పారాలింపిక్స్‌కు కూడా అర్హత సాధించింది. ఇక, ఇదే టోర్నీలో భారత్‌కే చెందిన యోగేష్ కథునియా ఎఫ్56 కేటగిరీ డిస్కస్ త్రోలో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో భారత్ ఇప్పటివరకు ఒక స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు సహా మొత్తం 4 పతకాలు సాధించింది.

నిరుపేద కుటుంబం.. అమ్మానాన్న కూలికెళ్తేగానీ పూట గడవని పరిస్థితి.. వీటికితోడు తన వైకల్యాన్ని చూసి వెక్కిరింపులు, ఛీత్కారాలు.. ఇలా ఎన్నో అవమానాలు ఎదురైనా, వాటన్నింటిని అధిగమిస్తూ ముందుకు సాగింది.. పరుగే శ్వాసగా జీవించింది.. తనకు అవహేళనలు ఎదురైన చోటే ప్రశంసలు అందుకుంటూ ఇవాళ ప్రపంచ వేదికపై అత్యుత్తమ ప్రదర్శనతో మెరిసింది. తన విజయంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచింది 21 ఏళ్ల దీప్తి జీవాంజి.



వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామం కల్లెడ, దీప్తి స్వస్థలం. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి రోజు కూలీలు. తినడానికి మంచి తిండి లేక, చదువుకోవడానికి నోచుకోని దీప్తి జీవితాన్ని ఒక్క 'పరుగు' మలుపు తిప్పింది. తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సాధించిన స్వర్ణం, దీప్తి అథ్లెటిక్స్ ప్రస్థానానికి పునాది వేసింది. ఈ పోటీల్లో దీప్తి ప్రదర్శన గురించి తెలుసుకున్న 'సాయ్' సీనియర్ అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్, మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్ రావాలని ఆహ్వానించాడు. కానీ, ఆ సమయంలో దీప్తి వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చేందుకు బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దుస్థితి. మరోవైపు.. 'మానసిక దివ్యాంగురాలు.. ఎదుటి వాళ్లు చెప్పేదే సరిగ్గా అర్థం చేసుకోలేదు. అలాంటిది క్రీడల్లో దేశం తరపున పతకాలు సాధిస్తుందా? క్రీడలు, ట్రైనింగ్ అంటూ హైదరాబాద్ చుట్టూ తిరిగితే ఇక ఈ అమ్మాయికి పెళ్లి కూడా కాదు' అని ఎంతో మంది అవహేళన చేశారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా దీప్తిని తల్లిదండ్రులు హైదరాబాద్ పంపించారు. అనుకున్నట్టే దీప్తి.. అనతికాలంలోనే రమేశ్ శిక్షణలో జాతీయ, అంతర్జాతీయస్థాయికి రాటుదేలింది. గోపీచంద్-మైత్రాహ్ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకుంటున్న దీప్తి, తొలుత సాధారణ అథ్లెట్లతో కలిసి పోటీ పడేది. ఒకసారి జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ దీప్తిని గమనించి, ఆమె సమస్యను తెలుసుకొని, వైద్య పరీక్షలు చేయించాడు. ఆమెకు ఐక్యూ చాలా తక్కువగా ఉందని, ఎదుటి వారు చెప్పేవి అర్థం చేసుకోవడం, సొంతంగా ఆలోచించడంలో ఇబ్బందులున్నాయని తెలిసి, పారా క్రీడల్లోని టీ20 విభాగానికి మార్చాడు. అప్పట్నుంచి దీప్తి వెనుదిరిగి చూడలేదు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తన సత్తా చాటుతూనే ఉంది. గతేడాది హాంగ్జౌలో జరిగిన ఆసియా పారా క్రీడల్లో 400 మీటర్ల రేసులో దీప్తి స్వర్ణ పతకంతో సత్తాచాటింది. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో పాటు పారిస్ పారాలింపిక్స్‌లో దేశం తరఫున పోటీపడే స్థాయికి చేరుకుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి- హైదరాబాద్)

స్వర్ణంతో మెరిసినా..

- భారత్‌కు దక్కని పారిస్ బెర్త్
- ఆసియా మిక్స్‌డ్ 4 ×400 మీ. రిలే

బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 4x400 మీ. రిలే విభాగంలో భారత జట్టు అదరగొట్టింది. తెలుగు అథ్లెట్ జ్యోతిక శ్రీ, శుభా వెంకటేశన్, అజ్మల్, జాకబ్‌తో కూడిన భారత బృందం సోమవారం జరిగిన రేస్‌ను 3 నిమిషాల 14.14 సెకన్ల జాతీయ రికార్డు టైమింగ్‌తో పూర్తిచేసి స్వర్ణ పతకం సాధించింది. అయితే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను మాత్రం దక్కించుకోలేకపోయింది. శ్రీలంక జట్టు రజతం, వియత్నాం బృందం కాంస్య పతకం నెగ్గాయి.

అర్జున్‌కు డ్రా

షార్జా: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఏడో రౌండ్‌లో అర్జున్ ఇరిగేసికి డ్రా ఎదురైంది. ఇరాన్‌కు చెందిన పర్హమ్‌తో జరిగిన ఈ రౌండ్‌లో 52 ఎత్తుల అనంతరం అర్జున్ (5) పాయింట్ పంచుకున్నాడు. అలీషేర్ (కజకిస్థాన్)తో జరిగిన ఏడో రౌండ్‌లో 48 ఎత్తుల తర్వాత హారిక (1.5) ఓటమిని అంగీకరించింది. రాజా రిత్విక్ (2.5) కూడా తన గేమ్‌ను డ్రాగా ముగించాడు.

మేం ఆడియో రికార్డు చేయలేదు

రోహిత్ ఆరోపణలను ఖండించిన స్టార్ గ్రూప్

న్యూఢిల్లీ: క్రికెటర్ల వ్యక్తిగత గోప్యతకు ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ భంగం కలిగిస్తుందంటూ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ఆరోపణలపై స్టార్ గ్రూప్ స్పందించింది. అసలు రోహిత్ వ్యక్తిగత సంభాషణకు చెందిన ఎలాంటి ఆడియో రికార్డును తాము ప్రసారం చేయలేదని స్పష్టం చేసింది. 'రోహిత్‌కు సంబంధించిన ఓ వీడియో క్లిప్‌తో పాటు అతడి పోస్ట్ కూడా ఇటీవల అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ వీడియోను వాంఖడే స్టేడియంలో ఈనెల 16న రికార్డు చేశాం. సైడ్‌లైన్‌లో భాగంగా అభిషేక్ నాయర్‌తో మాట్లాడిన దాన్ని కూడా కొన్ని సెకన్లపాటు అలా చూపాం. కానీ ఆడియోను రికార్డు చేయడం లేదా ప్రసారం చేయలేదు. ఆటగాళ్ల గోప్యతకు స్టార్ గ్రూప్ అమిత ప్రాధాన్యమిస్తుంది' అని స్టార్ తేల్చింది. అభిషేక్‌తో ముంబై కెప్టెన్సీ వ్యవహారంపై రోహిత్ సంభాషణను అదే రోజు కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి... కొంతసేపటి తర్వాత డిలీట్ చేసింది. కానీ అప్పటికే ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'ఫైనల్' అడుగు ఎవరిదో?



క్వాలిఫయర్-1లో కోల్‌కతా x సన్‌రైజర్స్ అమీతుమీ నేడు

గెలిచిన జట్టు తుది పోరుకు

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో

అహ్మదాబాద్: ఊహకందని అంచనాలతో రసవత్తరంగా సాగిన ఐపీఎల్-17వ సీజన్ లీగ్ దశ ముగిసింది. ఇక మంగళవారం నుంచి ప్లేఆఫ్స్ పోరుకు తెర లేవనుంది. గతేడాది టాప్-4లో నిలిచిన చెన్నై, గుజరాత్, ముంబై, లఖ్‌నవూలో ఒక్క జట్టు కూడా ఈసారి అర్హత సాధించకపోవడం గమనార్హం. ఈసారి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి క్వాలిఫయర్ జరుగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఇందుకు వేదిక. గెలిచిన జట్టుకు నేరుగా ఫైనల్‌కు వెళ్లే గోల్డెన్ చాన్స్ ఉండడంతో ఇరు జట్ల అభిమానులు హోరాహోరీ పోరును ఆశిస్తున్నారు. ఓడిన జట్టు క్వాలిఫయర్-2లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. కోల్‌కతా చివరి రెండు మ్యాచ్‌లు వర్షార్పణం కావడంతో వారికి సరైన మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. అటు రైజర్స్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్‌పై ఘనవిజయం సాధించి జోష్‌లో ఉంది. తాజా సీజన్‌లో ఈ రెండింటి మధ్య ఈడెన్‌లో ఓ మ్యాచ్ జరగ్గా కేకేఆర్ నాలుగు పరుగుల తేడాతో గెలిచింది. ఓవరాల్‌గా ఈ రెండు జట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా.. కేకేఆర్ 17, రైజర్స్ 9 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

వీరబాదుడే లక్ష్యంగా..

గతేడాది పట్టికలో అట్టడుగున నిలిచిన రైజర్స్.. ఈ సీజన్‌లో ఊహకందని రీతిలో చెలరేగుతోంది. ఆ జట్టు ఫ్యాన్స్ కూడా ఇలాంటి భీకర ఫామ్‌ను అంచనా వేయలేకపోయారు. ఇప్పటికే అత్యధిక స్కోరు రికార్డును అధిగమించిన ఈ జట్టు ఈ మ్యాచ్‌లోనూ బౌలర్లపై విరుచుకుపడాలని భావిస్తోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (533 రన్స్), అభిషేక్ శర్మ (467) పోటాపోటీ బౌండరీలతో పవర్‌ప్లేలోనే జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళుతోంది. ఈ ఇద్దరూ 200కు పైగా స్ట్రయికరేట్‌తో ఆడుతుండడంతో బౌలర్ల దిమ్మ తిరిగిపోతోంది. హెడ్ బాదుడును ప్రేరణగా తీసుకుంటూ అభిషేక్ హిట్టింగ్‌కు దిగుతుండడంతో రైజర్స్ పరుగుల వరద పారిస్తోంది. గత ఆరు సీజన్లలో 31 సిక్సర్లు బాదిన శర్మ ఈ సీజన్‌లోనే 41 సిక్సర్లతో అదరగొట్టాడు. అయితే మిడిలార్డర్‌లో నితీశ్, క్లాసెన్ మాత్రమే రాణిస్తున్నారు. అలాగే వన్‌డౌన్‌లో రాహుల్ త్రిపాఠినే కొనసాగించవచ్చు. సమద్, షాబాజ్ ఆఖర్లో వేగం కనబర్చుతున్నారు. బౌలింగ్‌లో స్పిన్ బలహీనంగా కనిపిస్తున్నా కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్, ఉనాద్కట్‌లతో పేస్ దళం మాత్రం పటిష్ఠంగా ఉంది.

సాల్ట్ లేకుండానే..

లీగ్ మ్యాచ్‌ల్లో కోల్‌కతా మెరుపు ఆరంభాలకు ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ది ప్రధాన పాత్ర. కానీ పాక్‌తో టీ20 సిరీస్ కోసం అతడు ఇంగ్లండ్‌కు వెళ్లడంతో కేకేఆర్‌కు కీలక సమయంలో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. మరో ఓపెనర్ నరైన్ (461 రన్స్), సాల్ట్ (435) జట్టులో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్లు. అతడి స్థానాన్ని భర్తీ చేసేందుకు రహ్మనుల్లా గుర్బాజ్‌ను పరీక్షిద్దామనుకున్నా రాజస్థాన్‌తో మ్యాచ్ వర్షార్పణమైంది. దీంతో నరైన్ బాదుడుపై భారీ స్కోరు ఆధారపడి ఉంది. వన్‌డౌన్‌లో రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్‌లను సందర్భాన్ని బట్టి ఆడిస్తున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ శ్రేయాస్ పెద్దగా ఆకట్టుకోవడం లేదు. అయితే నితీశ్ రాణా బరిలోకి దిగిన ఒక్క మ్యాచ్‌లో వేగంగా ఆడాడు. ఇక ఆండ్రీ రస్సెల్, రింకూ సింగ్ హిట్టింగ్ డెత్ ఓవర్లలో కీలకం కానుంది. బౌలింగ్‌లో నరైన్, వరుణ్ చక్రవర్తిల రూపంలో స్పిన్ బలంగా కనిపిస్తుండగా, పేస్‌లో మిచెల్ స్టార్క్, హర్షిత్ రాణా ఇబ్బందిపెట్టాలనుకుంటున్నారు.

తుది జట్లు (అంచనా)

కోల్‌కతా: గుర్బాజ్, నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నితీశ్ రాణా, రస్సెల్, రింకూ సింగ్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి.

సన్‌రైజర్స్: హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్, క్లాసెన్, షాబాజ్, సమద్, సన్వీర్ సింగ్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్.

పిచ్, వాతావరణం

చక్కటి పేస్, బౌన్స్‌తో ఇక్కడి వికెట్ బ్యాటింగ్, పేసర్లకు అనుకూలించనుంది. భారీ స్కోర్లకు అవకాశం ఉండదు. గత 12 ఇన్నింగ్స్‌లో రెండుసార్లు మాత్రమే 200+ స్కోర్లు నమోదయ్యాయి. అలాగే చివరి ఐదు మ్యాచ్‌ల్లో చేజింగ్ జట్లే గెలిచాయి. కాబట్టి టాస్ నెగ్గిన టీమ్ ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు.

ఫేవరెట్ సింధు

మలేసియా ఓపెన్



కౌలాలంపూర్: ఆటకు స్వల్ప విరామం ఇచ్చిన ఏస్ షట్లర్ పీవీ సింధు.. మంగళవారం నుంచి జరిగే మలేసియా ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన తర్వాత సింధు ఆశించిన స్థాయి ప్రదర్శన కనబర్చలేక పోతోంది. ఈ నేపథ్యంలో ఉబెర్ కప్, థాయ్ ఓపెన్‌ల నుంచి తప్పుకొన్న సింధు.. పారిస్ ఒలింపిక్స్ ముందు ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలనుకొంటోంది. తొలి రౌండ్‌లో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో సింధు తలపడనుంది. అన్ సి యంగ్, చెన్ యు ఫీ, యమగూచి, కరోలినా మారిన్ లాంటి స్టార్ షట్లర్లు ఈ టోర్నీకి దూరం కావడంతో.. సింధు టైటిల్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అస్మిత చలీహా, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల్లో కిరణ్ జార్జ్ ఒక్కడే పోటీలో ఉన్నాడు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెలతోపాటు పాలక్-ఉన్నతి, రితుపర్ణ-శ్వేతపర్ణ, సిమ్రన్-రితిక, కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్ జంటలు బరిలోకి దిగనున్నాయి. మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి-సుమీత్ జోడీ కూడా ఆడనుంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

60% ఐదో దశలో పోలింగ్.. బారాముల్లాలో భారీగా
ఓటు వేయలేకపోయిన మమత సోదరుడు
8

దక్షిణాదిలో అధిక సీట్లు మాకే

- 1 మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లు దాటేస్తాం
- 1 కీలక హామీలను 125 రోజుల్లో అమలుచేస్తాం
- 1 బెంగాల్, ఒడిసాల్లో మాకు విశేష ప్రజాదరణ
- 1 దీంతో విపక్షాలు, మీడియాకు నిద్ర కరువు: మోదీ



మంగళవారం | 21-5-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

అవి ప్రాణాంతక దాడులే!



డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు నివేదిక సమర్పిస్తున్న సిట్ చీఫ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, ఏసీబీ ఎస్పీ రమాదేవి

కుట్ర కోణమూ ఉంది

ఇంత తీవ్రత ఉన్న కేసుల్లో పోలీసుల దర్యాప్తు లోపభూయిష్ఠం

- ఎన్నికల్లో హింసపై 'సిట్' ప్రాథమిక నివేదిక
- డీజీపీకి సమర్పించిన ఐజీ బ్రిజ్‌లాల్, ఎస్పీ రమాదేవి
- పల్నాడు, అనంత, తిరుపతి జిల్లాల్లో 33 కేసులు
- పోలీసులు పేర్కొన్న నిందితులు 1,370 మంది
- అరెస్టు చేసింది మాత్రం 124 మందినే
- మిగతావారినీ త్వరగా పట్టుకోవాలి
- కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలి
- కుట్రదారులను గుర్తించి విచారించాలి
- నమోదైన కేసుల్లో అదనపు సెక్షన్లు చేర్చాలి
- ప్రత్యేక దర్యాప్తు బృందం సూచనలు
- వాటిని అమలు చేయాలని ఎస్పీలకు పోలీసు బాస్ ఆదేశం
- రిపోర్టును ఈసీకి పంపిన డీజీపీ
- కొందరు పోలీసులపైనా కేసులు?

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలన్నీ ప్రాణాంతకమైనవేనని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తేల్చింది. ఇంతటి తీవ్రమైన కేసుల్లో స్థానిక పోలీసుల దర్యాప్తు లోపభూయిష్ఠంగా ఉందని ఆక్షేపించింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో నమోదైన 33 కేసుల్లో 1,370 మంది నిందితులు ఉంటే కేవలం 124 మందినే స్థానిక పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. ఎఫ్ఐఆర్‌లలో నమోదు చేసిన సెక్షన్లకు అదనపు సెక్షన్లను చేర్చాలని స్థానిక ఎస్‌హెచ్‌వోలను ఆదేశించింది. సిట్ అధిపతి ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, ఏసీబీ ఎస్పీ రమాదేవి సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు 150 పేజీల రహస్య ప్రాథమిక నివేదికను అందజేశారు. రెండ్రోజుల పాటు మూడు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యక్ష సాక్షులు, బాధితులతో మాట్లాడిన సిట్ బృందాలు హింస తీవ్రత, కుట్ర కోణాన్ని గుర్తించాయి. అందుకు అనుగుణంగా పోలీసులు సెక్షన్లు నమోదు

మిగతా 10వ పేజీలో...

కొనసాగనున్న సిట్!

అరెస్టులు, చార్జిషీట్లు పూర్తయ్యేదాకా దానిదే బాధ్యత

గుంటూరు ఐజీ, అనంత డీఐజీలతో కలిసి పనిచేయాలని బ్రిజ్‌లాల్‌కు డీజీపీ నిర్దేశం

డీజీపీ దృష్టికి ఆ పోలీసుల పాత్ర?

ఈ నెల 13న పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో కొందరు పోలీసుల పాత్రను సిట్ గుర్తించినట్లు తెలిసింది. పల్నాడు ప్రాంతంలో ఏ పోలీసు అధికారి ఎవరికి వత్తాసు పలికారు.. ఏ కానిస్టేబుల్ ఎవరికి సమాచారం అందజేశారు.. డబ్బులకు అమ్ముడు పోయిన సీఐలు, ఎస్ఐలు ఎవరు.. అనే విషయాలపై కూపీ లాగిన సిట్ బృందాలు.. తప్పు చేసిన ఖాకీలపై ఎఫ్ఐఆర్‌ల నమోదుకు డీజీపీకి సిఫారసు చేసినట్లు సమాచారం. గొడవలు జరుగుతాయని ముందే తెలిసి అక్కడి నుంచి జారుకున్న ఓ సీఐ, ప్రతిపక్షాల అభ్యర్థుల కదలికలపై సమాచారం అందజేసిన ఇంకో సీఐ, రాళ్ల వర్షం కురుస్తున్నా చోద్యం చూసిన ఓ డీఎస్పీ.. ఇలా ఎవరెవరి పాత్ర ఎక్కడెక్కడ ఎంతో ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇప్పటికే సస్పెండైన 12 మందిలోనూ అలాంటి వారు ఉన్నట్లు తెలిసింది. మరికొందరి పాత్రపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.



రాష్ట్ర పరిపాలనకు గుండెకాయ సచివాలయం! ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు విధిగా సచివాలయానికి రావాలి. కానీ... జగన్ పాలనలో 'సచివాలయం' అలంకార ప్రాయంగా మారింది.

60 నెలల పాలనలో జగన్ కేవలం 50 కేబినెట్ సమావేశాలు నిర్వహించారు. అందులో అత్యధికం అస్మదీయులకు భూముల కేటాయింపు వంటి 'సొంత' అజెండాతోనే!

కేబినెట్ సమావేశాలున్నప్పుడు మాత్రమే... అదీ తప్పనిసరి కావడంతో జగన్ సచివాలయానికి వెళ్లారు.

చంద్రబాబు ఐదేళ్లలో 108 కేబినెట్ భేటీలు నిర్వహించారు. జిల్లా పర్యటనలు, ఇతర ముఖ్యమైన అధికార విధులు ఉంటే మినహా... ప్రతి రోజూ ఆయన సచివాలయానికి హాజరయ్యేవారు.

అనుభవించు రాజా..!

ఐదేళ్లలో జగన్ 'ఇష్టారాజ్యం'



అనుభవించు రాజా
పుట్టిందీ... పెరిగిందీ...
ఎందుకూ!
అనుభవించు రాజా!

ఇదో సినీ గీతం! జగన్మోహన్ రెడ్డికి ఈ పాట సరిగ్గా సూటవుతుంది. ఆయన ఐదేళ్ల పాలన ఇలాగే సాగింది.

- 60 నెలల్లో కేవలం 50 కేబినెట్ భేటీలు
- అప్పుడు మాత్రమే సచివాలయ సందర్శన
- తాడేపల్లి ప్యాలెస్ నుంచే పాలనంతా
- చంద్రబాబు హయాంలో 108 భేటీలు
- విధిగా సచివాలయం డ్యూటీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తాను అధికార దర్పాన్ని అనుభవించడానికి, ప్రతిపక్ష నేతలపై పగ సాధించడానికే జగన్మోహన్‌రెడ్డికి పదవి దక్కినట్లయింది! ఒక్క ముక్కలో చెప్పాలంటే.. పాలన ఎలా చేయకూడదో చెప్పడానికి జగన్ సర్కారే ఒక ఉదాహరణ. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రజలను దూరంగా ఉంచారు. తాను 'ప్యాలెస్' వీడి బయటికి అడుగు పెట్టినప్పుడూ... పరదాలు,

మిగతా 10వ పేజీలో...



9

ఏకపక్షంగా భూ రికార్డుల్లో పేర్ల
మార్పు కుదరదు
రెవెన్యూ తీరును తప్పుబట్టిన హైకోర్టు
ఎన్నో వ్యాజ్యాలొస్తున్నాయని ఆందోళన
భూ యజమానులకు నోటీసులివ్వాలి
వారి వివరణ తీసుకున్నాకే ముందుకు వెళ్లాలని ఆదేశాలు



9

తిరుమలలో మళ్లీ చిరుతల కలకలం
దివ్యారామం వద్ద చూశామన్న భక్తులు
అటవీ, విజిలెన్స్ అధికారులు అప్రమత్తం



8

ప్రాణాలు బోల్తా!
20 అడుగుల లోయలోకి పల్టీ కొట్టిన ట్రక్కు
19 మంది తునికాకు కూలీలు దుర్మరణం
మృతుల్లో 18 మంది మహిళలే
ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్‌లో ఘటన

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!
24 కల్లా వాయుగుండంగా మార్పు 10
25న ఒడిసాలో తీరం దాటే చాన్స్
తుఫానుగా మారేందుకూ అవకాశం?
రుతుపవనాల పురోగతికి దోహదం
నేడు, రేపు సీమ, ఉత్తరాంధ్రలో వర్షాలు



హెలికాప్టర్ కూలిన ప్రాంతంలో సహాయక చర్యలు



హెలికాప్టర్ ప్రమాదంలో..

ఇరాన్ అధ్యక్షుడి దుర్మరణం

- విదేశాంగ మంత్రి సహా.. 8 మంది మృతి
- వాతావరణ పరిస్థితి, కాలంచెల్లిన చాపర్‌తోనే..
- టెక్నాలజీలో వెనుకంజతో వెదుకులాట జాప్యం
- నేడు తబ్రీజ్ నగరంలో రైసీ అంత్యక్రియలు
- తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బేర్
- సంబంధాల బలోపేతానికి రైసీ కృషి: మోదీ
- రైసీ మరణం.. ఇజ్రాయెల్‌పై నెటిజన్ల ట్రోల్!
- మెగసెసె నుంచి వైఎస్ వరకు
- నేతలను బలిగొన్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు

టెహ్రాన్, మే 20: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ(63) హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ భారీ వర్షాలు, దట్టమైన పొగ మంచు, ఈదురుగాలులతో తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని పర్వతాల మధ్య ఉన్న డిజ్మార్ అటవీ ప్రాంతంలో కూలిపోయింది. 20కి పైగా ప్రత్యేక బృందాలు, ఇరాన్ సైన్యం, ఇరాన్ రెడ్‌క్రిసెంట్ బృందాలు,

మిగతా 8వ పేజీలో...

ఎవరికి ఎన్ని సీట్లో?

- అభ్యర్థుల లెక్కలు.. పార్టీల విశ్లేషణలు.. ఇప్పటికే సర్వే బృందాల నివేదికలు
- వాటిపై సమాలోచనలు.. విదేశీ పర్యటనకు ముందు బృందాలతో బాబు సమీక్ష
- కూటమికి 115 రావచ్చని ఓ అంచనా.. 136 దాటొచ్చని మరో విశ్లేషణ
- పోటాపోటీ అంటున్న వైసీపీ టీంలు.. తమ మద్దతు కీలకమంటున్న బీజేపీ
- అటు అభ్యర్థుల వ్యక్తిగత సర్వేలు.. ప్రత్యర్థుల రిపోర్టులూ తెప్పించుకుని ఆరా
- వాటితో పొల్చుకున్నాక కొందరిలో జోష్.. మరికొందరు బేజార్ 10
- సందట్లో సడేమియాలా పందెంరాయుళ్ల బెడద.. కాయాలా వద్దా అనే డైలమా

మత్తు మజా.. మస్త్ మజా!

- హైదరాబాద్ వ్యాపారి బర్త్ డే సందర్భంగా బెంగళూరులోని ఫాం హౌస్‌లో రేవ్ పార్టీ
- పార్టీలో ఏపీ రాజకీయ, సినీ ప్రముఖులు.. విమానాల్లో తరలించిన నిర్వాహకులు
- అర్ధరాత్రి దాటినా తాగేసి చిందులు.. 75 శాతంపైగా ఏపీ, తెలంగాణ వాసులే 8
- కన్నడ సీరియల్ నటులు, మోడల్స్ సైతం.. భారీగా డ్రగ్స్ స్వాధీనం.. ఐదుగురిపై కేసు
- పార్టీ వద్ద మంత్రి కాకాణి స్టిక్కర్ ఉన్న వాహనం.. టాలీవుడ్‌లో మళ్లీ ప్రకంపనలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రైసీ దుర్మరణం

హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందడం ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. భారీ వర్షాలు, పొంగ మంచుతో ప్రకృతి ప్రతికూలంగా మారిపోవడం ఈ దుర్ఘటనకు కారణంగా కనిపిస్తున్నప్పటికీ, గాజా యుద్ధంతో ఇరాన్–ఇజ్రాయెల్ వైరం పతాక స్థాయిలో ఉన్నప్పుడు రైసీ మరణం పలు అనుమానాలతో పాటు, సరికొత్త భయాలను కూడా కలిగిస్తోంది. అనేక దశాబ్దాల తరువాత ఇజ్రాయెల్‌తో ఇరాన్ నేరుగా తలబడటం ఇబ్రహీం రైసీ ఏలుబడిలో ఇటీవలే జరిగింది. వందలాది డ్రోన్లు, క్షిపణులతో సాగిన ఆ దాడికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక, ఇరాన్ ఆర్థిక, ఆయుధ సహకారంతో హౌతీ, హిజ్బుల్లా ఇత్యాదిసంస్థలు ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెంవేసేందుకు, ఎర్రసముద్రం దాడులతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీసి అగ్ర రాజ్యాలపై ఒత్తిడిపెంచేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇంతటి కీలకమైన సమయంలో ఇరాన్ అధ్యక్షుడు మరణించడంతో ఇజ్రాయెల్ మీదకు అనుమానాలు పోవడం సహజం. తన ప్రమేయం ఏమాత్రం లేదని ఇజ్రాయెల్ ప్రమాణం చేస్తున్నప్పటికీ, ఇప్పట్లో ఆ సందేహాలకు తెరపడే అవకాశాలైతే లేవు.

ఈ ప్రయాణంలో ఇరాన్ అధ్యక్షుడు వినియోగించిన బెల్ హెలికాప్టర్ అనేక దశాబ్దాల నాటిది. ఇస్లామిక్ విప్లవంకంటే ముందే దీనిని కొనుగోలుచేసి ఉండాలని కొందరి అంచనా. ఆ తరువాత అమెరికా ఆంక్షలు, కక్షసాధింపు చర్యలు తెలిసినవే. కొత్త హెలికాప్టర్లను కొనగలిగే అవకాశం ఎలాగూ లేకపోగా, ఉన్నవాటి విడిభాగాలకోసం కూడా వెతుక్కుంటున్న స్థితి ఇరాన్‌ది. పశ్చిమదేశాలతో కాస్తంత సయోధ్య సాధించి కష్టాలనుండి బయటపడదామని ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలకు అమెరికా అడ్డుపడుతూనే ఉంది. ఒబామా కాలంలో పశ్చిమదేశాలకూ ఇరాన్‌కూ మధ్య కుదిరిన అణు ఒప్పందం ప్రపంచానికి ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. కానీ, డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే ఈ ఒప్పందం నుండి వైదొలిగి తిరిగి అగ్గిరాజేశారు. ఈ కక్షపూరిత వైఖరే రైసీ ఎదుగుదలకు కూడా దోహదం చేసింది. ఇరాన్ అత్యున్నత మతపెద్ద అయతొల్లా అలీ ఖమేనీ అండదండలతో, ఆశీస్సులతో పైకి ఎదిగిన రైసీ 2017 అధ్యక్ష ఎన్నికల్లో హసన్ రౌహానీతో పోటీపడి ఓడిపోయారు. 2015లో పశ్చిమదేశాలతో అణు ఒప్పందం కుదుర్చుకోవడంలో హసన్ రౌహానీ చొరవ కాదనలేనిది. ఆయనకు ఆధునికుడిగా, ఆలోచనాపరుడుగా అక్కడి ఉన్నత స్థానాల్లోనూ, ప్రజల్లోనూ మంచి పేరుంది. ఇక, 2018లో ట్రంప్ ఈ అణు ఒప్పందం నుంచి వైదొలిగి, మరిన్ని కఠినమైన ఆంక్షలతో తిరిగి ఇరాన్‌ను వేధించడం ఆరంభించడంతో పరిస్థితులు రైసీకి ఉపకరించాయి. ఆయనకు ఖమేనీ అనేక కీలక పదవులు కట్టబెట్టారు. 2021లో రౌహానీని సులువుగా ఓడించి రైసీ దేశాధ్యక్షుడు కాగలిగారు. కానీ, పాలకుడుగా ఇంటా బయటా ఆయనకు గొప్పపేరేమీ లేదు. ఖమేనీ శిష్యుడుగా, ఛాందసత్వం అమితంగానే ఉన్న ఈయన అధికారంలోకి రాగానే దేశంలో చాలా ఆంక్షలు అమలుచేశారు. మహిళల వస్త్రధారణకు సంబంధించిన నియంత్రణలమీద పెద్ద ఎత్తున ఉద్యమాలు రేగాయి. మహసా అమిని ఘటన తీవ్ర ప్రజాగ్రహాన్ని రేపింది. మహిళా ఉద్యమాన్ని అణచివేయడంలో ఈయన ప్రదర్శించిన కర్కశత్వం చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన మరణానికి దేశంలో అందరూ చింతించడం లేదని, కొన్ని సమూహాలు వేడుక చేసుకుంటున్నాయని వార్తలు వస్తున్నాయి. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖమేనీ నిష్క్రమణ అనంతరం రైసీ ఆ స్థానాన్ని భర్తీ చేయబోతున్నారని అనుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది.

చాబహార్ పోర్టులో ఒక టెర్మినల్‌ను అభివృద్ధి చేసుకొని వాడుకొనేందుకు భారత్–ఇరాన్ మధ్య ఇటీవలే పదేళ్ళ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు రైసీ, విదేశాంగమంత్రి హుసేన్ ఆమిర్ అబ్దుల్లాహియన్ ఈ విషయంలో ఎంతో చొరవచూపి, మనకు ఎంతగానో సహకరించారంటూ విదేశాంగమంత్రి జయశంకర్ గుర్తుచేసుకున్నారు. భారత్–ఇరాన్ మధ్య అనాదిగా బలమైన మైత్రి ఉంది. కొన్ని సందర్భాల్లో మనస్పర్థలు కలిగినా అవి హద్దులు దాటలేదు. అమెరికా ఆంక్షలు, ఆదేశాల మేరకు ఇరాన్‌తో మనం వ్యవహరించే తీరులో గతంతో పోల్చితే ఎంతోమార్పు వచ్చినప్పటికీ, చమురు దిగుమతుల విషయంలో అమెరికా మాటను తుచ తప్పకుండా పాటించినప్పటికీ ఇరాన్ మన పరిస్థితిని అర్థం చేసుకుంది, సానుకూలంగానే వ్యవహరించింది. ఇప్పుడు కొత్త అధ్యక్షుడుగా ఎవరు ఎంపిక అయినప్పటికీ, ఉభయదేశాల సంబంధాలు మెరుగుపడవచ్చునే కానీ, దిగజారే అవకాశాలైతే లేవు.

మరోసారి మోదీ సర్కారే తథ్యం

నరేంద్రమోదీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం కష్టమని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. వాటికి కొందరు కుహనా, వామపక్ష మేధావులు వంత పలుకుతున్నారు. మోదీ ఏమి మాట్లాడినా ఆయన ఆత్మరక్షణలో ఉన్నారని, ఓటమి భయంతో ఉన్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమంటే 2019లో కూడా వారు ఇదే విధంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పునరుజ్జీవనం చెందుతోందని, ప్రతిపక్షాలు మునుపటికన్నా బలోపేతమవుతున్నాయని లెక్కలు చెప్పారు. కాని 2019లో కూడా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సాధించింది. 2019లో అత్యధిక స్థానాలు సంపాదించడం కూడా బీజేపీకి ఈ ఎన్నికల్లో వ్యతిరేక అంశంగా ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. 2019లో కంటే ఈసారి బీజేపీ ఎందుకు అధిక స్థానాలు సంపాదించలేదో, కొత్త ప్రాంతాల్లోకి ఎందుకు విస్తరించలేదో చెప్పేందుకు వారి వద్ద కారణాలు లేవు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఉత్తరప్రదేశ్‌నే ఉదాహరణ తీసుకుంటే ఈ రాష్ట్రంలో సమాజ్‌వాది పార్టీ–కాంగ్రెస్ కలిసి పోటీ చేసినందువల్ల వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు సంఘటితమై ఇండియా కూటమికి మద్దతుగా నిలుస్తారని ఒక బూటకపు ప్రచారానికి కాంగ్రెస్ వ్యతిరేకులు తెరదించారు. 2019లో కూడా సమాజ్ వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీ కలిసి పోటీ చేశాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలు కలిసి బీజేపీని చిత్తుగా ఓడిస్తాయని అప్పుడు కూడా గొంతెత్తి ఘోషించారు. కాని 2014 కంటే 2019లో అత్యధిక ఓట్లు, సీట్లు బీజేపీకి లభించాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు కూడా బీజేపీకి ఓటు వేసినట్లు నియోజకవర్గాల వారీ ఫలితాలు చూసిన వారికి అర్థమవుతుంది. గత అయిదు సంవత్సరాల్లో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్‌ల డబుల్ ఇంజన్ సర్కార్ యూపీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశాయి. వేల కోట్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలు, రహదారులు, రైల్వే మార్గాలతో అధునాతన యూపీ ఆవిర్భవించింది. ఒకప్పుడు రెండే విమానాశ్రయాలున్న యూపీలో ఇప్పుడు పది ఉన్నాయి. భవిష్యత్‌లో 21 విమానాశ్రయాలను నిర్మించాలని సంకల్పించారు. మాఫియా హింసాకాండను పూర్తిగా అరికట్టి శాంతి భద్రతల పరిస్థితిని అద్భుతంగా మెరుగుపరిచారు. కుల, మత, జాతి వివక్ష లేకుండా సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలను చేరుకుంటున్నాయి. వీటన్నిటికి తోడు కాశీ కారిడార్ నిర్మాణం, అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత మెజారిటీ ప్రజలు ఎంతో హర్షాతిరేకంతో ఉన్నారు. ఈ పరిణామాల వల్ల యూపీలో బీజేపీ సీట్ల సంఖ్య పెరుగుతుందా లేక తగ్గుతుందా? ఏం సాధించారని సమాజ్‌వాది పార్టీ–కాంగ్రెస్ కూటమికి ప్రజలు ఓటు వేస్తారు? అమేథిలో గత ఎన్నికల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతుల్లో ఓటమిపాలు కావడంతో ఖిన్నుడైన రాహుల్ గాంధీ ఇప్పుడు నియోజకవర్గం ప్రజలకు ముఖం చాటేసి తల్లిచాటు బిడ్డగా ఆమె ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి పోటీ చేయడం సిగ్గుచేటు కాదా? పైగా యూపీలో కూటమి ప్రభంజనం వీస్తుందని ప్రగల్భాలు పలుకుతున్నారు.



2019తో పోలిస్తే మోదీ సామాజిక పునాది మరింత విస్తరించిందే కాని తగ్గలేదు. కారణం మోదీ అమలు చేసిన సామాజిక సంక్షేమ కార్యక్రమాలు 2019లో కంటే ఇప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యాయి. బీజేపీ అంటే అగ్రవర్ణాల పార్టీ అని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని స్వీకరించేందుకు ఇప్పుడెవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే రాజకీయంగా, ఆర్థికంగా దళితులు, ఆదివాసీలు, మహిళలు, బీసీలకు బీజేపీ సాధికారికత కల్పించింది. ఈ వాస్తవం ఆ వర్గాల వారికి బాగా తెలుసు.

యూపీ మాత్రమే కాదు, బిహార్, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్, హిమాచల్, అస్సాం, ఢిల్లీ, తెలంగాణ, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూల పవనాలు ఉధృతంగా వీస్తున్నాయే కాని తగ్గడం లేదు. మోదీ హయాంలో దేశం బలోపేతం కావడం తెలిసిన ఈ రాష్ట్రాల ప్రజలు మరొక పార్టీకి ఓటు వేసే అవకాశాలే లేవు. రాష్ట్రీయ జనతాదళ్‌కు కంచుకోట అని చెప్పే బిహార్‌లోని గోపాల్‌గంజ్‌లో కూడా ప్రజలు 'జో రామ్ కో లాయే హై, హమ్ ఉన్ కో లాయేంగే' అని నినదిస్తున్నారని ఒక రాజకీయ విశ్లేషకుడు చెప్పారు. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్రీదేవి అరాచక పాలన, ఆయన బంధువుల అవినీతి వల్ల రాష్ట్రం కొన్ని దశాబ్దాల వెనుకకు వెళ్లిందని అక్కడి ప్రజలకు తెలుసు. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీయే బిహార్‌లో అత్యధిక శాతం సీట్లు, ఓట్లు సాధించింది. ఈసారి కూడా బిహార్‌లో ఎన్డీఏ 50 శాతం పైగా ఓట్లు సాధిస్తుందని ఏబీపీ–సీ ఓటర్ జరిపిన సర్వేలో తేలింది. బిహార్‌లో 69 శాతం మంది నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఈ సంస్థ సర్వే తెలిపింది. దాదాపు 60 శాతం మంది ప్రజలు మోదీ పనితీరుపై వ్యక్తం చేశారు.

నిజానికి ఈ అభిప్రాయం కేవలం బిహార్‌కు సంబంధించింది కాదు, దేశంలో అత్యధిక శాతం ప్రజానీకం నరేంద్రమోదీ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారు. ఇప్పుడు దేశంలో జరుగుతున్నది అసెంబ్లీ ఎన్నికలు కావని ప్రజలకు తెలుసు. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. కాని లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో అంశాలను ప్రజలు దృష్టిలో ఉంచుకుంటున్నారు. ముఖ్యంగా దేశంలో యువత పూర్తిగా ఇప్పుడు బీజేపీ వైపే ఉన్నదని ఎవర్ని కదిలించినా అర్థమవుతోంది. మోదీకి ఓటు వేయకపోతే ఎవరికి ఓటు వేస్తాం అని వారు ప్రశ్నిస్తున్నారు. దేశంలో సగానికిపైగా మహిళలు మోదీకి ఏకపక్షంగా ఓటు వేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. బీసీలు, ఎస్సీలు, ఆదివాసీలకు మోదీకి మించిన నాయకుడు కనపడడం లేదు. 2019తో పోలిస్తే మోదీ సామాజిక పునాది మరింత విస్తరించిందే కాని తగ్గలేదు. కారణం మోదీ అమలు చేసిన సామాజిక సంక్షేమ కార్యక్రమాలు 2019లో కంటే ఇప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యాయి. బీజేపీ అంటే అగ్రవర్ణాల పార్టీ అని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని స్వీకరించేందుకు ఇప్పుడెవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే రాజకీయంగా, ఆర్థికంగా దళితులు, ఆదివాసీలు, మహిళలు, బీసీలకు సాధికారికత కల్పించింది. ఈ వాస్తవం ఆ వర్గాల వారికి బాగా తెలుసు.

2009 లోక్‌సభ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దాదాపు 10–11కోట్ల మంది ఓటర్లు మద్దతు పలుకుతున్నారు. కాని బీజేపీకి అందుకు రెట్టింపు ఓటర్లు అంటే 22 కోట్ల మంది మద్దతునిస్తున్నారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ బీజేపీకి 15 కోట్ల మంది ఓటర్లు అధికంగా పెరిగారు. ఇది పూర్తిగా నరేంద్రమోదీ నాయకత్వం వల్ల వచ్చిన మార్పు. మోదీ ఎక్కడకు వెళ్లినా కోట్లాది ప్రజలు ఆయనకు ఘనస్వాగతం చెప్పడాన్ని పార్టీ గమనించింది. ఆయన పార్టీ యంత్రాంగాన్నే కాక మొత్తం ప్రజలను ఉత్తేజపూరితులు చేయగలిగారని తెలుసుకున్నది. మోదీ నాయకత్వం పట్ల ప్రజలు విశ్వాసం చూపిస్తున్నారని తెలిసినందువల్లే ఈసారి మోదీ కీ గ్యారంటీ అన్న పేరుతో ప్రజలకు వాగ్దానాలు చేయాలని పార్టీ నిర్ణయించింది. దీని మూలంగా 2019 కన్నా ఇప్పుడు బీజేపీకి అత్యధిక ఓటు శాతం లభించడం ఖాయం. మరి మోదీ నాయకత్వంలో ఎన్డీఏ అత్యధిక సీట్లు సాధిస్తుందనడంలో అనుమానం ఎవరికున్నది? ప్రజలకు మాత్రం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

విజయాల బాటలో ఇండియా

లోక్‌సభ ఎన్నికల ఐదో దశలో దేశవ్యాప్తంగా 49 నియోజకవర్గాల ఓటర్లు సోమవారం తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలలోని అన్ని దశల కంటే ఈ దశ చాలా చిన్నది. అయితే ఈ 49 నియోజకవర్గాల ఓటర్ల తీర్పు ఎన్నికల తుది ఫలితంపై అసమానమైన ప్రభావం చూపనున్నది. పలు ప్రతిష్ఠాత్మక పోటీలు జరగడం ఈ దశ ప్రత్యేకతల్లో ఒకటి. కొన్ని రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ తీవ్ర నష్టాలను చవి చూడనున్నది. ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలి, అమేథి, ఫైజాబాద్ (అయోధ్య); బిహార్‌లో సరణ్ (ఒకప్పుడు చాప్రా), హాజీపూర్, భారతదేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరంలోని మొత్తం ఆరు నియోజకవర్గాలు రాజకీయంగా ప్రతిష్ఠాత్మకమైనవే కాకుండా, అత్యంత ముఖ్యమైనవి. మూడో దశలో వలే ఈ ఐదవ దశలో కూడా బీజేపీ, 2019లో గెలుచుకున్న సీట్లలో చాలా వాటిని కోల్పోనున్నది. ఐదో దశలో పోలింగ్ జరిగిన 49 స్థానాలలో 39 గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏకు దక్కాయి. వాటిలో 32 బీజేపీవే కావడం గమనార్హం. 2019లో ఇండియా కూటమి ఈ 49లో కేవలం 8 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది.



■ యోగేంద్ర యాదవ్

ప్రస్తుత ఎన్నికలలో అంతకు రెట్టింపు సంఖ్యలో సీట్లను గెలుచుకోగలమనే ఆశాభావం ప్రతిపక్ష కూటమిలో ఉన్నది. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న ఓట్లు, సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఆ ఆశాభావం నిరాధారమైనది కాదని చెప్పవచ్చు. నిజానికి ఇండియా కూటమికి అంతకు మించి సీట్లు దక్కే అవకాశమున్నదనే సూచనలు బలంగా ఉన్నాయి. 2019లో రెండు కూటములు గెలుచుకున్న సీట్ల మధ్య వ్యత్యాసం 31 కాగా, ఈ తేడా ప్రస్తుత ఎన్నికలలో ఇంచుమించు 17కి తగ్గనున్నది. ఆ వ్యత్యాసం మరింత తగ్గే అవకాశమెంతైనా ఉన్నది. వీటిలో గణనీయమైన సీట్లు ఉత్తరప్రదేశ్ నుంచి ఇండియా కూటమికి దక్కనుండడం విశేషం.

ఉత్తరప్రదేశ్‌లో ఐదో దశ ఎన్నికలు జరిగిన 14 నియోజకవర్గాలు నాలుగు ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. అవి: అవధ్, పూర్వాంచల్, దో ఆబ్, బుందేల్‌ఖండ్. ఈ 14 సీట్లలో 13ను 2019లో బీజేపీ గెలుచుకున్నది. మిగతా ఒక స్థానం – రాయబరేలిని కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల వాటాను నిలుపుకున్న పక్షంలో కాంగ్రెస్ పార్టీ రాయబరేలి (ఈ నియోజకవర్గం నుంచే రాహుల్ గాంధీ పోటీ చేశారని గుర్తు చేయవలసిన అవసరమున్నదా?)నే కాకుండా అమేథి, బారాబంకి సీట్లనూ గెలుచుకోవచ్చు. కాంగ్రెస్ సీనియర్ భాగస్వామి అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీ సైతం గణనీయంగా లబ్ధి పొందే అవకాశమున్నది. 2019లో ఎస్‌పి ఈ 14 స్థానాలలో ఒక్క దానినీ గెలుచుకోలేదు. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికలలో మారిన ఓటర్ల ప్రాధాన్యాలు ప్రస్తుత ఎన్నికలలో కూడా యథాతథంగా కొనసాగిన పక్షంలో పూర్వాంచల్‌లో కౌశాంబీని, దోఆబ్‌లో ఫతేపూర్‌ను, బుందేల్‌ఖండ్‌లో బందా నియోజకవర్గాలను సమాజ్‌వాది పార్టీ తప్పక గెలుచుకోగలదు. సరే, అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో కూడా సోమవారం పోలింగ్ జరిగింది. అయోధ్యలోను, దాని చుట్టు పక్కల ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెరిగిందా లేదా అనేది ఒక ఆసక్తికరమైన విషయం.

మహారాష్ట్రలో ఈ ఐదో దశతో ఎన్నికలు ముగిసాయి. ఉద్ధవ్ సేన, షిండే సేన; ఎన్‌సీపీ (శరద్ పవార్), ఎన్‌సీపీ (అజిత్ పవార్) పార్టీల మధ్య అసలీ.. నకిలీ పోరు హోరాహోరీగా జరిగింది. ఓటర్లు ఏ సేనను అసలు శివసేనగా, ఏ ఎన్‌సీపీని అసలు ఎన్‌సీపీగా గుర్తించారో వేచి చూడవలసి ఉన్నది. ఈ పోరాట క్షేత్రాలు గ్రేటర్ ముంబై ప్రాంతంలోను, నాసిక్ ప్రాంతంలోను మాలేగావ్–ధూలే ప్రాంతంలోను ఉన్నాయి. ముంబై నగరంలోను, థానేలోను జరుగుతున్న పోటీలు ఉద్ధవ్ సేన, షిండే సేనలకు అస్తిత్వ పోరాటాలు కాగా భివాండి, దిండోరి నియోజకవర్గాల ఓటర్ల తీర్పు ఎన్‌సీపీ (శరద్ పవార్) పశ్చిమ మహారాష్ట్రలోని తన కంచుకోటల నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించగలదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది. ఉద్ధవ్ సేన ప్రప్రథమంగా డబుల్ ఎమ్ (మరాటీ మనూస్, ముస్లింలు)లపై ఆధారపడింది. ఇక ప్రస్తుతం బద్ధ శత్రువుగా ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా సంయుక్త మహారాష్ట్ర ఉద్యమకాలం నాటి మహారాష్ట్రియన్ వర్సెస్ గుజరాతీ వివాదాన్ని పునరుద్ధరించింది. మరాఠీ మనూలు, ముస్లిమ్స్ అంశాలను సంయుక్తంగా ఉపయోగించుకోవడం ప్రస్తుతానికి హేతుబద్ధంగానే కనిపిస్తోంది. కాగా సంఖ్యా బలం కూడా ఆ పార్టీ పక్షానే ఉన్నది. ముంబైలోని 6 నియోజకవర్గాలలో ఐదు ఉద్ధవ్ సేన చేతిలోనే ఉన్నాయి. 2019–22 సంవత్సరాల మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు మాటల్లోను, చేతల్లోను వివక్ష పాటించకపోవడంతో మైనారిటీ వర్గాలు సైతం ఆయన పట్ల సానుకూలంగానే ఉన్నాయి. ముంబై ఎమ్మెల్యేలు, కార్యకర్తల్లో అత్యధికులు ఉద్ధవ్ పక్షానే ఉన్నారు. ఈ కారణంగా ప్రస్తుత ఎన్నికలలో కూడా ఆ పార్టీ అత్యధిక సీట్లను గెలుచుకునే అవకాశమున్నది. తత్కారణంగా ఉద్ధవ్ సేన భాగస్వామిగా ఉన్న ఇండియా కూటమి విశేషంగా లబ్ధి పొందనున్నది.

పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్‌లలో ఇండియా కూటమికి స్వల్ప లబ్ధి సమకూరే అవకాశమున్నది. బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ తన ఒకనాటి కంచుకోట చాప్రా (ఇప్పుడు సరన్)లో తన వైభవాన్ని పునరుద్ధరించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించింది. మిథిలాంచల్‌లో రెండు సీట్లు ఎన్డీఏకు అనుకూలంగా ఉన్నాయి. దివంగత దళిత నేత రాంవిలాస్ పాశ్వాన్ నియోజకవర్గమైన హాజీపూర్‌లో బీజేపీకి మిత్రుడు అయిన ఆయన కుమారుడు పోటీ చేస్తున్నాడు. బెంగాల్ ఉత్తర పరగణాలలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఐదో దశలో హుగ్లీ, హౌరా నియోజకవర్గాలలో పోలింగ్ జరిగింది. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రాతిపదికన చూస్తే బారక్‌పూర్, హుగ్లీలో బీజేపీకి విజయావకాశాలు లేవు. అయితే తృణమూల్ కాంగ్రెస్ నుంచి అరామ్ గాబ్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవచ్చు.



ఐదో దశలో పోలింగ్ జరిగిన 49 స్థానాలలో 39 గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏకు దక్కాయి. 2019లో ఇండియా కూటమి ఈ 49లో కేవలం 8 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో అంతకు రెట్టింపు సంఖ్యలో సీట్లను గెలుచుకోగలమనే ఆశాభావం ప్రతిపక్ష కూటమిలో ఉన్నది. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న ఓట్లు, సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఆ ఆశాభావం నిరాధారమైనది కాదని చెప్పవచ్చు.

ఒడిషాలో 2019లో గెలుచుకున్న స్థానాలు అన్నిటినీ మళ్లీ స్వాయత్తం చేసుకోగలనని బీజేపీ భావిస్తోంది. ఈ దశలో ఐదు లోక్‌సభ, 35 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరిగింది. ఐదు లోక్‌సభ నియోజకవర్గాలలో బర్గా, సుందర్ గఢ్ బొలంగీర్‌లు పశ్చిమ ఒడిషాలో ఉన్నాయి. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ మూడు స్థానాలను బీజేపీ గెలుచుకున్నది. మరో రెండు స్థానాలు కంధమాల్, అస్కాను 2019లో బిజూ జనతాదళ్ గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో కూడా ఈ ఐదు స్థానాలు బీజేపీ, బిజూ జనతాదళ్ యథావిధిగా గెలుచుకునే అవకాశమున్నది. పోలింగ్ జరిగిన రెండు శాసనసభ నియోజకవర్గాలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభ్యర్థిగా ఉన్నారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి కొడెర్మను స్వాయత్తం చేసుకునే అవకాశమున్నది. ఇక్కడ సీపీఐ (ఎమ్‌ఎల్‌ఎల్) ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నాడు. జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ భార్య కల్పన కొడెర్మలోని ఒక శాసనసభా నియోజకవర్గం ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నారు.

జమ్మూ–కశ్మీర్‌లోని బారాముల్లా, లద్దాఖ్ నియోజకవర్గాలలో సోమవారం ఐదో దశ ఎన్నికలు జరిగాయి. బారాముల్లాలో నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఓమర్ అబ్దుల్లా తీవ్ర పోటీ నెదుర్కొన్నారు. జైలు నుంచి పోటీ చేసిన ఇంజనీర్ రషీద్ అబ్దుల్లాకు తీవ్ర పోటీ నిచ్చారు. లద్దాఖ్‌లో ఇటీవలి వరకు ఇండియా కూటమికి సానుకూలత ఉన్నది. అయితే ఎన్‌సి, ఐఎన్‌సికి చెందిన కార్గిల్ ప్రాంత నేతలు, కార్యకర్తలు తిరుగుబాటు చేసి లేహ్ నుంచి ఒక అభ్యర్థిని సంయుక్తంగా పోటీకి నిలబెట్టారు. ఫలితంగా ఇండియా, ఎన్డీఏ ఓట్లు చీలిపోయే అవకాశమున్నందున కార్గిల్‌కు చెందిన స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించే అవకాశమున్నది.

మొత్తం మీద ఈ ఐదో దశ బీజేపీకి క్లిష్ట సమయం. 2019 నాటి ఆధిక్యతను నిలబెట్టుకోగలదా అన్నది సందేహమే. మా అంచనాలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఇప్పటికే మొదటి నాలుగు దశలలో 40 సీట్లను నష్టపోనున్నది. 5, 6, 7 దశలలో సైతం ఇంచుమించు అదే సంఖ్యలో సీట్లను కోల్పోయే అవకాశమున్నది. ఈ నష్టాల పరంపరను ఐదో దశ నుంచే నిరోధించలేని పక్షంలో జూన్ 4న ఎన్డీఏ తన మెజారిటీని, కనీసం బీజేపీ తన సొంత ఆధిక్యతను కోల్పోవడం దాదాపుగా తథ్యం. ఇది నిశ్చితంగా సంభవించనున్న పరిణామం.

(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)
(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

వారిని అనర్హులుగా ప్రకటించాలి


2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ఆ పార్టీ నాయకులు దాడులు చేసారు. నామినేషన్ పత్రాలు లాక్కున్నారు. అలా స్థానిక సంస్థలను 99 శాతం వాళ్ళే దక్కించుకున్నారు. గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో విధ్వంసం, దాడులు అరాచకాలు షరా మామూలే అనే విధంగా సాగాయి. చివరకు ఇప్పుడు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూడా మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉన్నా, పోలింగ్ సందర్భంగా జరిగిన దాడులను చూస్తే ఏమనాలో అర్థం కావడం లేదు. తెనాలిలో ఏకంగా ఆ పార్టీ ఎమ్మెల్యే ఒక ఓటర్ మీద దాడి చేసారు. నరసరావుపేట ఎంపీ టీడీపీ అభ్యర్థి, మాచర్ల, గురజాల టీడీపీ అభ్యర్థుల వాహనాల మీద వైఎస్సార్‌సీపీ మూకలు దాడులు చేసాయి. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ జనసేన, టీడీపీ ఏజెంట్లను కిడ్నాప్ చేసారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచక ముఠాలు యథాతథంగా కొన్నిచోట్ల టీడీపీ శ్రేణుల మీద దాడులు చేశాయి. కడప పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొన్నిచోట్ల టీడీపీ ఓటర్లను వైఎస్సార్‌సీపీ మూకలు భయాందోళనకు గురి చేశాయి. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్వగ్రామం అయిన నల్ల సింగయ్యగారి పల్లెలో ఉన్న పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్లను తరిమేసి ఏకపక్షంగా రిగ్గింగ్ చేసుకున్నారు. అనంతరం అక్కడి పరిస్థితులను పరిశీలించడానికి వెళ్లిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి మీద, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మీద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడులు చేశారు. ఇలా దాడులు చేసిన, చేయించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఎన్నికల కమిషన్ అనర్హులుగా ప్రకటించాలని యావత్ ప్రజానీకం అభ్యర్థిస్తున్నది.

– తిప్పినేని రామదాసప్పనాయుడు

నవ భారత వైతాళికుడు

మానవ జీవిత పురోగమనానికి అనుగుణమైన సాంఘిక పరిణామాలు తీసుకురావడానికి తమ జీవితాలను అర్పించిన ధర్మ యోధులే నవయుగ వైతాళికులు. 18వ శతాబ్దపు చివరిలో భారతదేశం ఎంతో దైన్యస్థితిలో ఉండేది. దేశమంతా విగ్రహారాధన, జంతు బలులు, నర బలులు, మత న్యూనతాధిక్యతలు, కలహాలు, అస్పృశ్యత, కన్యాశుల్కం, వరకట్నం, కుల, మత భేదాలు, బాల్య వృద్ధ వివాహాలు, సతీసహగమనాలు, బహుభార్యాత్వం మొదలైన ఎన్నో సాంఘిక దురాచారాలతో నిండిపోయి ఉంది. ఇంకొక పక్క మహమ్మదీయ మత ఛాందస ధోరణి, కొత్తగా వెలిసిన క్రైస్తవ మత తీవ్ర ప్రచారం– వీటి మధ్య ప్రజలు నలిగిపోయారు. స్త్రీల పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఈ మూఢ బంధాల నుంచి ప్రజలకు విమోచనం కలిగించడానికి ఆనాటి మేధావులైన భారతీయులు కొందరు పూనుకున్నారు. వారిలో ప్రథముడు రాజా రామమోహన రాయ్.

1772 మే 22న బెంగాల్ రాష్ట్రంలోని, హుగ్లీ జిల్లా, రాధా నగర్ అనే గ్రామంలో రామమోహన్ రాయ్ జన్మించారు. తల్లిదండ్రులు రమాకాంత రాయలు, తారిణీ దేవి. ఇంటివద్దనే పారసీ భాష, స్కూల్లో బెంగాలీ భాష నేర్చుకున్నారు. 9వ ఏట పాట్నా వెళ్ళి అరబ్బీ భాష అభ్యసించారు. 12వ ఏట కాశీ వెళ్ళి సంస్కృతం భాష నేర్చుకుని, హిందూ మతగ్రంథ పఠనం సాగించారు. 1815లో 'హిందువుల విగ్రహారాధన' అనే పుస్తకం రచించి విగ్రహారాధనను ఖండించారు. 22వ ఏట ఉద్యోగంలో చేరారు. ఇంగ్లీష్ భాష నేర్చుకున్నారు. 1815–1828 మధ్య కలకత్తాలో 5141 సతీ సహగమనాలు జరిగాయి. ఆయన వదినగారే దీనికి బలి అయ్యారు. అందుకు ఆయన తీవ్రంగా స్పందించి ఉద్యమం చేపట్టారు.



నికృష్ట దశలో ఉన్న భారత జాతి పునరుద్ధరణకు బ్రహ్మ సమాజం ఆవిర్భవించింది. ముగ్గురు మహనీయులు దీని అభివృద్ధికి మూడు దశలలో కారకులయ్యారు. వారు రాజా రామమోహన రాయ్, మహర్షి దేవేంద్రనాద్ టాగూర్, బ్రహ్మానంద కేశవ చంద్రసేన్. రాజా రామమోహన రాయ్ వివిధ మతాలను కూలంకషంగా పరిశీలించి, సర్వ మతాలు ఒకే మూల సత్యాన్ని వెల్లడిస్తున్నాయని గ్రహించారు. అదే వేద సారం, సర్వ మత సారం, విశ్వ మానవ ధర్మం, బ్రహ్మ ధర్మం. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, యూదులలో సద్భావన కలిగించడానికి ఒక్కటే ఉపాయమని, అదే ఏకేశ్వరుని మానసికోపాసన అని, అన్ని మతాల ఉపదేశాలు ఈ విషయంలో ఏకీభవిస్తున్నాయని ఆయన సప్రమాణంగా రుజువు చేశారు.

శతాబ్దాల నమ్మకాల నుంచి ప్రజలను మళ్ళించి ఉపాసన ప్రతి ఒక్కరికి సాధ్యమని చెప్పారు. గురువులు, బాబాలు, పూజారులు, మధ్యవర్తులు, పవిత్ర గ్రంథాలు – వీటి అవసరం ఏదీ లేకుండా భగవంతుని సూటిగా ఆరాధించవచ్చునని రామమోహన్ రాయ్ వెల్లడించారు. అంటే పౌరాణిక భావాల నుంచి, సనాతన వైదికధర్మ భావాల వైపు మళ్ళించారు. ఎవరి నమ్మకాలు ఏమైనా, విభేదాలు ఎన్ని వున్నా, ఏకేశ్వర విశ్వాసులందరు, నానా మతస్థులు కలిసి ఒక చోట చేరి, జగత్కర్త, జగత్పిత అయిన ఆ పరమేశ్వరుని ఉపాసించవచ్చునని ఆయన విశదీకరించారు. ఈ ఏకేశ్వర ఉపాసన వ్యాప్తికై 'బ్రహ్మ సభ' అనే సంఘాన్ని 1828 ఆగస్ట్ 20న స్థాపించారు. తర్వాత దీనినే 'బ్రహ్మ సమాజం' అన్నారు. ఏకేశ్వరోపాసనకు అనువైన మందిరాన్ని కలకత్తాలో 1830లో ఆయన నిర్మించారు. ఆ మందిరంలో చేయవలసిన ఉపాసన లక్ష్యం, విధానం, ఉపాసకులు పాటించవలసిన నియమాలను నిర్దేశిస్తూ ఆయన ఒక 'ధర్మ పత్రం' ప్రకటించారు. ఆధ్యాత్మిక, స్వాతంత్ర్యాలను ప్రతిబింబించే ఆ ధర్మ పత్రం (ట్రస్ట్ డీడ్)లో ఏకేశ్వర విశ్వాసం కల వారెవరైనా జాతి, మత, కుల భేదాలు లేకుండా భక్తి, శ్రద్ధలతో అందులో చేరి ప్రార్థించుకోవచ్చునని ప్రకటించారు. ఈ విధంగా రామమోహన్ రాయ్ సర్వ మత సమన్వయాన్ని సాధించి దేశ కల్యాణానికి మార్గదర్శకులు అయ్యారు. బ్రహ్మ సమాజం ఎన్నో సాంఘిక, మత సంస్కరణలకు కారణం అయ్యింది. ఈనాడు బాల్య వివాహాలు లేవు. వితంతు, కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలు సంఘ ఆమోదం పొందాయి. స్త్రీ విద్య సామాన్య వ్యవహారమైంది. 19వ శతాబ్దంలో భారత జాతి జీవనాన్ని వివిధ రంగాలలో తీర్చిదిద్దిన దేశభక్తులందరూ బ్రహ్మసమాజ విశాల ధర్మ ప్రభావాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పొందినవారే.

అసంఖ్యాకములై శాఖోపశాఖలుగా విస్తరించిన కుల భేదాలు ప్రజలలో దేశాభిమానాన్ని, భారతీయతను పూర్తిగా నాశనం చేశాయని రామమోహన్ రాయ్ సంఘోద్ధరణకు పూనుకుని స్త్రీ విద్యావశ్యకతను నిరూపించి, బహుభార్యాత్వాన్ని ఖండించారు. సతీ సహగమనాన్ని నిషేధింపచేసారు. ఆయన స్వాతంత్ర్య పిపాసి. ఆయన జీవితంలో జాతీయత, విశ్వజనీనత మిళితమైనాయి. దేశ ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం లేనిదే మత, సాంఘిక స్వాతంత్ర్యాలు ప్రయోజనకరం కావన్న ఉద్దేశంతో రామమోహన్ రాయ్, బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులతో వాదించి భారత దేశ పరిపాలనలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టడానికి కారకులయ్యారు. భారతదేశానికి వెన్నెముక అయిన రైతుల శ్రేయస్సులోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉన్నదని గ్రహించి, పన్నులు విధించడంలోను, పరిపాలన విధానంలోను అనేక మార్పులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించారు.

'నానాజాతి సమితి' స్థాపనకు ఆయనే పునాదులు వేశారు. ప్రపంచమంతా ఒకటేనని, జాతుల మధ్య, దేశాల మధ్య భేద భావాలు వచ్చినప్పుడు అన్ని జాతులు కలిసి ఒక సంఘంగా ఏర్పడి, ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క దేశం వారు దానికి అధ్యక్షులుగా ఉండాలని, ఒక్కొక్క సమావేశం వేరు వేరు దేశాలలో జరగాలని ఆయన సూచించారు. పర ప్రభుత్వాన్ని నిరసిస్తూనే, పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాల వలన కలిగే ప్రయోజనాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి వారి సుఖ జీవనానికి తోడ్పడకపోతే బ్రిటీష్ ప్రభుత్వం కేవలం పశుబలంతో భారతదేశాన్ని పాలించలేదని, ప్రజలు తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టడం తథ్యమని జోస్యం చెప్పిన మహా మేధావి.

రామమోహన్, బ్రహ్మ మందిరానికి శ్రీ రామచంద్ర విద్యావాగీష్ అనే ఆచార్యుడిని నియమించారు. 1833లో ఆయన ఇంగ్లాండ్ వెళ్ళారు. అక్కడే బ్రిస్టల్ నగరంలో సెప్టెంబర్ 27న మరణించారు.

■ కేశవ చంద్ చల్లా
అధ్యక్షులు, హైదరాబాద్ దక్కన్ బ్రహ్మసమాజ్

(రేపు రాజా రామమోహన రాయ్ 252వ జయంతి)

కళాసేవకుడు... నిర్మాణ సారథి!

తీర ప్రాంతంలోని చిన్న వ్యవసాయ కుటుంబంలో జన్మించి సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించిన జక్కా శ్రీనివాసులురెడ్డి (జె.ఎస్.రెడ్డి) దేశంలోనే కీలకమైన వ్యక్తిగా ఎదిగారు. నిర్మాణ రంగంలో పనిచేస్తూ గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాలలో డ్యాములు, భారీ ప్రాజెక్టులు నిర్మించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు మాత్రమే కాకుండా ప్రపంచ బ్యాంకు గౌరవం పొందారు. నెల్లూరు పట్టణంలో సామాజిక, సాంఘిక, సాహితీ, కళా రంగాల రూపురేఖలు మార్చారు.

నెల్లూరు జిల్లా ఇందుకూరు మండలం జగదేవిపేటలో మార్చి 1945లో జన్మించిన వీరు, జిల్లాలో విద్యాభ్యాసం అనంతరం తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులు అయ్యారు. విద్యాభ్యాసం అనంతరం మేనమామ గుణపాటి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తిరుమల రెండవ ఘాటు రోడ్డు పనుల్లో పర్యవేక్షణ మేనేజర్‌గా పనిచేశారు. ఆ తర్వాత స్వంతంగా కాంట్రాక్ట్ పనులు ఆరంభించి 1976లో అప్పర్ కృష్ణ కెనాల్‌ను చేపట్టారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ బెట్వా నదిపై రాజ్‌ఘాట్ డ్యాంను, నర్మదానది మెయిన్ కెనాల్ పనులను పూర్తి చేశారు. అనంతరం జెఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో పలు రాష్ట్రాలలో భారీ ప్రాజెక్టులు, నీటి ప్రాజెక్టులు, డ్యాములు, ప్రధాన కాలువలు నిర్మించి నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చారు. కేవలం నిర్మాణ పనులే కాకుండా కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఆయా ప్రాంతాలలో సామాజిక, కళారంగాలకు విశేషమైన కృషి చేశారు. ముఖ్యంగా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టటం వీరికి నచ్చిన వ్యాపకం. అందుకనే వారు ఏ రాష్ట్రంలో పనిచేసినా నాణ్యతతో పాటు ప్రజల మనసును గెలుచుకున్నారు.



1994లో నెల్లూరు జిల్లా రైతుల కోసం తొలిసారిగా ఆయిల్ పామ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి, రైతులకు అండగా నిలిచారు. జన్మభూమి కార్యక్రమాల్లో భాగంగా తన తల్లి కామేశ్వరమ్మ పేరుతో సొంత ఊరు జగదేవిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో దాదాపు 6 ఎకరాల్లో కార్పొరేషన్ అనుమతితో చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కు వారి సృజనాత్మక గొప్ప ఉదాహరణ. ఇప్పటికీ ఇది నగర ప్రజలకు గొప్ప విహార కేంద్రంగా ఉంది. వారి శ్రీమతి జక్కా సుజాతమ్మ జ్ఞాపకార్థం నెల్లూరులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 10 లక్షలు విరాళం ఇవ్వడమే కాకుండా, 18 నెలల పాటు నిర్వహణ భారం కూడా మోశారు. ప్రస్తుతం ఇది 140 పడకల వైద్యాలయంగా అన్ని వసతులతో అనేక జిల్లాల ప్రజలకు జీవదాతగా నిలిచివుంది. వందేళ్ల నాటి నెల్లూరు టౌన్ హాల్‌ను 2003లో మరో వందేళ్లకు పనికి వచ్చే విధంగా రీ మోడల్ చేసి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పునః ప్రారంభించారు. అలాగే 2001 నుంచి తండ్రి జక్కా రంగారెడ్డి పేరుతో రాష్ట్రస్థాయిలో పౌరాణిక నాటక పోటీలను నిర్వహిస్తూ వచ్చారు. జె.ఎస్.రెడ్డి ట్రస్ట్ ఏర్పాటుచేసి పేదలకు ఉచిత వైద్యసేవలు, పేద విద్యార్థినీ విద్యార్థులకు చదువుల కోసం తన వంతు చేయూతనిస్తూ వచ్చారు. స్వతహాగా కబడ్డీ క్రీడాకారుడైన జె.ఎస్.రెడ్డి రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించి జెఎస్ఆర్ కప్పు ప్రదానం చేస్తూ వచ్చారు. వీరు సామాజిక, సాహిత్య, కళా రంగాలకు విశేషమైన కృషి చేశారు. వారి సేవలు ఎప్పటికీ అన్ని రంగాల ప్రజలలో తొణికిసలాడుతూనే ఉంటాయి.

– ఈతకోట సుబ్బారావు

(మే 1న కన్నుమూసిన జె.ఎస్.రెడ్డికి నివాళి)

కొద్దిరోజుల క్రితం వరకు ఆగిన ఇసుక అక్రమ రవాణా ఇప్పుడు మళ్లీ ఊపందుకుంది. ఇసుక ద్వారా కాసులు వెనుకేసుకోవడానికి అలవాటు పడిన అక్రమార్కులు యంత్రాలకు పని చెప్పకుండా ఉండలేకపోతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారపార్టీ నేతలు కృష్ణా నదిని కొల్లగొట్టేశారు. ఒకపక్క కొండలను కరిగించేశారు. మరోపక్క మట్టిని మాయం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఆపేయాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశించినా అక్రమార్కులకు లెక్కలేకుండాపాయింది.

అక్రమ రవాణా మొదలు



ఇసుకను తరలించేస్తున్న దళారులు

- చెక్‌పోస్టులు లేకపోవడంతో కార్యకలాపాలు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- తవ్విన ఇసుకంతా తెలంగాణకే

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఇసుక విధానాన్ని తీసుకొచ్చి గుంపగుత్తగా రీచ్‌లను మొత్తం జేపీ కంపెనీకి కట్టబెట్టింది. దీని ముసుగులో స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు ఇసుక దొంగల అవ తారం ఎత్తారు. పార్టీ అధికారంలో ఉండడంతో అనుమతులతో సంబంధం లేదన్నట్టు వ్యవహ రించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో ఉన్నచోట విచ్చలవిడిగా తవ్వకాలు చేశారు. ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చినా ఈ తవ్వకాలు కొనసాగించారు. కొద్దిరోజుల క్రితం వరకు తవ్వకాలను ఆపి, టిప్పర్లను పక్కనపెట్టిన దళారులు ఇప్పుడు కార్యకలాపాలు ప్రారంభించారు. పోలీసులు ఒకపక్క కేసులు నమోదు చేస్తున్నా లెక్కలేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

'చెక్' లేకపోవడంతో...

ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు, కంచికచర్ల, జగ్గయ్యపేట మండలాల పరిధిలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ తవ్విన ఇసుకను సరఫరా చేయడానికి డంపింగ్ యార్డులను ఏర్పాటు చేశారు. అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉన్న నేపథ్యంలో చాటుమాటుగా తవ్వకాలు చేస్తున్నారు. డంపింగ్ యార్డుల నుంచి ఎలాంటి అనుమతులూ లేకుండా సరిహద్దులు దాటిస్తున్నారు. కొద్దిరోజుల ఈ ప్రక్రియ కాస్తంత వేగంగా నడుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లా సరిహద్దులతోపాటు ప్రవేశమార్గాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల వద్ద జిల్లాలోకి ప్రవేశించే వాహనాలతోపాటు వెళ్లే వాహనాలను తనిఖీ చేసేవారు. ఇక్కడ కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు, ఎస్ఈబీ పోలీసులు విధుల్లో ఉండేవారు. దీంతో చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేస్తే దొరికిపోతామన్న భయంతో ఇసుకను రేవు దాటనివ్వలేదు. పోలింగ్ ముగియడంతో చెక్‌పోస్టులను తొలగించారు. దీన్ని ఇసుకాసురులు ఒక ఆయుధంగా మార్చుకున్నారు. గ్రామాల్లో నిద్దరపోతున్న వేళల్లో టిప్పర్లలోకి ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. ఆ వాహనాలను తెలంగాణ సరిహద్దుల్లోకి పంపేస్తున్నారు. డంపింగ్ యార్డు నుంచి కదిలిన ప్రతి టిప్పర్ తెలంగాణ వైపు చూస్తోంది. ఆయా మార్గాల్లో పోలీసులు సోదాలు నిర్వహించినప్పుడు కొన్ని లారీలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. అయినా ఇసుకాసురులు ఈ కేసులకు భయపడే పరిస్థితి కనిపించడం లేదు. ఒక లారీని పోలీసులు సీజ్‌చేస్తే మరో లారీతో రవాణా మొదలుపెడుతున్నారు.

అక్కడికే ఎందుకంటే...

జిల్లా నుంచి అక్రమ రవాణా చేస్తున్న ఇసుక మొత్తం తెలంగాణ వైపునకు వెళ్లడం వెనుక బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఆదాయం దండిగా వస్తుండడంతోపాటు నిర్మాణరంగం అక్కడ మంచి ఊపు మీద ఉండడంతోనే తెలం గాణకు ఇసుకను పంపేస్తున్నారని తెలుస్తోంది. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్, నల్లగొండ ప్రాంతాల్లో నిర్మాణరంగం జోరుగా ఉంది. ఈ కారణంగానే జిల్లాలోని ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా అక్కడికి పంపేస్తున్నారు. ఒక టన్ను ఇసుకకు జిల్లాలో వచ్చిన ధర కంటే తెలంగాణలో అధికంగా వస్తుండడంతో ఈ ఆదాయంపై ఇసుకాసురులు బతికేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఎన్నికల ఫలితాలు రావటానికి మరో పక్షం రోజులు ఉంది. అధికారంలోకి వచ్చేది అనుమానంగానే ఉంది. దొరికిన ఈ కొద్ది సమయాన్ని కూడా ఎందుకు వదులుకోవటం అని అధికార పార్టీ నేతలు అక్రమ మైనింగ్‌పై తెగబడ్డారు. గన్నవరం మండలంలోని కొండపావులూరులో ఆగిపోయిన అక్రమ మైనింగ్ మళ్లీ పునఃప్రారంభమైంది. నిశిరాత్రిలో అక్రమ తవ్వకాలకు తెరలేపింది. వందల సంఖ్యలో లారీలు మట్టిని తరలించేస్తోంది. వారం రోజులుగా కొండపావులూరు ఇదే జరుగుతోంది. స్థానికులు ఫిర్యాదులు ఇచ్చినా సరే రెవెన్యూ అధికారులు కిమ్మనటం లేదు.


కొండపావులూరులో కొనసాగుతున్న మైనింగ్

అర్ధరాత్రి.. అక్రమ తవ్వకాలు

కొండపావులూరులో జూలు విదిల్చిన వైసీపీ మైనింగ్ మాఫియా

- సర్వే నెంబర్ 6, 34లలో అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు
- పగలు మామిడి తోటల్లో ఎక్స్‌కవేటర్లు దాచి..
- అధికారం ఉంటుందో లేదో తెలియక చకచకా పనులు
- ఫిర్యాదులను పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కొండపావులూరులో అక్రమ మైనింగ్ మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్టుగా సాగిపోతోంది. కొండపావులూరులోని సర్వే నెంబర్ 6, సర్వే నెంబర్ 34లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. సర్వే నెంబర్ 34లో పూర్తిగా అసైన్డ్ పట్టాభూములు ఉన్నాయి. పూర్వం రోజుల్లో దళితులకు సాగు చేసుకునేందుకు ఇచ్చారు. ఆ తర్వాత క్రమంలో ఈ పట్టాలు చేతులు మారాయి. ఈ భూముల్లో గ్రావెల్, ఎర్రమట్టి నిల్వలు ఉండటంతో అక్రమార్కులు వీటిని మట్టి తవ్వుకునేందుకు కొనుగోలు చేశారు. గతంలో ఒకసారి మట్టి తవ్వకాలకు ఈ భూములను కొనుగోలు చేసి 30 అడుగుల మేర లోతున తవ్వేశారు. ఇటీవల కాలంలో ఇవే భూములను మట్టి కోసం మళ్లీ రెండోసారి కొనుగోలు చేశారు. ఎన్నికల ముందు ఓ 20 అడుగుల మేర అదనంగా అంటే మొత్తంగా 50 అడుగుల మేర తవ్వేశారు. అప్పట్లో ఈ అంశాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీయటంతో.. క్వారీని నిలుపుదల చేశారు. అక్రమ తవ్వకాలు ఆగిపోయాయి.

5 అడుగుల లోతున మళ్లీ తవ్వకాలు

మళ్లీ ఇక్కడ అక్రమ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఈసారి పగటి సమయంలో కాకుండా అర్ధరాత్రి సమయాన్ని తవ్వకాలకు ఎంచుకున్నారు. గత వారం రోజులుగా మరో 5 అడుగుల లోతున అదనంగా మట్టిని, తెల్లచట్టు గ్రావెల్‌ను తవ్వేశారు. ఇంకా తవ్వేస్తున్నారు. కొండపావులూరులోనే సర్వే నెంబర్ 6 కొండను కూడా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం వంటి కేంద్ర సంస్థలు ఉన్నాయి. వీటికి దగ్గర్లోనే సర్వే నెంబర్ 6 ఉంది. సర్వే నెంబర్ 6లో భారీగా తవ్వేస్తున్నారు. సమీప మామిడి తోటల్లో పగటి సమయంలో ప్రొక్లెయిన్లు దాస్తున్నారు. రాత్రి సమయంలో విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. భారీగా గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. వీటికి సమీపంలో జగనన్న కాలనీ ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. స్థానికంగా ప్రశ్నించే వారికి ఇళ్ల బేస్‌మెంట్లలో గ్రావెల్‌ను నింపటానికి తవ్వకాలు జరుగుతున్నాయన్న ప్రచారాన్ని తీసుకు వస్తున్నారు. వాస్తవంగా మాత్రం ఈ గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. సర్వే నెంబర్ 6లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై కూడా ఇప్పటికే ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదులపై రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదు.

బియ్యం దాటించేద్దాం!



ఉమ్మడి కృష్ణాజిల్లాలో అక్రమ బియ్యం నిల్వల భారీ డంప్‌లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అక్రమ బియ్యం భారీ డంప్‌లు ఏర్పాటయ్యాయి. ఎన్నికల వేళ చెక్‌పోస్టుల వల్ల రహస్య స్థావరాల్లో నిల్వ ఉంచిన ఈ డంప్‌ను ఇప్పుడు జిల్లా, దేశ సరిహద్దులు దాటించేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ ఎన్నికల విధుల్లో తలమునకలైన సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు ఇప్పుడు అప్రమత్తం కాకపోతే బియ్యం విదేశాలకు తరలిపోయే ప్రమాదం ఉంది.

- జిల్లా సరిహద్దు దాటించేందుకు రంగం సిద్ధం చేసిన అక్రమార్కులు
- ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల దగ్గర నిఘాతో బయటకు కదలని నిల్వలు
- చెక్‌పోస్టుల తొలగింపుతో డంప్‌ను తరలించే ప్రయత్నం
- ఇండోనేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి కోసం పోర్టుల్లో వ్యాపారులు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కొనుగోలు చేసిన బియ్యం, ఇంటింటికీ పంపిణీ అయినప్పటికీ వారింటికి వెళ్లి చిరు వ్యాపారులు సేకరించిన బియ్యం నిల్వలు అన్నీ అక్రమార్కుల వద్ద డంప్ అయి ఉన్నాయి. డంప్‌లు రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు అష్టదిగ్బంధనం చేయటంతో తరలించడానికి వీల్లేకుండా పోయింది.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడెక్కడంటే..

ఎన్టీఆర్ జిల్లాలో జొన్నలగడ్డ, పెద్దాపురం, గరిక పాడు, గంఢ్రాయి, ముక్త్యాల, వత్సవాయి, మెర్సు మిల్లి, గంగినేనిపాలెం, రాజుపేట (తిరువూరు టైన్), రాజవరం, వేమిరెడ్డిపల్లిలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టుల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారా కాస్తుండటంతో బియ్యాన్ని బయటకు కదల్చలేని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కృష్ణాజిల్లాలోనూ నెలకొంది. విజయవాడ లోని సింగ్‌నగర్, పాయకాపురం, రాజరాజేశ్వరి పేట, కండ్రిక, భవానీపురం, గొల్లపూడి, రాయనపాడు, కొత్తపేట, చిట్టినగర్, విద్యాధర పురం, పాతబస్తీ, కొండ దిగువ ప్రాంతం, క్రీస్తులంక, రాణీగారితోట, ఆటోనగర్‌లతో పాటు రూరల్ ప్రాంతాలైన నున్న జక్కంపూడి, పాతపాడు, సూరంపల్లి, ఇబ్రహీంపట్నం కొండపల్లిలలో భారీగా డంప్‌లు ఉన్నాయి. వీటితోపాటు జగ్గయ్యపేట, నందిగామ, జీ కొండూరు, మైలవరం, గంపలగూడెం, తిరువూరు టౌన్, విస్సన్నపేట, రెడ్డి గూడెంలలో భారీ డంప్‌లు ఉన్నాయి.

కృష్ణాజిల్లాలో ఎక్కడెక్కడంటే..

కృష్ణాజిల్లాలో గన్నవరం టౌన్, హనుమాన్ జంక్షన్, కంకిపాడు, ఉప్పలూరు, పెనమలూరు, ఉయ్యూరు. గుడివాడ, పామర్రు, మచిలీపట్నం టౌన్, అవనిగడ్డ, కోడూరు ప్రాంతాల్లో భారీగా డంప్‌లు ఉన్నాయి. గతంలో మాదిరిగా గోడౌన్లలో అయితే ఈ డంప్‌లు చాలా తక్కువగా ఉన్నాయి. ఇళ్లను అద్దెకు తీసుకుని వాటిలో నిల్వ చేశారు.

డీటీలకు తెలిసినా పట్టించుకోరాయె..

డంప్‌లపై స్థానికులు డీటీలకు సమాచారం ఇచ్చినా.. తొక్కిపట్టి ఉంచారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు బియ్యం నిల్వల సమాచారాన్ని డీటీల దగ్గరకు తీసుకు వస్తుంటారు. డీటీలు హడావిడి చేస్తారు. వారి నుంచి డబ్బులు దండిగా తీసుకుని గప్‌చుప్‌గా ఉంటున్నారు. డీటీలలో చాలామంది ఉన్నతాధికారికి చెప్పటం లేదు. ఒకవేళ ఉన్నతాధి కారులకు సమాచారం వచ్చిన దాడులకు సిద్ధమౌ తుంటే.. డీటీలు అక్రమార్కులకు సమాచారం ఇచ్చేస్తున్నారు. రెండు జిల్లాల కలెక్టర్లు తక్షణం రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది.

దేశాలు దాటించేందుకు రంగం సిద్ధం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సిద్ధం చేసిన బియ్యం డంప్‌లను ముందు జిల్లా సరిహద్దులు దాటించేసి పోర్టులకు తరలించాలన్నది బియ్యం అక్రమ వ్యాపారుల వ్యూహంగా ఉంది. పోర్టుల్లో అక్రమ బియ్యం కొనుగోలు చేసే బడా ట్రేడర్లు ఇప్పటికే తిష్ట వేశారు. అక్రమ బియ్యం వ్యాపారులకు, బడా ట్రేడర్లకు సత్సంబంధాలు ఉన్నాయి. ఒక్క అక్రమ వ్యాపారిని పట్టుకున్నా.. పోర్టుల్లో తిష్ట వేసిన అక్రమ బియ్యం బడా ట్రేడర్ల గుట్టు రట్టు అవుతుంది. ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంకలకు అక్రమ బియ్యాన్ని తరలించేందుకు కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల్లో కంటెయినర్లతో సిద్ధంగా ఉన్నారు. జిల్లా యంత్రాంగం మరింత చొరవ చూపి ప్రత్యేక ఫోర్సుతో పోర్టుల్లో తనిఖీ చేస్తే భారీగా డంప్ దొరికే అవకాశముంది.


కృష్ణాయూనివర్సిటీ

వివాదాల వర్సిటీ

కారు అద్దె నెలకు రూ.59,999

- 50 నెలలుగా ఒకే ఏజెన్సీకి కారు అద్దె కాంట్రాక్టు
- పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినా గ్రేడ్‌కార్డులు ఇవ్వని వైనం
- ఫీజులు చెల్లించాకే మార్కుల జాబితాలు ఇస్తారట
- నూతన భవనాలకు మరమ్మతుల పేరుతో రూ.3 కోట్ల బిల్లులు

కృష్ణా యూనివర్సిటీ వివాదాల వర్సిటీగా మారింది. పరిపాలనా అంశాల్లో తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన నగదును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తుండటంతో ఉద్యోగులు, అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. యూనివర్సిటీ అధికారుల తీరుపై ఉన్నతవిద్యాశాఖ మండలికి ఫిర్యాదులు చేస్తున్నారు. విద్యార్థులకు మార్కుల జాబితాలు ఇచ్చేందుకు నిబంధనలు అమలుచేస్తున్న యూనివర్సిటీ అధికారులు నిధులను వినియోగించడంలో నిబంధనలు ఎందుకు పాటించడం లేదని వివాదం రేగుతోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వీసీ, రిజిస్ట్రార్‌ల కోసం యూనివర్సిటీ తరఫున కార్లు ఉన్నా వాటిని పక్కనపెట్టేశారు. 50 నెలలుగా అద్దెకార్లను తీసుకుని నెలకు రూ.59,999 చొప్పున చెల్లిస్తున్నారు. టెండర్లు పిలవకుండా దొడ్డిదారిన గుట్టుచప్పుడు కాకుండా కార్ల కాంట్రాక్టును గత 50 నెలలుగా ఒకే ఏజెన్సీకి కట్టబెట్టారు. దీనిపై సహచట్టం ద్వారా ఇటీవల కొందరు ప్రొఫెసర్లు వివరాలు కోరారు. ఉన్నత విద్యామండలి అధికారులకు సైతం ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేవు. ఇదే కారు వేరే జిల్లాలో గతంలో ప్రమాదానికి గురైందని, మరమ్మ తుల కోసం రూ.2.40 లక్షల మేర బిల్లులు చేసిన అంశం వెలుగులోకి వచ్చింది.

పూర్తిస్థాయిలో ఫీజులు కట్టినట్లుగా చూపితేనే సర్టిఫికెట్లు

యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ విద్యార్థులకు ఒకటి నుంచి మూడు సెమిస్టర్‌లకు సంబంధించిన గ్రేడ్ కార్డులు ఇవ్వకుండా ఏడాదిన్నర కాలంగా తొక్కిపెట్టేశారు. విద్యార్థులు మార్కుల జాబితాలు కావాలని కోరితే పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించినట్లుగా నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకువస్తే గ్రేడ్ కార్డులు ఇస్తామని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు.

నూతన భవనాలకు రూ.3కోట్లతో మరమ్మతులు

యూనివర్సిటీ నూతన భవనాలను రూ.87 కోట్లతో నిర్మించారు. నాలుగేళ్ల వ్యవధిలోనే నూతన భవనాలకు రూ.3 కోట్లతో మరమ్మతులు చేసినట్లుగా చూపి బిల్లులు చేసిన అంశంపై కొందరు ప్రొఫెసర్లు, ఉద్యోగులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీకి సంబంధించి తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం గతంలో రూ.50 లక్షలను ఖర్చు చేశారు. ఈ నగదును ప్రభుత్వం నుంచి తీసుకోకుండా విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన నగదు నుంచి మళ్లించారు. అధికార పార్టీ నాయకుడి అనుయాయుడికి ఈ కాంట్రాక్టును కట్టబెట్టడంపైనా అధ్యాపకులు ఇటీవల గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.

కొల్లు రవీంద్రను కలసిన అధ్యాపకులు, ఉద్యోగులు

కృష్ణా యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఇతర సిబ్బంది 78 మంది ఇటీవల మాజీమంత్రి కొల్లు రవీంద్రను ఆయన నివాసం వద్ద కలిశారు. యూనివర్సిటీలో జరుగుతున్న అవకతవకలను వివరించారు. ఇప్పటికే యూనివర్సిటీకి చెందిన రూ.40 కోట్ల నిధులను పక్కదారి పట్టించారని తెలిపారు. యూనివర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం, తమ చిత్తానుసారంగా అవసరంలేని ఉద్యోగ నియామకాలు చేసిన అంశాలను వివరించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత యూనివర్సిటీకి వచ్చి అక్కడి పరిస్థితులను గమనించి తదుపరి చర్యలు తీసుకుంటామని కొల్లు రవీంద్ర ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

అంబాపురం చెరువు స్థలం కబ్జా

- మెరక తోలి షెడ్డు నిర్మాణానికి సిద్ధం చేస్తున్న ఆక్రమణదారులు
- కబ్జాదారులకు అధికారుల వత్తాసు


షెడ్డు నిర్మాణం కోసం మెరక చేసి ఆక్రమించిన చెరువు పోరంబోకు స్థలం

స్ట్రాంగ్‌రూంకు 2 కిలోమీటర్లు రెడ్‌జోన్

- నిమ్రాలో 400 మందితో బందోబస్తు.. రెండు దశల్లో గస్తీ
- ఈ ప్రాంతంలో డ్రోన్లు ఎగురవేయకూడదు
- పోలీసు కమిషనర్ రామకృష్ణ



విజయవాడ, మే 20(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూంలకు రెండు కిలోమీటర్ల పరిధిని రెడ్‌జోన్‌గా విధించామని పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి డ్రోన్లు ఎగరవేయకూడదని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మీడియాతో సోమవారం ఆయన మాట్లాడారు. నిమ్రా కళాశాలలో ఏర్పాటు చేసిన 29 స్ట్రాంగ్ రూంల వద్ద 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. రెండు దశల్లో బందోబస్తు ఉంటుందన్నారు. రెండు పారామిలటరీ కంపెనీలకు చెందిన బలగాలు, ఏపీఎస్పీ సిబ్బంది ఇక్కడ బందోబస్తును నిర్వహిస్తున్నారన్నారు. వారితో సివిల్ పోలీసులు ఉంటారన్నారు. స్ట్రాంగ్ రూంలను పరిశీలించడానికి కలెక్టర్ జారీచేసిన పాసులున్న అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందిని గుర్తించడానికి 100 ఫేషియల్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో మొబైల్ చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న బందోబస్తుకు అదనంగా మరో రెండు కంపెనీలను బందోబస్తుకు పంపుతున్నారన్నారు. ఎన్నికల రోజున గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అల్లర్లలో అన్ని కేసుల్లోనూ నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇందులో కొంతమందిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. 109 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని తెలిపారు. కొంతమందిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, మరి కొంతమందిని నగర బహిష్కరణ చేస్తామని తెలిపారు. మైలవరంలో నిబంధనలను ఉల్లంఘించి విడిగా పెట్రోలు పోస్తున్న ఓ పెట్రోలుబంకుపై కేసు నమోదు చేశామని, ఈ బంక్‌పై చర్యలకు సంబంధిత శాఖకు సిఫారసు చేశామని తెలిపారు. ఎక్కువ మొత్తంలో బాణసంచా సామగ్రిని విక్రయించొద్దని దుకాణాలకు, తయారీదారులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో పారామిలటరీ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

తప్పుడు సమాచారం ట్రోల్ చేస్తే చర్యలు

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేసినా, దాన్ని ట్రోల్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న పోస్టింగ్‌లపై నిఘాకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొదట్లో నలుగురితో ఈ బృందాన్ని ఏర్పాటు చేయగా, దాన్ని ఆరుకి పెంచామని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బృందం సామాజిక మాధ్యమాలపైనే పనిచేస్తోందన్నారు.



ఆక్వా చెరువులో ఏర్పాటు చేసిన ఏరియేటర్లు, ఇన్‌సెట్‌లో బంకు యజమానులకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు

ఆక్వా రైతులకు శాపంగా..

బంకుల్లో డీజిల్ లూజు అమ్మకాల నిలిపివేత

- ఏరియేటర్లు తిప్పకపోతే పంట నష్టపోతామంటున్న రైతులు
- గొడవలు లేని ప్రాంతాల్లో డీజిల్‌పై ఆంక్షలేంటని ఆవేదన

కృత్తివెన్ను: ఎన్నికల వేడితో రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, దాడులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ పెట్రోల్ బంకుల్లో లూజుగా పెట్రోల్, డీజిల్ విక్రయాలను నిలిపివేస్తూ అన్ని బంకులకు ఇచ్చిన ఆదేశాలు ఆక్వా రైతుల పాలిటశాపంగా మారాయి. కృత్తివెన్ను ప్రాంతంలో గొడవలు జరగక పోయినా ఈసీ ఆదేశాలను ఉన్నతాధికారులు, పోలీసులు కఠినంగా అమలు చేయడంతో అన్ని బంకుల్లో లూజు విక్రయాలను నిలిపివేశారు. వాహనాల్లో మినహా టిన్నుల్లో, డబ్బాల్లో పెట్రోల్‌తో పాటు, డీజిల్‌ను కొట్టడం ఆపేశారు. వనామీ, చేపల చెరువుల్లో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ అందించేందుకు ఏరియేటర్లను ఏర్పాటు చేస్తారు. కొన్ని చెరువుల్లో కరెంటు మోటర్ల ద్వారా ఏరియేటర్లను నడిపితే మరికొన్ని చెరువుల వద్ద ఆటో ఇంజన్లతో ఏర్పాటు చేశారు. ఆటో ఇంజన్లు డీజిల్‌తో తిరుగుతాయి. కరెంటు మోటార్లు ఉన్న చోట కరెంటు పోయినప్పుడు జనరేటర్ల సాయంతో మోటార్లను తిప్పుతారు. దీంతో ఆక్వా రైతులకు డీజిల్ వాడకం ఎక్కువగా ఉంటుంది. సగటున ఎకరం చెరువు ఉన్న రైతు 20 లీటర్లు డీజిల్ వాడుతుంటాడు. ఈ డీజిల్‌ను టిన్నుల్లో నింపుకొని చెరువుల వద్దకు తీసుకెళ్తారు. తాజాగా ఈసీ ఇచ్చిన ఆదేశాలతో బంకుల్లో లూజుగా డీజిల్ ఇవ్వకపోవటంతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ఇవ్వకుంటే ఏరియేటర్లు తిరగక ఆక్సిజన్ అందక తమ పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చేపలు, రొయ్యలకు ప్రతి నిమిషం ఆక్సిజన్ అందించటం తప్పనిసరని, ఏరియేటర్లు ఆగిపోతే వెంటనే పంట మృత్యువాత పడుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల గొడవలు లేని ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు పెద్ద మనసుతో డీజిల్ వరకైనా వినహాయింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

డీజిల్ ఇవ్వకుంటే తీవ్ర నష్టం

ఆక్వాసాగు డీజిల్‌పైనే ఆధారపడి సాగుతుంది. డీజిల్ లూజు విక్రయాలు చేయకుంటే ఆక్వాకు తీవ్ర నష్టం. అధికారులు పునరాలోచన చేసి, ఇక్కడ డీజిల్ విక్రయాలకు అనుమతులివ్వాలి.

-నెక్కంటి భాస్కరరావు, ఆక్వా రైతు

ఆక్వాకు తీరని దెబ్బ

డీజిల్ లూజు విక్రయాలు నిలిపివేస్తే గంటలోనే ఆక్వా పంటకు ఊహించని నష్టం ఏర్పడుతుంది. అధికారులు లూజు విక్రయాలకు అనుమతివ్వాలి

- నాగేశ్వరరావు, రైతుసంఘ నాయకుడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం

డీజిల్ లూజు విక్రయాలపై రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారులకు, ఎన్నికల అధికారులకు తెలియజేశాం. వారు పై అధికారులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. వారి ఆదేశాల కోసం చూస్తున్నాం.

- ఎస్సై నాగరాజు



ఇబ్రహీంపట్నంలో స్ట్రాంగ్‌రూంలు పరిశీలించాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

ఈవీఎంలకు మూడంచెల భద్రత

కృష్ణలంక, మే 20: ఈవీ ఎంలకు కేంద్ర, రాష్ట్ర సివిల్ పోలీసులతో ప్రభుత్వం మూడంచెల భద్రత కల్పించిందని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ దిల్లీరావు అన్నారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల ఈవీ ఎంలు భద్రపరిచిన ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశా లల్లో స్ట్రాంగ్ రూంలను సోమవారం ఆయన పరిశీ లించారు. ఈవీఎంల భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలనని భద్రతా సిబ్బందికి సూచిం చారు. స్ట్రాంగ్ రూంల తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీ లించారు. అన్నిచోట్లా సీసీ కెమేరాల పనితీరును పరిశీలిం చారు. తనిఖీల అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర పోలీస్ బలగాల గార్డును, జిల్లా ఆర్మ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పరిశీలించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించొద్దని ఆదేశించారు.



పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

వేగంగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలి

- అందుకు తగిన ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన

మచిలీపట్నం, మే 20 (ఆంధ్ర జ్యోతి): ఎన్నికల కౌంటింగ్ రోజున పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కిం పును ముందస్తుగా చేయాలని, ఒక్కో టేబు ల్‌కు 500 చొప్పున లెక్కిం చేలా, త్వరితగతిన ప్రక్రియ పూర్తయ్యేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచిం చారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై డెమోను సోమవారం ఆయన నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లు చెల్లనివి ఉంటే ఏ కారణంతో వాటిని తిరస్కరిస్తున్నారో స్పష్టంగా తెలియజేసేందుకు అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు పి.పద్మావతి, డి.రాజు, వెంకట రమణ, ఎం.వాణి, బాలసుబ్రహ్మణ్యం, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రత్యేక టేబుళ్లపై పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

కృష్ణలంక: ఇబ్రహీంపట్నం నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని, లెక్కింపు ప్రక్రియను పటిష్ఠంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మని ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావుతో కలిసి సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోస్టల్ బ్యాలెట్లు ఉం చిన స్ట్రాంగ్ రూంను అభ్యర్థుల ప్రతినిధులతో వారు పరిశీలించారు.

నూతన జనన ధ్రువీకరణ
విధానంపై అవగాహన అవశ్యం

- విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరంలో ఎంటీ కృష్ణబాబు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి 2023 అక్టోబరు 1 నుంచి అమలులోకి వచ్చిన సరికొత్త విధానంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన సీఆర్ఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జనన, మరణ రిజిస్ట్రార్‌లకు రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. '2023లో జనన, మరణ నమోదు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. సీఆర్ఎస్ పోర్టల్‌లో పలు మార్పులు చేసిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ఆ సైట్‌ను పునరుద్ధరించింది. దీనిపై ఆరోగ్యశాఖ ప్రజలకు తెలియజేయాలి. 43 వేలకు పైగా ఆశా వర్కర్లు, 13 వేలకు పైగా ఏఎన్ఎంలు, 10,032 మంది సీహెచ్‌వోలు ఇందులో భాగస్వాములు కావాలి. కొత్తగా అమలులోకొచ్చిన జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదే. ప్రసవాల అనంతరం డిస్‌చార్జి అయ్యే సమ యంలో ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు జనన ధ్రువీకరణ పత్రాల్ని జారీ చేయాలి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత పటిష్ఠపర్చాలి. వీటిని ఎప్పుడైనా, ఎక్కడైనా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం ఉండాలి. సీఆర్ఎస్ పోర్టల్ ద్వారా మరణాలకు గల కారణాల్ని నమోదు చేసే విషయంలో ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు తగు సూచనలివ్వాలి. రాష్ట్రస్థాయిలో శిక్షణ తీసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేసే క్రమంలో ఎదురైన అనుభవాల్ని మాకు తెలియజేస్తే భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాన్ని రూపొందించేందుకు వీలు కలుగుతుంది. గ్రామ, వార్డు సచివాలయాల్ని ఈ వ్యవస్థకు అనుసంధానం చేయడం ద్వారా సేవల్ని మరింత విస్తృతం చేయ వచ్చు' అని కృష్ణబాబు పేర్కొన్నారు.



యథేచ్ఛగా..

మక్కపేట చెరువు నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

మట్టి తవ్వకాలు

- మక్కపేటలో నాలుగు రోజుల నుంచి ట్రాక్టర్లతో తోలకాలు
- అయినా పట్టించుకోని అధికారులు

వత్సవాయి, మే 20: మక్కపేట ఊర చెరువు నుంచి అనధికారికంగా నాలుగురోజుల నుంచి మట్టిని తరలిస్తున్నా అటువైపు అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. పగలు, రాత్రీ తేడా లేకుండా గ్రామ ప్రధాన రహదారిపై నుంచి వివిధ ప్రాంతాలకు మట్టి తరలింపు జరుగుతోంది. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి జేబులు నింపుకొంటున్నారు. ట్రక్కు మట్టి స్థానికంగా రూ.500, బయట ప్రాంతాలకు రూ.1,000కు అమ్ముకుంటున్నారు. ఎమ్మెల్యే మమ్మల్ని తోలుకోమన్నాడని, మండల అధికారులను చూసుకుంటున్నామని, తమను ఎవ్వరూ ఏం చేయలేరంటూ మట్టి మాఫియా విచ్చలవిడిగా మట్టి తరలిస్తోందని పలువురు గ్రామస్థులు అంటున్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

వన్‌టౌన్, మే 20: ఎన్టీఆర్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో డాటా ఎంట్రీ ఆపరేటర్(ఎండీఎం) ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ (టీఎంఎఫ్) పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో ఉంచామని ఆయన తెలిపారు. వివ రాలకు సూపరింటెండెంట్ జీవీ రమణ 8712367910లో సంప్రదించవచ్చునన్నారు. దరఖాస్తు లను ఈనెల 24వతేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని ఆయన సూచించారు.



వేములపల్లి రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మైనింగ్ డీడీ ఇసుక రీచ్‌ల పరిశీలన

కంచికచర్ల, మే 20: నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌లలో భారీ యంత్రాలతో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో ఇసుక రీచ్‌లను ఎన్టీఆర్ జిల్లా ఉన్నతాధికారులు సోమవారం పరిశీలించారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డీసీపీ శ్రీనివాస్, సెబ్ ఏఈఎస్ భార్గవ్ తదితరులు కంచికచర్ల మండలం వేములపల్లి, పెండ్యాల రీచ్‌లలో ఇసుక తవ్వకాలను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. నందిగామ ఏసీపీ రవికిరణ్, రూరల్ సీఐ చంద్ర శేఖర్, సెబ్ సీఐ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా ఉన్నారు.

భారీ యంత్రాలతో తవ్వలేదు: మైనింగ్ డీడీ సుబ్రహ్మణ్యం

ఇసుక రీచ్‌లలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరగలేదని మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నట్టుగా ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు. అనుమతులు లేకుండా లక్షల టన్నుల ఇసుక తవ్వి, తరలించినట్టుగా మీడియాలో వచ్చిన కథనాలపై ప్రస్తావించగా తెలియదు..ఏ ఫిర్యాదు రాలేదని తెలిపారు. తనకేమీ తెలియదన్నట్టుగా ముక్తసరిగా సమాధానం చెప్పారు. అడ్డగోలు తవ్వకాలపై ఆయన నోరు విప్పలేదు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

తూతూ మంత్రంగా పరిశీలన

జిల్లా అధికారుల ఇసుక రీచ్‌ల పరిశీలన తూతూమంత్రంగా జరిగింది. మునేటిపై ఉన్న పెండ్యాల, వేములపల్లి రీచ్‌లను మాత్రమే సందర్శించారు. ఈ రెండు రీచ్‌లలో లోపలికి వెళ్లలేదు. క్షుణంగా పరిశీలించలేదు. కృష్ణానదిపై ఉన్న గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికినపాడు రీచ్‌లవైపు చూడలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ రీచ్‌లలో భారీయంత్రాలతో రేయింబవళ్లు అడ్డగోలుగా తవ్వకాలు జరిగాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాతనే తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ రీచ్‌లను అధికారులు పరిశీలించలేదు. పెద్దగా తవ్వకాలు జరగని పెండ్యాల రీచ్‌ను మాత్రం పరిశీలించటం విశేషం.

మళ్లీ రైళ్ల రద్దు

- జూన్ 23 వరకు 8 పూర్తిగా..
- మరో 8 పాక్షికంగా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రైళ్ల రద్దుల పర్వం కొనసాగుతోంది. సోమవారం మరికొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిని మెయింటెనెన్స్ పేరుతో రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. బిట్రగుంట-విజయవాడ(07977), విజయవాడ- బిట్రగుంట(07978), బిట్రగుంట-చెన్నై సెంట్రల్(17237), చెన్నైసెంట్రల్-బిట్రగుంట(17238), గుంటూరు-రాయగడ(17243), రాయగడ -గుంటూరు (17244), కాకినాడ పోర్టు-విశాఖపట్నం(17267), విశాఖపట్నం-కాకినాడ పోర్టు(17268) రైళ్లను పూర్తిగా జూన్ 23వ తేదీ వరకు రద్దు చేశారు. రెండు రైళ్లను జూన్ 3, 16వ తేదీల వరకు రద్దు చేశారు. మరో 8 రైళ్లను జూన్ 23వ తేదీ వరకు పాక్షికంగా రద్దుచేశారు. మచిలీపట్నం-విజయవాడ (07896), విజయవాడ-మచిలీపట్నం(07769), నర సాపూర్-విజయవాడ(07863), విజయవాడ-మచిలీ పట్నం(07866), మచిలీపట్నం-విజయవాడ(07770), విజయవాడ-భీమవరం జంక్షన్(07283), మచిలీపట్నం- విజయవాడ(07870), విజయవాడ-నరసాపురం(078 61) ఉన్నాయి. మరో 11 రైళ్లను దారి మళ్లించారు.

24 నుంచి పది
సప్లిమెంటరీ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించే పదో తర గతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం పరీక్షలు నిర్వహించే వివిధ విభాగాల అధికారులతో ఆయన గూగుల్ మీట్ నిర్వహించారు. ఈనెల 24వతేదీ నుంచి జూన్ 3వతేదీ వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. 395 పాఠశాలలకు చెందిన 6,046 మంది విద్యార్థులు 24 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రా యాల్సి ఉందన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.45గంటలకు ముగుస్తుంద న్నారు. ప్రశ్నాపత్రాల భద్రత, జవాబు పత్రాల చేరవేత లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలు అవకతవ కలు లేకుండా నిర్వహించాలని, పోలీస్ బందోబస్తు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాల పర్యవేక్షణ ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సార్వత్రిక విద్యా పీఠం జూన్ 1వతేదీనుంచి 8వతేదీ వరకు నిర్వహించే ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాల న్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఈవో తాహెరా సుల్తానా, ఎస్‌బీ సీఐ వెంకటరమణ పాల్గొన్నారు.

మరింత శీఘ్రంగా దుర్గమ్మ దర్శనమయ్యేలా చూడండి

- దుర్గగుడి అధికారులతో ఈవో రామారావు

వన్‌టౌన్, మే 20: "ఇంద్రకీలాద్రిపై రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులకు అమ్మవారి దర్శనం మరింత వేగంగా అయ్యేలా చూడాలి. అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి. మరింత మెరుగైన పార్కింగ్ సౌక ర్యాలు కల్పించాలి. దుర్గగుడి అభివృద్ధికి అధికారులు సమష్టిగా పనిచేయాలి." అని వివిధ విభాగాల అధికా రులకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో రామా రావు సూచించారు. దేవస్థానంలో భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనపై సోమవారం తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ మేరకు ఆలయంలో జరుగు తున్న అభివృద్ధి పనులపైన, తదుపరి చేయాల్సిన పనుల పైన సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇంద్రకీలా ద్రిపైన, దుర్గగుడి పరిసరాల ప్రాంతాల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈఈ లింగం రమాదేవి, ఏఈవోలు, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొ న్నారు. దుర్గగుడిలో నిర్వహిస్తున్న అన్నవితరణ కార్యక్ర మానికి తెలంగాణలోని ఖమ్మం పట్టణానికి చెందిన అల్లం దుర్గారావు, కుటుంబసభ్యులు రూ.1,11,111 విరా ళాన్ని చెక్కురూపంలో అధికారులకు అందించారు.



విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా నెట్టెం జన్మదినోత్సవం

విద్యాధరపురం, మే 20: టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ జన్మదినోత్సవాన్ని విజయవాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాలుగో డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన కేకును వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు సోలంకి రాజు జైన్ కట్ చేసి రఘురామ్‌కు శుభాకాంక్షలు తెలి పారు. హుందా రాజకీయాలకు రఘురామ్ పెట్టింది పేరని, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారని అన్నారు. మరుపిళ్ల తిరుమలేష్, బొల్లా వెంకటేశ్వరరావుగౌడ్, పామర్తి కిషోర్‌బాబు, కాకు మల్లి కార్జునయాదవ్, కోడూరు ఆంజనేయవాసు పాల్గొన్నారు.

అంబాపురం చెరువు స్థలం కబ్జా

- మెరక తోలి షెడ్డు నిర్మాణానికి సిద్ధం చేస్తున్న ఆక్రమణదారులు
- కబ్జాదారులకు అధికారుల వత్తాసు


విజయవాడ రూరల్, మే 20: మండలంలోని అంబాపురం గ్రామంలో చెరువు పోరంబోకు స్థలం కబ్జాదారుల పరమవుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలన్న ఆలోచనతో అధికారం చేజారిపోయేలా ఉందని నిర్ధారణకు వచ్చిన వైసీపీ గ్రామ నేతలు కబ్జాలకు తెగబడుతున్నారు. కళ్ల ముందే చెరువుస్థలాన్ని కబ్జా చేస్తున్నా స్థానిక అధికారులు మాత్రం నోరుమెదపడం లేదు.

2 సెంట్లలో నిర్మాణానికి ఏర్పాట్లు

అంబాపురం గ్రామంలోని సర్వే నెం 18లో 5 సెంట్లలో చెరువు పోరంబోకు స్థలం ఉంది. హిందూ శ్మశానవాటిక వంతెన పక్కనే ఉన్న ఆ స్థలంపై వైసీపీ నేతల కన్ను పడింది. 2 సెంట్ల ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో సెంటు ధర రూ.8 లక్షలు ఉంది. రూ.16 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నా ఆక్రమణదారులకు వత్తాసుగా రాజకీయ ఒత్తిళ్లు రావడంతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.



షెడ్డు నిర్మాణం కోసం మెరక చేసి ఆక్రమించిన చెరువు పోరంబోకు స్థలం



విశ్వదాత అవార్డులందుకున్న విభిన్న రంగాల ప్రముఖులతో ఆర్డీవో డి.రాజు

స్ఫూర్తిప్రదాత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

- విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవంలో ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు

పామర్రు, మే 20: స్వాతంత్ర్య ఉద్యమానికి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అందించిన సేవలు నిరుపమానమని, నేటి తరానికి ఆయన స్ఫూర్తిప్రదాత అని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపరిచిన పలువురు ప్రముఖులకు ఎల్లకుర్రులో విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఏటా అందించే విశ్వదాత అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని సోమవారం కేడీటీ ట్రస్టు కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీవో రాజు పాల్గొన్నారు. పత్రికల ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి నాగేశ్వరరావు పంతులు అక్షరాయుధాలు అందించారని, నాటి నుంచి నేటి వరకు కాశీనాథుని వంశస్థుడైన నాగేశ్వరరావు ఎలకుర్రులో సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు, దివ్యాంగ చిన్నారులకు సేవలు అందిస్తున్నారని ఆర్డీవో పేర్కొన్నారు. మరో అతిథి బందరు మల్లయ్య స్వీట్స్ అధినేత గౌర వెంకటేశ్వరరావు, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ నిర్వహణ అధికారి సీబీకే ప్రసాద్ ఉపన్యాసించారు.

విశ్వదాత అవార్డులందుకున్నది వీరే..

ధర్మవరానికి చెందిన తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు, నందిగామకు చెందిన ప్రముఖకవి కథారచయిత లగడపాటి సంగయ్య, కైకలూరు ప్రాంతానికి చెందిన సైకతశిల్పి ఆకునూరి బాలాజీ వరప్రసాదరావు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు, ఆంధ్రపత్రిక కార్యనిర్వాహక సంపాదకురాలు వల్లభదాసు విజయలక్ష్మి, పెడనకు చెందిన సంఘసేవకుడు మట్టా రాధాకృష్ణమూర్తికి విశ్వదాత అవార్డులను అందజేశారు. వారందరినీ నిర్వాహకులు సత్కరించారు.

వైభవంగా ఎలకుర్రు బ్రహ్మోత్సవాలు

పామర్రు: ఎలకుర్రు అగ్రహారంలో భ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి వార్షిక బ్రహోత్సవాలు సోమవారం మూడో రోజూ వైభవంగా సాగాయి. వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు పర్యవేక్షణలో మూల విరాట్, అమ్మవార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకా దశ రుద్రాభిషేకం, అలంకరణలు, గణపతిపూజ, పుణ్యాహవచన, అంకురారోహణ, బలిహరణ, నిత్యాహోసన, సహస్ర నామార్చన, వేదపఠనం, విశేష పూజలు ఘనంగా నిర్వహిం చారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



బ్రహోత్సవాల్లో నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

ఎన్డీయే అధికారంలోకొస్తే
దేశ సమైక్యతకు భంగం

గవర్నర్‌పేట, మే 20: రానున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే తిరిగి అధికారంలోకి వస్తే దేశ సమైక్యతకు తీవ్ర సవాళ్లు ఎదురౌతాయని సీపీఎం జాతీయ నేత బీవీ రాఘవులు అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'దేశ సమైక్యత-ఎదురౌతున్న సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సభకు ఎంబీవీకె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి బీవీ రాఘవులు, పీ మధు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ... 'మతం పేరుతో దేశాన్ని విభజించాలని చూడటంతో పాటు రంగు ప్రాతిపదికన కూడా దేశాన్ని విభజించాలని బీజేపీ కుయుక్తులు పన్నింది. వీటి పట్ల దేశప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ అధికారంలోకి వచ్చినా, రాకున్నా జాతీయ సమైక్యతను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య వాదులంతా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీవీకె కార్యదర్శి పీ మురళీకృష్ణ, బాధ్యులు కే స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య స్మారకోపన్యాసం చేస్తున్న బీవీ రాఘవులు

ఏబీవీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం పగబట్టిందని, ఆయనను సస్పెండ్ చేసి పలు రకాలుగా వేధింపులకు గురిచేసిందని అన్నారు. ఆయనపై సస్పెన్షన్ చెల్లదని, ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) ఆదేశాలిచ్చి 12 రోజులు దాటినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడ్డంకులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని తెలిపారు. అధికారుల మధ్య కూడా ఫ్యాక్షనిస్టుల మాదిరి కక్షలు సరికాదని, ఏబీవీ పట్ల కక్షపూరిత వైఖరిని విడనాడాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏబీ వెంకటేశ్వరరావు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్నందున ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

సంతోషిమాత ఆలయంలో అన్నసంతర్పణ

పాయకాపురం, మే 20 : స్థానిక రాధానగర్‌లోని జై సంతోషిమాత ఆలయం పునఃప్రతిష్ఠాపన రెండో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చిన్ని చిట్టిబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.2000 మందికి జరిగిన అన్నసంతర్పణలో పాల్గొన్నారు.



చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్, మే 20 : ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ కార్యాలయంలో చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అలా తారక రామారావు 50 మంది చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఏర్పడనున్న కూటమి ప్రభుత్వంలో కాపు సామాజిక వర్గ ఆడపిల్లలకు పెళ్లి కానుక ఇవ్వాలని కోరారు. లింగం రజని, ప్రసన్న, అల్లిమిల్లి శ్రీనివాసరావు, సురేంద్ర పాల్గొన్నారు.

ధర్మపథం వేదికపై నృత్య సంకీర్తన

వన్‌టౌన్, మే 20: దుర్గగుడి ధర్మపథం వేదికపై సోమవారం హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ ఈశ్వరప్రసాద్ హృద్యంగా భక్తి పారవశ్యంతో నృత్య సంకీర్తన ఆలపించారు. జయజయదుర్గే, శ్రీమన్నారాయణ, స్వాగతం కృష్ణ ఓ రఘువీర కీర్తనలకు ఆయన చక్కటి ఆధ్యాత్మిక సొబగులను వెదజల్లారు.

కూచిపూడి నృత్య శిక్షణ, పుస్తక సమీక్ష

గవర్నర్‌పేట, మే 20: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం కూచిపూడి నృత్య శిక్షణ, పుస్తక సమీక్ష కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య శిక్షణ మాస్టారు బీవీఎస్ఆర్‌కె శర్మ కూచిపూడి నృత్యం గురించి విద్యార్థులకు వివరించి, ప్రారంభ స్తుతులు, సాధన చేయించారు. ప్రాథమిక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. పుస్తక సమీక్షలో భాగంగా పుస్తకాలు చదివించి, చెప్పించటం కార్యక్రమాన్ని గ్రంథాలయ నిర్వాహకులు నిర్వహించారు. వేదాంతం పాండురంగ శర్మ, కె. రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు

వన్‌టౌన్, మే 20: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం తనిఖీలు చేసినట్లు పౌరసరఫరాలశాఖ కార్యదర్శి హెచ్ అరుణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 386 తనిఖీలు నిర్వహించి 224 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎల్‌పీజీ డీలర్లపై 39, కిరాణా దుకాణాలపై 82, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్‌పై 103 చొప్పున కేసులు నమోదయ్యాయని తెలిపారు. విశాఖపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం, అమలాపురం, కొవ్వూరు, నందిగామ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాలలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

పోలీసులను దూషించిన ఇద్దరిపై కేసు

చిట్టినగర్, మే 20: పోలీసులను దూషించిన ఇద్దరి వ్యక్తులపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం చిట్టినగర్‌కు చెందిన ఈశ్వర్‌శంకర్, తరుణ్‌లు మద్యం మత్తులో కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం అర్ధరాత్రి గొడవ పడ్డారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ గొడవ పడుతున్న వారిని విడదీసి స్టేషన్‌లోకి తీసుకెళుతుండగా ఆ ఇద్దరు మద్యం మత్తులో మహిళా కానిస్టేబుల్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా ప్రకాశం పంతులు, కాసు వర్ధంతి



గవర్నర్‌పేట, మే 20: మాజీ ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డిలు దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఏపీసీసీ, సిటీ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టంగుటూరి, కాసు వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావులు మాజీ ముఖ్యమంత్రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ నేత పిళ్లై కిరణ్, షేక్ ఖాదర్, నాగళ్ళ కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉద్యోగావకాశాలు

● ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు

భారతీనగర్, మే 20: ఉద్యోగం త్వరగా సాధించాలంటే ఐటీఐ కోర్సు వరం లాంటిదని ఒకేషనల్ గైడెన్స్ జిల్లా కమిటీ చైర్మన్ దేవరపల్లి విక్టర్ బాబు తెలియజేశారు. సోమవారం ఉదయం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో ఉన్న ఐటీఐ ప్రాంగణంలో ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీఐ చదివిన వెంటనే అభ్యర్థి నైపుణ్యాలను బట్టి ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చని, ఐటీఐ తర్వాత రైల్వే, ఆర్మీ సహా అనేక ప్రభుత్వ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు మాట్లాడుతూ జూన్ 10 వరకు ఐటీఐ అడ్మిషన్లు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి సాంబయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్, ఒకేషనల్ గైడెన్స్ అధికారి వై.సత్య బ్రహ్మం, ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి రామ్మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.


న్యూసిటీ బ్లడ్‌బ్యాంక్ డైరెక్టర్ కల్యాణికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కల్యాణి

విజయవాడ, మే 20: విజయవాడ న్యూసిటీ బ్లడ్‌బ్యాంక్ డైరెక్టర్ కల్యాణి పిన్నమనేని తలసేమియా చిన్నారులకు అందించిన సేవలకు గుర్తింపు లభించింది. ఢిల్లీలోని ప్రముఖ డేస్ప్రింగ్ యూనివర్సిటీ ఆమెకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. ఈనెల 15న జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. గత ఐదేళ్లుగా న్యూసిటీ బ్లడ్‌బ్యాంక్ తరఫున కొన్ని వందల మంది తలసేమియా చిన్నారులకు కల్యాణి ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నారు. దీంతోపాటు ఉచితంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం, తలసేమియాపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కొత్తపేట పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



చిట్టినగర్, మే 20: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కొత్తపేట పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గాంధీబొమ్మసెంటర్, నైజాంగేటు తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులతోపాటు, వీధుల్లో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్తపేట సీఐ టి.గణేష్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపూడిలో ఫ్లాగ్‌మార్చ్

విద్యాధరపురం: ఎన్నికల అనంతరం ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రతి సెంటర్‌లోనూ పికెట్లు ఏర్పాటు చేశారు. సోమవారం భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపూడిలో భవానీపురం సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్సైలు ప్రసాద్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● గవర్నరుపేట సీఐ వెంకటరమణ, టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర ఆధ్వర్యంలో సోమవారం లెనిన్ సెంటర్ వద్ద ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. బీసెంట్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిని తొలగించారు.

హోర్డింగ్‌లకు

నాణ్యత ధ్రువీకరణ తప్పనిసరి

కమిషనర్ స్వప్నిల్ దినకర్



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్, పక్కనే చీఫ్ సిటీప్లానర్ ప్రసాద్

చిట్టినగర్, మే 20: నగరంలో హోర్డింగ్‌లతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏజెన్సీలు తప్పక స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్(నాణ్యత ధ్రువీకరణ పత్రం) సమర్పించాలని, లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఏజెన్సీలను హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస ప్రధాన కార్యాలయం నూతన భవనంలో టౌన్ ప్లానింగ్ అధికారులతోపాటు ఏజెన్సీలు, వాటి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నగర ప్రజల సంక్షేమంలో భాగంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేలా చూడాలని, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే సమయంలో ఏజెన్సీలు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఏజెన్సీలు హోర్డింగ్‌లకు సంబంధించిన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్‌లను సమర్పించాలని ఆదేశించారు. అనుమతి ఉన్న ఏజెన్సీలు ముందుగానే నాణ్యత ధ్రువీకరణ సమర్పించాలన్నారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీ.వీ.జీ.ఎస్.వీ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్-3 జూబిన్ చీరన్‌రాయ్, డిప్యూటీ సిటీ ప్లానర్-1 చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జగదీష్, మోహన్‌బాబు, బీపోలు, ప్లానింగ్ సెక్రటరీలు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వసంత మల్లిఖార్జున స్వామి ఆలయానికి

ఆదాయం కరువు

●పట్టించుకోని నిర్వాహకులు ● వేతనాలకూ డబ్బులేని వైనం ●భక్తుల రాక అంతంత మాత్రమే



వన్‌టౌన్, మే 20: బ్రాహ్మణవీధిలోని వసంత మల్లిఖార్జున స్వామి ఆలయ ఆదాయం (బుద్దవారి ఆలయం) రోజు రోజుకు దిగజారుతోంది. ఈ ఆలయం చాలా దశాబ్దాల క్రితం నిర్మించారు. ఒకప్పుడు ఆలయం వైభవం ఎంతగానో సాగింది. ఇక్కడ పర్వదినాలు అంటే శివరాత్రి, కార్తీకమాసం తదితర సమయాల్లోనూ భక్తుల రాకను వేళ్ల మీదే లెక్కించవచ్చు. ముఖ్యంగా దేవస్థానంలో ఆర్జిత పూజలు, అర్చనలు చేయడం కూడా తక్కువే. ఒక అర్చకుడు, స్వీపర్ ఇక్కడ ఉన్నారు. అర్చకుడు తనకు అరకొరగా వచ్చిన ఆదాయంతో కాలం గడుపుతున్నాడు. ఇంకొకవైపు ఆయన తనకు సహాయంగా ఉండేందుకు మరో ఇద్దరు అర్చకులను నియమించుకున్నాడు. స్వీపర్‌కు 14 నెలలుగా వేతనం ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఈ దేవస్థానం ఎండోమెంట్‌లో ఉంది. ఇక్కడి ఈవో ఎప్పుడు వస్తారో వెళతారో తెలియని పరిస్థితి ఉంది. ఆలయానికి సంబంధించిన కల్యాణమండం ఉంది. కొద్దికాలం వరకు ఆలయం దుర్గామల్లేశ్వరస్వామి దత్తత ఆలయం కింద ఉండేది.

ఈ సమయంలో లడ్డూ ప్రసాదం తయారీ కోసం దుర్గగుడి అధికారులు దానిని వినియోగించేందుకు అద్దెకు తీసుకున్నారు. ఇందుకు గాను నెలకు రూ.45 వేలు అద్దె చెల్లిస్తున్నారు. అయినప్పటికీ ఆ డబ్బు చాలని పరిస్థితి. ఇంకొక వైపు ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తుల నుంచి రుసుం వసూలు చేయడం లేదు. అర్చకులే భక్తులకు సంబంధించిన పూజలు నిర్వహిస్తూ దేవస్థానం ఆదాయాన్ని గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

లయోలలో ముగిసిన వేసవి శిక్షణ



భారతీనగర్, మే 20: ఆంగ్ల భాషను గ్రామీణ పేదపిల్లలకు ఉచితంగా నేర్పడం చాలా గొప్ప విషయం అని వెల్మన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ వెలగమర్తి జనార్ధన్ రావు అన్నారు. ఆంధ్రా లయోల కళాశాలలో సమ్మర్ షేప్ 2024 క్యాంప్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనార్ధనరావు విద్యార్థులకు ఆంగ్లభాష ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో, చదువులో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను, మెడల్స్‌ను అందజేశారు. ఎస్‌జే సంస్థ స్థాపకుడు ఫాదర్ బాలా మాట్లాడుతూ మే ఒకటో తేదీన ప్రారంభమైన సమ్మర్ షేప్స్ 2024 క్యాంప్ కార్యక్రమం సోమవారం ఘనంగా ముగిసిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ఎంతోగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్‌జే సంస్థను అభినందించారు.

‘సృష్టిలో అమ్మ ప్రేమ’పై చిత్రలేఖనం పోటీలు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

విజయవాడ కల్చరల్, మే 20 : సృష్టిలో అమ్మ ప్రేమ అనే అంశంపై నిర్వహించిన గరిమెళ్ల సుబ్బారావు స్మారక చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన లభించింది. నగరానికి చెందిన ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ స్టూడెంట్స్ వింగ్ ఆధ్వర్యంలో గరిమెళ్ల నానయ్య చౌదరి సహకారంతో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న చిన్నారులకు సితార సెంటర్‌లో వున్న సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్-2024లో సోమవారం రాత్రి సృష్టిలో అమ్మ ప్రేమ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ ఇన్‌చార్జి బాలాజీ, జయహో భారతీయం ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ అగస్త్యన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ వర్కింగ్ కమిటీ మెంబర్స్ సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, స్ఫూర్తి శ్రీనివాస్, రమేష్ అర్కాల, సంధ్యారాణి, మేడా రజని చేతుల మీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి శ్రావణ్‌కుమార్, లలితా సౌజన్య, బీవీఎంబి లోకేష్, లక్ష్మీప్రియాంక, గోపీ మనోజ్, ప్రవీణ్ కుమార్, దేవేష్, నదియా, హిమజ, స్ఫూర్తి, స్వేచ్ఛ, సింధూశ్రీ, నవ్యశ్రీలు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా చెత్త వాహనాల డ్రైవర్లు సమ్మె

●పేరుకుపోయిన చెత్త ● 15 దాటినా అందని జీతం



20వ డివిజన్ శ్రీనివాసా టవర్స్ వద్ద సర్వీసు రోడ్డులో చెత్త నిల్వలు

కృష్ణలంక, మే 20 : మున్సిపల్ కార్మికుల జీతాలు మే 15 వచ్చినా చెల్లించకపోవడంతో నాలుగు రోజులుగా చెత్తను తరలించే సీఎన్‌జీ వాహన డ్రైవర్లు వాహనాలు నిలిపివేసి సమ్మె చేస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు మహిళా కార్మికులతో కృష్ణలంకలోని అంతర్గత రోడ్లలో వున్న చెత్తను తోపుడు బండ్లపైకి ఎత్తించి వాటిని దూరంగా వున్న సర్వీసురోడ్డులోని చెత్త పాయింట్ల వద్ద డంప్ చేయిస్తున్నారు. దీంతో 10 గంటలయినా చెత్తను తరలించే నాథుడు లేక గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తోంది. తోపుడు బండ్లపైకి ఎత్తిన చెత్తను మహిళా కార్మికులు లాగలేక లాగుతూ ఆపసోపాలు పడుతూ తీసుకెళ్తుంటే అయ్యోపాపం అనిపించక మానదు. అసలే వర్షాకాలం కావడం చెత్త నుంచి దుర్వాసన వెదజల్లుతుండటంతో దోమలు పెరిగిపోయి ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ ఉన్నతాధికారులు డ్రైవర్ల సమ్మె విరమించేంత వరకు పురుష కార్మికులను పెట్టి ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతి, అనంతపురం, మాచర్ల ఘటనలకు

కారకులైన వారికి శిక్ష తప్పదు

టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం

విద్యాధరపురం, మే 20: పోలింగ్ అనంతరం అనంతపురం, మాచర్ల, తిరుపతిలలో జరిగిన అల్లర్ల ఘటనలలో వైసీపీ నాయకుల పాత్ర ఉందని, సిట్ దర్యాప్తులో నిగ్గు తేలుతుందని, కారకులైన వారందరికీ కోర్టుల్లో శిక్ష పడక తప్పదని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు , టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం హెచ్చరించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ అనంతరం అనంతపురం, మాచర్ల, తిరుపతిలలో జరిగిన అల్లర్ల ఘటనలలో వైసీపీ నాయకుల పాత్ర ఉందని, అయితే జగన్‌రెడ్డి ఈ సంఘటనలలో టీడీపీ నాయకులు పాత్ర ఎక్కువగా ఉందని చెబుతుండడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందాన ఉందన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి పోల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడని కానీ ప్రజల నిర్ణయం వేరుగా ఉండడంతో తోకముడిచాడన్నారు. చంద్రబాబునాయుడు సంపద సృష్టించి సంక్షేమ కార్యక్రమాలను నడుపుతారని తెలిపారు. పోలింగ్ ఒక ఉద్యమంలా నడిచిందని, పవన్‌కల్యాణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవుతారని. లోకేష్, ఉమ్మడి పార్టీల అభ్యర్థులు గెలుస్తున్నారన్నారు. మాజీ కార్పొరేటర్ నరసింహచౌదరి, డాక్టర్ సంక విశ్వనాథం, మరుపిల్ల తిరుమలేష్, సోలంకిరాజు జైన్, సర్వేపల్లి సుదర్శనరావు, అబిద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.







స్థానికుడితో మాట్లాడుతున్న బాబూరావు

చెత్త పన్ను వసూళ్లకు ఆదేశాలు దుర్మార్గం

● సీపీఎం సెంట్రల్ అభ్యర్థి బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, మే 20 : ఎన్నికల కోడ్ అమలులో ఉండగా చెత్త పన్ను వసూళ్లకు అధికారులు ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గమని సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సీహెచ్ బాబూరావు విమర్శించారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు ఎన్నికల్లో ఓట్లు వేసిన ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని, పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టారని విమర్శించారు. తక్షణమే చెత్త పన్ను వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



గానం చేస్తున్న కళాకారులు

సుస్వరాల రాగ లహరి సినీ గీతాలహరి

విజయవాడ కల్చరల్, మే 20 :రాగ లహరి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన చిత్ర గీతాల ఝరి సుస్వరాలను పండిస్తూ సురాగాల లహరిగా సాగింది.

యువ గాయకుడు అయ్యప్పన్ సాయి కృష్ణ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ గాయనీ గాయకులు స్వాతి మీరా కుమార్, రూపశ్రీ, సూర్య కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ అలీ, నాయక్‌లు పలు చిత్రాలలోని నాటి మేటి పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు. వీరికి రవి, ఇజ్రాయిల్, ప్రవీణ్, కొండయ్య, వాసు, జయరాజులు వాద్య సహకారమందించారు. మీరా కుమార్ పర్యవేక్షించగా అతిథులుగా ప్రసూనా రామన్, పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, నిడుమోలు రమా సత్యనారాయణ పాల్గొన్నారు.

పొంగుతున్న మ్యాన్‌హోల్స్



ఎన్నార్పీ రోడ్డులో పొంగుతున్న మ్యాన్‌హోల్

సత్యనారాయణపురం, మే 20: సత్యనారాయణపురం నాగేశ్వరరావు పంతులు రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగి రోడ్డు మీదకు వస్తోంది. గత మూడు రోజులుగా రోడ్డు పైన నీరు పొంగుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు షాపుల ముందు, రోడ్డు పైన నిలబడి పోవడంతో తీవ్రదుర్వాసన వస్తోందంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపైన వెళుతుంటాయి. మురుగునీరు రోడ్డుపైకి రావడం వల్ల వాహనాలు వెళ్లినప్పుడు పాదచారులపైన పడుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ● 33వ డివిజన్‌లో మురుగు నీరు పొంగకుండా ఆంధ్రరత్న పార్కు వద్ద నిర్మిస్తున్న పంపింగ్‌స్టేషన్ పనులు పూర్తి కాలేదు. మ్యాన్‌హోల్స్ పొంగకుండా ఉండేందుకు పంపింగ్ స్టేషన్ వద్ద నీరు నిల్వ ఉండకుండా వెళ్లేందుకు మోటార్ ఏర్పాటు చేశారు. అయినా ఫలితం లేదు. ఈ విషయమై స్థానికులు కార్పొరేటర్ శర్వాణీ మూర్తికి ఫిర్యాదు చేయగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ స్పందించడం లేదని చెప్పారు. డివిజన్‌లో పారిశుధ్యం అధ్వానంగా మారిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

కనకదుర్గనగర్‌లో ఓ షాపు నిర్వాహకుడి నిర్వాకం

● దేవస్థానానికి రూ. 25 లక్షలకు పైగా బకాయి



రోడ్డు మీదకు విస్తరించిన షాపు

వన్‌టౌన్, మే 20: కనకదుర్గనగర్‌లో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధీనంలోని షాపులలో ఒక షాపును అధికార పార్టీకి చెందిన వ్యక్తి లీజుకు తీసుకుని నడుపుతున్నాడు. అయితే అతను నిబంధనలను బేఖాతరు చేసి అతనికి కేటాయించిన స్థల పరిమితికి మించి రోడ్డు మీదకు షాపును విస్తరించాడు. భక్తుల రాకపోకలకు అడ్డుగా ఉంటున్నా సరే పట్టించుకోవడం లేదు. ఇంకొకవైపు దేవస్థానానికి కూడా సుమారు రూ. 25 లక్షలకు పైగా బకాయి ఉన్నాడు. ఇందుకు సంబంధించి దేవస్థానం పలుమార్లు హెచ్చరించినా అధికార పార్టీని అడ్డుపెట్టుకుని బకాయి చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో దేవస్థానం అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే అద్దె చెల్లించిన పక్క షాపు నుంచి విద్యుత్‌ను వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది.

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టీ ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి.

ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

మెగాస్టార్‌తో మరోసారి?





మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లోనే పాటలు కూడా చిత్రీకరిస్తారని సమాచారం. జులై కల్లా షూటింగ్ పార్ట్ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ ప్రారంభించి, సంక్రాంతికి సినిమాను సిద్ధం చేయాలని నిర్మాతల ప్లానింగ్. 'విశ్వంభర' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నప్పటికీ తదుపరి చిత్రం మీద దృష్టి పెట్టారు చిరంజీవి. ఆయన కుమార్తె సుస్మిత నిర్మించే ఈ సినిమాకు కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ సినిమా గురించి వివరాలు ఏమీ బయటకు రాలేదు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌ను దర్శకుడు మోహన్‌రాజాకు అప్పగించినట్లు చెబుతున్నారు. మెగాస్టార్ హీరోగా రూపొందిన 'గాడ్ ఫాదర్' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. మోహన్‌రాజా స్ర్కిప్ట్ నేరేషన్ ఇచ్చారనీ, మెగాస్టార్ దాన్ని ఓకే చేశారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటిస్తారని అంటున్నారు.



పవర్‌ఫుల్ అవతార్‌లో...

మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వార్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబీ'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్ట్‌లు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.



ఈ సినిమానే నా ఫేవరెట్

'సత్యభామ' సినిమాతో పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో ప్రేక్షకులని పలకరించడానికి సిద్ధమయ్యారు కాజల్ అగర్వాల్. నవీన్ చంద్ర, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగం చేసింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కాజల్ మీడియాతో పలు విషయాలు పంచుకున్నారు. "దర్శకుడు చెప్పిన ఈ క్రైమ్ థ్రిల్లర్ విన్నవెంటనే ఆకట్టుకుంది. నేను ప్రస్తుతం నటించిన 'సత్యభామ' సినిమానే నా సినిమాల్లో ఫేవరెట్. ఎవరైనా సరే వారు ప్రస్తుతం నటించిన చిత్రాన్నే ఇష్టపడాలి. అందుకే నాకు ఈ సినిమానే నా ఫేవరెట్. ఈ సినిమా కోసం నేను మొదటిసారి పోలీసు పాత్రలో కనిపిస్తున్నా. తెరపై కొత్త కాజల్‌ను ఈ సినిమాతో చూస్తారు" అని చెప్పారు.



పాత సినిమా.. కొత్త వివాదం

పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే.. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్




దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. తెలుగు, కన్నడ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి అభిషేక్ దర్శకత్వం వహిస్తున్నారు. బృందా ఆచార్య కథానాయిక. హెచ్.కె. ప్రకాశ్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దీక్షిత్ శెట్టి గన్‌తో షూట్ చేస్తూ, కాలికి టైగర్ మాస్క్ పెట్టుకుని కనిపించారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: జుడాన్ శ్యాండీ, ఫొటోగ్రఫీ: అభిషేక్ జే, ఎడిటింగ్: తేజస్ ఆర్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పోయెటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్టర్ రూపొందిస్తున్నారు. 'తనని చిన్నచూపు చూసే సమాజం భవితను మార్చేసిన వ్యక్తి కథ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, డయ్యూ, డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాశ్, మురళీశర్మ, పృథ్వీ, శరణ్య తదితరులు చిత్రంలో నటిస్తున్నారు.

ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.

కంప్లీట్ మాస్ ఎంటర్టైనర్



రామ్ తేజ్, వర్షిని, మౌనిక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మల్లె మొగ్గ'. తోట వెంకట నాగేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై మంచి టాక్‌ను సంపాదించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్‌ను నిర్వహించడంతో పాటు రామ్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'తథాస్తు' సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత తోట వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ "మల్లె మొగ్గ' సినిమాకు బీ,సీ సెంటర్లలో ఆదరణ బాగుంది. విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రస్తుతం చేస్తున్న 'తథాస్తు' మూవీ కంప్లీట్ మాస్ ఎంటర్టైనర్" అని చెప్పారు. హీరో రామ్ తేజ్ మాట్లాడుతూ "మల్లె మొగ్గ' సినిమా రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. ఈ సినిమాను ఆదరించినట్టే 'తథాస్తు' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా" అని అన్నారు. నటుడు భానుచందర్ మాట్లాడుతూ "చాలా మంచి కథతో తెరకెక్కిన చిత్రం 'మల్లె మొగ్గ'. ఇందులో గుర్తుండిపోయే పాత్ర పోషించాను" అని చెప్పారు.

యాక్షన్‌తో నిండిన ఫ్యామిలీ డ్రామా



శివ కంఠంనేని, శ్రీసూర్య, ప్రియా హెగ్డే, ప్రీతి శుక్లా నటించిన చిత్రం 'బిగ్ బ్రదర్'. గోసంగి సుబ్బారావు దర్శకత్వం వహించారు. కె. శివశంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 24న 'బిగ్ బ్రదర్' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు గోసంగి సుబ్బారావు మాట్లాడుతూ "ఈ సినిమా యాక్షన్‌తో నిండిన ఫ్యామిలీ డ్రామా. ఇది సినిమా ప్రేమికులందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. హీరో శివ కంఠంనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ సాధిస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సంతోశ్, కెమెరా: ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఘంటా శ్రీనివాసరావు.

అమ్మాయిలతో జాగ్రత్త!



సూర్యరాజ్, మెరీనా సింగ్ జంటగా నటించిన చిత్రం 'ఏ 20'. అమ్మాయిలతో జాగ్రత్త అనేది ట్యాగ్‌లైన్. నూగూరి రవీంద్ర దర్శకత్వంలో పి.బి. మహేంద్ర నిర్మించిన ఈ చిత్రంలోని పాటలు, ప్రచార చిత్రం విడుదల చేశారు. మధుర ఆడియో సంస్థ ద్వారా ఈ చిత్రం పాటలు విడుదల అయ్యాయి. తెలుగు నిర్మాతలమండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్, దర్శకనిర్మాత సాయివెంకట్, వి.సముద్ర ముఖ్య అతిధులుగా హాజరై చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంగీత దర్శకుడు యెలేందర్, గీత రచయిత దేవకరణ్, సినిమాటోగ్రాఫర్ రామ్‌ప్రసాద్, కొరియోగ్రాఫర్స్ శైలజ, శ్యామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవ్య డాక్టర్

మంగళవారం • 21 మే 2024


క్లోమం క్షేమం
- మద్యపానం, ధూమపానం చేయకూడదు
- ప్రతి రోజూ క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి.
- పిండిపదార్థాలు తక్కువగా తీసుకోవాలి



పొట్ట నొప్పి సర్వసాధారణమే! అలాగని నొప్పి తగ్గించే మందులు వాడుకుంటూపోతే అసలు సమస్య తిరిగి సరిదిద్దలేనంతగా ముదిరిపోవచ్చు. క్లోమగ్రంథి సమస్య అలాంటిదే! తప్పుదోవ పట్టించే లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రతించి సమస్యకు తగిన చికిత్స తీసుకోవాలంటున్నారు వైద్యులు.

పాంక్రియాస్

క్లోమం ఇలా క్షేమం



ఇన్సులిన్ ఉత్పత్తి సవ్యంగా జరగానికీ, ఆహారం జీర్ణించుకోడానికి అవసరమైన ఎంజైముల స్రావానికీ పాంక్రియాస్ తోడ్పడుతూ ఉంటుంది. కానీ పాంక్రియాస్ జబ్బు పడినప్పుడు బయల్పడే లక్షణాలు తప్పుదారి పట్టించేలా ఉండడం, క్లోమ గ్రంథి పొట్టలో అంతర్గత అవయవాల అడుగున ఉండడం వల్ల, స్కాన్‌లలో ఈ గ్రంథిని స్పష్టంగా కనిపెట్టలేకపోవడం వల్ల ఈ గ్రంథి సమస్యలు ఆలస్యంగా వెలుగులోకి వస్తుంటాయి. అలాగే క్లోమ గ్రంథికి కేన్సర్ సోకినప్పుడు, దాని పక్కన ఉండే రక్తనాళాలన్నీ ఇన్వాల్వ్ అయి ఉండడం మూలంగా చివరి దశలో సమస్యను కనిపెట్టినప్పటికీ సర్జరీ చేయలేని పరిస్థితి ఉంటుంది. అయితే సాధారణంగా పాంక్రియాస్ సమస్య అక్యూట్, క్రానిక్ అనే రెండు దశల్లో బయల్పడుతూ ఉంటుంది. ఈ రెండు సమస్యల్లో పాంక్రియాస్‌లో వాపు కనిపిస్తుంది. మద్యపానం, గాల్ స్టోన్స్ ఈ వాపుకు ప్రధాన కారణాలు. ట్రైగ్లిజరైడ్స్, క్యాల్షియం మోతాదులు ఎక్కువగా ఉన్నా, పుట్టుకతో డక్టల్ అబ్నార్మాలిటీ ఉన్నా, జన్యుపరమైన సమస్యలు ఉన్నా పాంక్రియాస్‌లో వాపు వస్తుంది.

ఆ నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు

పాంక్రియాస్ వాపులో వచ్చే 80 శాతం అటాక్స్ ప్రారంభంలో తక్కువ తీవ్రతను కలిగి ఉంటాయి. మిగతా 20% అటాక్స్ తీవ్రంగా ఉంటాయి. ఈ అటాక్స్ పొట్టలో నొప్పితో మొదలవుతాయి. బొడ్డు పైభాగంలో మొదలయ్యే నొప్పి వెన్నులోకి పాకుతూ ఉంటుంది. అక్యూట్ పాంక్రియటైటిస్‌లో ఈ నొప్పి అప్పుడప్పుడూ వేధిస్తూ ఉంటే, క్రానిక్ దశకు చేరుకున్న తర్వాత, నొప్పి సంవత్సరాల తరబడి వేధిస్తూ ఉంటుంది. భోజనం తిన్న తర్వాత నొప్పి పెరుగుతూ ఉంటుంది. క్లోమ గ్రంథిలో గడ్డలు (కేన్సర్) ఏర్పడినప్పుడు, కామెర్లు, మధుమేహం తలెత్తుతాయి. బరువు కోల్పోతారు. అలాగే మలంలో కొవ్వు పోతూ ఉంటుంది. పాంక్రియాస్ స్రావాలు తగ్గడం వల్ల ఆహారంలో ఉండే కొవ్వులు జీర్ణం అవకుండా, మలం ద్వారా బయటకు వెళ్లిపోతూ ఉంటాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు కొవ్వులు నీళ్లలో తేలుతూ ఉండడం, నీళ్లు కొట్టినా మలం తేలికగా వదలకపోవడం లాంటివి కనిపిస్తాయి.

క్రానిక్ దశ ప్రమాదకరం

క్రానిక్ దశలో పాంక్రియాటిక్ డక్ట్‌లో రాళ్లు చేరతాయి. ఇందుకు ప్రధాన కారణం మద్యపానం, ధూమపానం. మన దేశంలో ట్రాపికల్ పాంక్రియటైటిస్ సర్వసాధారణం. 20 ఏళ్ల వయస్కుల్లో కనిపించే ఈ సమస్యలో పాంక్రియాటిక్ డక్ట్‌లో రాళ్లు చేరి, నొప్పి వేధిస్తుంది. ఆ నొప్పిని తగ్గించుకోవడం కోసం పెయిన్‌కిల్లర్స్ (ఒపియాయిడ్ అనాల్జెసిక్స్) వాడుతూ, వాటికి అలవాటు పడిపోతూ ఉంటారు. ఈ అలవాటు అడిక్షన్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది. ఇలా దీర్ఘకాలంలో పాంక్రియాస్ దెబ్బతిని, ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోయి, మధుమేహం కూడా తలెత్తుతుంది. ఇలా జగరకుండా ఉండాలంటే నొప్పి మొదలైన వెంటనే వైద్యులను కలిసి, సమస్య తీవ్రతను అంచనా వేసి, చికిత్స తీసుకోవాలి.



చికిత్స ఇలా...

పాంక్రియాస్ పొట్టలో అడుగున ఉంటుంది కాబట్టి అల్ట్రాసౌండ్‌లో స్పష్టంగా కనిపించకపోవచ్చు. కాబట్టి పాంక్రియాస్ సమస్యలను స్పష్టంగా తెలుసుకోవడం కోసం సిటి స్కాన్ లేదా ఎమ్మారై చేయించాలి. పాంక్రియాస్ సమస్యను మరింత కచ్చితంగా నిర్ధారించుకోవడం కోసం, నోటి ద్వారా పొట్టలోకి గొట్టం పంపించి, పాంక్రియాస్‌ను దగ్గరగా పరీక్షించవచ్చు. పరీక్షలో రాళ్లు ఉన్నట్టు తేలితే ఎండోస్కోపీ ద్వారా వాటిని తొలగించుకోవచ్చు. కొందర్లో సిస్టులు కూడా ఏర్పడుతూ ఉంటాయి. అలాంటప్పుడు సర్జరీ చేసి పాంక్రియాస్‌ను తెరిచి, రాళ్లను తొలగించి, చిన్నపేగుకు జాయిన్ చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ సర్జరీ కూడా కీహోల్ ద్వారా చేయగలిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. అక్యూట్ పాంక్రియాటైటిస్ గాల్ స్టోన్స్ వల్ల తలెత్తితే, గాల్ స్టోన్స్‌ను తొలగిస్తే సమస్య సర్దుకుంటుంది. మద్యపానం వల్ల అక్యూట్ పాంక్రియటైటిస్ వస్తే, ఆ అలవాటు వెంటనే మానుకోవాలి. మానుకోకపోతే సమస్య క్రానిక్ దశకు చేరుకుంటుంది.
క్రానిక్ దశకు చేరుకున్న కొందర్లో క్లోమానికి రక్తప్రసరణ పూర్తిగా పోయి, క్లోమంలో కొంత భాగం కుళ్లిపోయి, ఇన్‌ఫెక్షన్ మొదలవుతుంది. ఇలాంటప్పుడు సర్జరీతో కుళ్లిపోయిన భాగాన్ని తొలగించుకోవాలి.

డాక్టర్ టి.ఎల్.వి.డి. ప్రసాద్ బాబు
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ బేరియాట్రిక్ సర్జన్,
యశోద హస్పిటల్స్,
సికింద్రాబాద్.



మహిళల్లో...

మధ్య వయసు మహిళల్లో, యువతుల్లో క్లోమగ్రంథిలో సిస్టిక్ ట్యూమర్లు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఒకసారి తొలగిస్తే, రెండోసారి తలెత్తవు. ఇవి ప్రమాదకరమైనవి కాకపోయినా, భవిష్యత్తులో కేన్సర్‌గా మారే అవకాశాలుంటాయి. కాబట్టి వీటిని కూడా వెంటనే తొలగించుకోవాలి.

క్లోమంలో కేన్సర్

క్రానిక్ పాంక్రియటైటిస్ సమస్య దీర్ఘకాలంలో కేన్సర్‌గా పరిణమించే ప్రమాదం ఉంది. మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉన్న వాళ్లకు కూడా కేన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. కొందర్లో జన్యుపరమైన సమస్యల వల్ల కూడా క్లోమ కేన్సర్ తలెత్తవచ్చు. అయితే అన్ని కేన్సర్‌లలో పాంక్రియాటిక్ కేన్సర్ అత్యంత ప్రమాదకరమైనది. ఈ కేన్సర్ వేగంగా వృద్ధి చెందడంతో పాటు, రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి క్లోమ కేన్సర్ ప్రాణాంతకం కాకుండా




ఉండడం కోసం తొలి దశల్లోనే వ్యాధిని గుర్తించాలి. కాబట్టి మధుమేహం, కామెర్లు నిర్ధారణ అయినప్పుడు, వాటి కోసమే మందులు వాడుకోవడమే కాకుండా, ఒకసారి స్కాన్ చేయించుకుని పాంక్రియాస్ పరిస్థితిని తెలుసుకోవాలి. కేన్సర్ అని నిర్ధారణ అయినప్పుడు బయాప్సీ చేసి, జెనెటిక్ అనాలసిస్ చేయించి, టార్గెటెడ్ థెరపీ ద్వారా వ్యాధిని తగ్గించుకోవచ్చు. ఒకవేళ నాల్గవ దశ కేన్సర్ నిర్ధారణ అయినప్పుడు, సర్జరీకి ముందు కీమోథెరపీ ఇచ్చి, తర్వాత సర్జరీ చేయవలసి ఉంటుంది. తొలి దశ కేన్సర్‌కు సర్జరీ, తర్వాత కీమో అవసరమవుతాయి.

అవేర్‌నెస్

హెర్నియాతో జాగ్రత్త

చర్మపు తిత్తిలోకి పేగులు దిగిపోయి పొత్తికడుపు లేదా గజ్జల్లో హెర్నియా కనిపిస్తే వీలైనంత తొందరగా వైద్యుల్ని సంప్రతించి చికిత్స మొదలుపెట్టాలి. లేదంటే పొట్టలో చర్మం అడుగున ఏర్పడిన రంధ్రం పెద్దదైపోతూ సమస్య మరింత జటిలమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ తిత్తిలోకి చేరుకున్న పేగులకు రక్త ప్రసరణ అందక కుళ్లిపోవచ్చు కూడా! ఇలాంటప్పుడు ఆ పేగులు సెప్టిక్ అవుతాయి. ఇన్‌ఫెక్షన్ పెరిగి ప్రాణాలకే ప్రమాదం సంభవించవచ్చు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసే కొంతమందిలోనైతే పేగుల పనితీరు తలకిందులై మలం, ఆహారం కలిసిపోయి అవి వెళ్లే మార్గాలు తారుమారవ్వచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి. ఇలా జరగకుండా ఉండాలంటే హెర్నియా లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.



హెర్నియా రాకుండా...

హెర్నియా రాకుండా ఉండాలంటే పొత్తికడుపు మీద ఒత్తిడి పనే పనులకు దూరంగా ఉండాలి. అలాగే సర్జరీల కోసం అనుభవజ్ఞులైన వైద్యులను ఎంచుకోవాలి. హెర్నియా రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు మరికొన్ని...
- సాధారణ ప్రసవం, సిజేరియన్ సర్జరీ తర్వాత తప్పనిసరిగా పొట్ట కండరాలు బలపడే వ్యాయామాలు చేయాలి.
- మలబద్ధకం లేకుండా చూసుకోవాలి.
- మధుమేహం అదుపులో ఉంచుకోవాలి.
- దగ్గు తెప్పించే ధూమపానం మానేయాలి.
- పురుషులు ప్రాస్టేట్ గ్రంథి సమస్యలను సరిదిద్దుకోవాలి.
- బరువులెత్తేటప్పుడు క్రమపద్ధతి పాటించాలి.
- ఎత్తుకు తగిన బరువు మెయింటెయిన్ చేయాలి.
- అధిక బరువు తగ్గించుకోవాలి.
- దగ్గుకి కారణమయ్యే రుగ్మతల్ని అదుపు చేయాలి.

తెలుసుకుందాం

రోజుకు ఎన్ని పోషకాలు?

ఆహారంలో సరిపడా పోషకాలున్నప్పుడే అది సమతులాహారం అవుతుంది. అందుకోసం శాకాహారులైతే రోజు మొత్తంలో 250 గ్రాముల తృణధాన్యాలు, 400 గ్రాముల కూరగాయలు, వంద గ్రాముల పండ్లు, 85 గ్రాముల పప్పుదినుసులు, 35 గ్రాముల నట్స్, 27 గ్రాముల కొవ్వులు, నూనెలు, 300 గ్రాముల పాలు/పెరుగు తీసుకోవాలి. మాంసాహారులైతే 260 గ్రాముల తృణధాన్యాలు, 400 గ్రాముల కూరగాయలు, 100 గ్రాముల పండ్లు, 55 గ్రాముల పప్పుదినుసులు, 70 గ్రాముల చికెన్/మాంసం, 30 గ్రాముల నట్స్, సీడ్స్, 27 గ్రాముల కొవ్వులు, నూనెలు, 300 గ్రాముల పాలు/పెరుగు తీసుకోవాలి. అలాగే ఆహారంలోని పోషకాలు నష్టపోకుండా అదే పనిగా బియ్యం, పప్పుదినుసులను నీళ్లలో కడగకూడదు. అలాగే కూరగాయలు, పండ్లను చిన్న చిన్న ముక్కలుగా కోసుకోకుండా, పెద్దవిగా కోసుకోవాలి. కోసిన వెంటనే వండుకోవాలి, లేదా తినేయాలి. గిన్నెల మీద మూత ఉంచి వండుకోవాలి. లేదా కుక్కర్‌లో ఉడికించుకోవాలి. ఓవెన్‌లో వంట గురించి కొందరికి అపోహలుంటాయి. సంప్రదాయబద్ధమైన వంట విధానాల్లో జరిగే పోషక నష్టానికీ, మైక్రోఓవెన్‌లో జరిగే పోషక నష్టానికి వ్యత్యాసం ఎంతో తక్కువ.



మార్గదర్శకాలు

ఆరోగ్యం సొంతం చేసుకుందాం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) తాజాగా 170 పేజీల ఆరోగ్య మార్గదర్శకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచిస్తున్న ఈ మార్గదర్శకాలు పరిపూర్ణ ఆరోగ్యానికి దోహపడేలా రూపొందాయి.

భారతదేశం 56.4% వ్యాధుల భారంతో కుదేలవడానికి కారణం అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లే కారణమని ఆ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. 13 ఏళ్ల తర్వాత తాజాగా సవరించిన ఆ మార్గదర్శకాలను పాటించగలిగితే అనారోగ్యకరమైన జీవనశైలి ఫలితంగా వాటిల్లే మరణాల రేటును నివారించవచ్చని ఎన్ఐఎన్ పేర్కొంటోంది. క్రమం తప్పక వ్యాయామం చేయడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినగలిగితే హృద్రోగాలు, మధుమేహం బారిన పడే అవకాశాలు తగ్గుతాయని కూడా ఎన్ఐఎన్ పేర్కొంటోంది. అంతే కాకుండా సప్లిమెంట్లు, ప్రొటీన్ పౌడర్ల వినియోగం గురించి కూడా కొన్ని సూచనలు చేసింది.

సప్లిమెంట్లు, ప్రాసెస్డ్ ఫుడ్స్

ప్రొటీన్ సప్లిమెంట్లు ఆరోగ్యకరమైనవి కావు. కాబట్టి ప్రజలు వాటిని మానేయడమే ఉత్తమం. దీర్ఘకాలం పాటు ప్రొటీన్ పౌడర్లు తీసుకోవడం మూలంగా ఎముకల సాంద్రత తగ్గడంతో పాటు మూత్రపిండాలు కూడా పాడవుతాయి. కాబట్టి ఒక కిలో శరీర బరువుకు 1.6గ్రాముల ప్రొటీన్ చొప్పున లెక్కించి తీసుకోవడం ఉత్తమమని ఎన్ఐఎన్ సూచిస్తోంది. అలాగే ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు వృత్తిపరమైన లక్ష్యాల మీద దృష్టి పెడుతూ, ఒక కీలకమైన అంశాన్ని విస్మరిస్తున్నారనీ, ఆరోగ్యకరమైన శరీరంతోనే శక్తి సమకూరి, జీవిత లక్ష్యాల వైపు పయనించగలిగే సామర్థ్యం, నైపుణ్యాలు సమకూరతాయనీ ఎన్ఐఎన్ పేర్కొంటోంది. ప్రాసెస్ చేసిన పదార్థాలకు బదులుగా తాజా పదార్థాలు తినడాన్నే హెల్తీ ఈటింగ్‌గా పరిగణించాలి. ప్రాసెస్ చేసిన, నిల్వ ఉన్న ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌లో నిల్వ పదార్థాలను జోడిస్తారు కాబట్టి పోషక నష్టం జరుగుతుంది. పైగా ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌లో ఉప్పు, చక్కెరలు అధికం. వీటితో జబ్బులు ఎంతో ముందుగానే సంక్రమిస్తాయి. రోజు మొత్తంలో తీసుకునే చక్కెర ఒక రోజుకు శరీరానికి సమకూరే పూర్తి శక్తిలో ఐదు శాతానికి పెరగకుండా చూసుకోవాలని ఐసిఎమ్మార్ సూచిస్తోంది. తాజా కూరగాయలు, పప్పుదినుసులు, చిక్కుళ్లు మొదలైన పదార్థాలతో కూడిన సంతులన ఆహారం తీసుకోవాలని కూడా సూచిస్తోంది. అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్స్ వల్ల ఒబేసిటీ తప్పదనీ, గుండెపోటు ముప్పు పొంచి ఉంటుందనీ, మధుమేహం దరి చేరుతుందనీ ఎన్ఐఎన్ హెచ్చరిస్తోంది. ఇన్‌స్టంట్ నూడుల్స్, బ్రేక్‌ఫాస్ట్ మిక్సెస్, సూప్ మిక్సెస్ మొదలైనవన్నీ అల్ట్రాప్రాసెస్డ్ కోవలోకే వస్తాయి. కాబట్టి వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసుకున్న సంప్రదాయ వంటకాలనే ఎంచుకోవాలని ఎన్ఐఎన్ సూచిస్తోంది.

బరువు ఇలా తగ్గాలి

బరువును తగ్గించే పలు రకాల డైట్స్‌ను ఎంతో మంది ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే అనుసరించేది ఎలాంటి డైట్ అయినా, రోజు మొత్తంలో తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి అందే క్యాలరీలు వెయ్యికి తగ్గకుండా చూసుకోవాలి. అలాగే తీసుకునే డైట్‌లో అన్ని రకాల పోషకాలూ ఉండాలని ఐసిఎమ్మార్ అంటోంది. బరువును దీర్ఘకాలం పాటు కాలక్రమేణా తగ్గించుకోవాలనీ, హఠాత్తుగా అధిక బరువు తగ్గడం, యాంటీ ఒబేసిటీ మందులు వాడడం ఆరోగ్యానికి హానికరమని కూడా హెచ్చరిస్తోంది. అలాగే ఆరోగ్యకరమైన తీరులో బరువు తగ్గడం కోసం ఐసిఎమ్మార్ కొన్ని మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. అవేంటంటే...
- తగినన్ని కూరగాయలతో కూడిన సంతులన భోజనాన్ని ఎంచుకోవాలి. దాన్లో పీచు, పోషకాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే ఆకలి అదుపులో ఉండి అదనపు క్యాలరీలు శరీరాలకు అందకుండా ఉంటాయి.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల సమర్థంగా బరువు తగ్గవచ్చు.
- ఆహార పరిమాణం కూడా కీలకమే! అలాగే అవసరానికి మించి తినే అలవాటును కూడా మానుకోవాలి.
- పోషకభరిత ప్రత్యామ్నాయాలైన గుప్పెడు నట్స్, పెరుగు, పచ్చి కూరగాయలు లాంటివి స్నాక్స్‌గా తినాలి.
- చర్మం తీసిన చికెన్, లేత మాంసం, చేపల్లో క్యాలరీలు, శాచురేటెడ్ ఫ్యాట్స్ తక్కువగా ఉంటాయి.
- గ్రిల్లింగ్, బేకింగ్, ఆవిరి మీద ఉడికించడం లేదా సాటీయింగ్‌లలో తక్కువ నూనె పడుతుంది. కాబట్టి వేపుళ్లకు బదులుగా ఈ విధానాలనే ఎంచుకోవాలి. ఈ విధానాల వల్ల పదార్థాల్లోని పోషకాలు కూడా నష్టపోకుండా ఉంటాయి.
- శీతలపానీయాలు, పండ్ల రసాలు మానేసి హెర్బల్ టీ, గ్రీన్ టీ లాంటివి తాగాలి.
- క్యాలరీలు, శాచురేటెడ్ ఫ్యాట్స్, అదనపు చక్కెర, ఉప్పు లాంటి వివరాల కోసం ఫుడ్ లేబుల్స్ చదవాలి. ఆరోగ్యకరమైన దినుసులతో తయారైన పదార్థాలనే ఎంచుకోవాలి.



గుడ్ ఫుడ్

పదార్థాలు - ప్రత్యామ్నాయాలు



తోచింది, నచ్చింది తినడం కాదు. ఆరోగ్యానికి మేలు చేసేదీ, పోషకభరితమైనదీ తినాలి. అందుకోసం వీలున్న ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

జంక్ ఫుడ్: పిజాలు, బర్గర్లు మొదలైన జంక్ ఫుడ్స్‌లో అత్యధిక క్యాలరీలుంటాయి. వీటిలోని రిఫైన్డ్ దినుసులు ఆరోగ్యానికి హానికరం కాబట్టి వీటికి బదులుగా తక్కువ క్యాలరీలున్న సలాడ్లు, మొలకలు ఎంచుకోవాలి.

పునుగులు, బజ్జీలు: ఈ స్నాక్స్ తరచూ తింటూ ఉంటాం. ఇంట్లో తయారుచేసుకున్నవే తిన్నా వీటి ద్వారా అధిక మొత్తాల్లో కొవ్వులు శరీరంలోకి చేరతాయి. కాబట్టి వీటికి బదులుగా నట్స్, సీడ్స్ తినాలి. వేరుసెనగలు, బాదం లాంటి వాటిలో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి.

బిస్కెట్లు, కేకులు: ఈ స్నాక్స్‌లో అత్యధికంగా పాలిష్ పట్టిన దినుసులుంటాయి. అలాగే అత్యధిక కొవ్వులు, చక్కెరలు ఉంటాయి. వీటికి బదులుగా సంప్రదాయ తీపి పదార్థాలైన వేరుసెనగ చిక్కీలు, పల్లీ ముద్దలు, మిల్లెట్ ఉండలు లాంటివి తినాలి.

కూల్ డ్రింక్స్: వీటిలో చక్కెర ఎక్కువ. ఎనర్జీ డ్రింక్‌లు, జీరో షుగర్ డ్రింకులు కూడా హానికరమే! కాబట్టి వీటికి ప్రత్యామ్నాయంగా కొబ్బరినీళ్లు, మజ్జిగ, తాజా చెరకు రసాలు తాగాలి.

పళ్ల రసాలు: వీటిని ఇంట్లో తయారుచేసుకునే అలవాటు ఉండదు కాబట్టి బయట దొరికే పండ్లరసాల మీదే ఆధారపడుతూ ఉంటాం. వీటిలో చక్కెరలు ఎక్కువ. పైగా పండ్ల రసాలతో తగిన పీచు శరీరానికి అందకుండా పోతుంది. కాబట్టి పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లనే తినడం అలవాటు చేసుకోవాలి.

జామ్స్, సాస్, డిప్స్: వీటిలో ఉప్పు, చక్కెరలు, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు ఎక్కువ. వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసిన పచ్చళ్లు ఎంచుకోవాలి.

హెల్త్ వెల్త్

నాడీ వ్యవస్థ నాజూగ్గా

నాడీ వ్యవస్థ కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన కొవ్వులు ఆహారంలో చేర్చుకోవాలి. ఇందుకోసం...

అవిసె నూనె: ఈ నూనెను కూరగాయల సూప్ మీద పోసుకుని తీసుకోవచ్చు. అయితే ఈ నూనెను నేరుగా వంటకు ఉపయోగించకూడదు.

సబ్జా: వీటిని 10 నుంచి 20 నిమిషాలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి. లేదంటే రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగవచ్చు. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు జీర్ణవ్యవస్థతో పాటు నాడీవ్యవస్థనూ ఆరోగ్యంగా ఉంచుతాయి.

అవకాడొ: మాంసకృత్తులు కలిగిన ఈ పండును ఏ సమయంలోనైనా తినవచ్చు.

నాణ్యమైన నూనెలు: ఆలివ్, అవకాడొ, కొబ్బరి, నువ్వులు, పొద్దుతిరుగుడు నూనెలు వాడుకోవచ్చు.

నెయ్యి: ఆయుర్వేదంలో నెయ్యి స్వర్ణంతో సమానం. వెన్న, నెయ్యి జీర్ణశక్తిని పెంచి, శరీర కణజాలాలకు శక్తినిస్తుంది.

మర్దన మంచిది

స్వీయ మర్దనతో సాంత్వన పొందవచ్చు. రోజూ లేదా వారంలో ఒకసారి ఇందుకోసం తీరిక సమయం కేటాయించుకోవాలి. శరీరమంతా నూనె పట్టించి సున్నితంగా మర్దన చేసుకోవాలి. పాదాలతో మొదలుపెట్టి నాడులతో సంబంధం ఉన్న ప్రతి ప్రాంతాన్నీ మర్దన చేసుకోవాలి. పాదాలతో మొదలుపెట్టి కాలి గిలకలు, పిక్కలు, మోకాళ్లు, తొడలు, నడుము, ఉదరం, ఛాతీ, భుజాలు, చేతులు, మెడ, ముఖం... ఈ విధంగా కింద నుంచి పైకి మర్దన సాగాలి. మర్దన చేసేటప్పుడు శరీరంలోని ప్రతి అంగుళాన్నీ స్పృశించాలి. శరీరాన్ని రుద్ది, తాకి, మర్దించేటప్పుడు నాడులన్నీ ఉత్తేజితమవుతున్న అనుభూతికి లోనవ్వాలి. మర్దనతో శరీరానికి పట్టించిన నూనె చర్మంలోకి ఇంకి, నాడుల చివర్లకు చేరుతుంది. దాంతో వ్యాధుల నుంచి రక్షణ అందడంతో పాటు శరీరావయవాలకు శక్తి అందుతుంది.



దేశంలో పెనుమార్పు: రాహుల్

న్యూఢిల్లీ, రాయబరేలీ(యూపీ), మే 20: దేశంలో పెనుమార్పు సంభవిస్తోందని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు అండగా ఉన్నారన్నారు. అయిదో దశలో భాగంగా సోమవారం ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 49 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా రాహుల్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. మొదటి నాలుగు దశల్లో ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అండగా నిలిచారని స్పష్టమయిందని ఆయన తెలిపారు. దేశం విద్వేష రాజకీయాలు రాజకీయాలతో విసిగిపోయి ఉందని, ప్రస్తుతం ప్రజలు అసలైన సమస్యల గురించి ఆలోచించి ఓటు వేస్తున్నారని, బీజేపీతో పోరాడుతున్నారని అన్నారు. తాను పోటీ చేస్తున్న రాయబరేలీలోని పలు పోలింగ్ కేంద్రాలను రాహుల్ సందర్శించారు. రాయబరేలీలోని ఓ హనుమాన్ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు.

మెగసెసె నుంచి వైఎస్ వరకు





విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో పలువురు నేతల దుర్మరణం

- నటి సౌందర్య, భారత తొలి సీడీఎస్ బిపిన్ రావత్ వంటి ప్రముఖులూ

న్యూఢిల్లీ, మే 20: హెలికాప్టర్ కూలిపోయిన దుర్ఘటనల్లో వివిధ దేశాలకు చెందిన అధ్యక్షులు పలువురు గతంలో ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు ప్రజాదరణ పొందిన నాయకులూ మృతిచెందారు. ఫిలిప్పీన్స్ ఏడో అధ్యక్షుడిగా పనిచేస్తూ, అవినీతిపై ఉక్కుపాదం మోపిన రమోన్ మెగసెసే నుంచి ఉమ్మడి ఏపీకి సీఎంగా వ్యవహరించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటివారు ఉన్నారు. మెగసెసే 1957లో చనిపోయారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి ఇస్తున్న ప్రతిష్ఠాత్మక మెగసెసే అవార్డు 'రమోన్ మెగసెసే' స్మృత్యర్థం నెలకొల్పిందే. వైఎస్ 2009లో మృతిచెందారు. భారత్ విషయానికి వస్తే లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న ఏపీకి చెందిన నాయకుడు జీఎంసీ బాలయోగి 2002లో, ప్రముఖ నటి సౌందర్య 2004లో హెలికాప్టర్ ప్రమాదాల్లో అకాల మరణం పాలయ్యారు. భారత తొలి సీడీఎస్ బిపిన్ రావత్ 2021 డిసెంబరులో జరిగిన ఘటనలో చనిపోయారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ (1980), కాంగ్రెస్ అగ్రనేత మాధవరావు సింధియా (2001) విమానాలు కూలడంతో మృతిచెందారు. మాధవరావు కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా ప్రస్తుతం విమానయాన శాఖ మంత్రిగా ఉండడం గమనార్హం. మరోవైపు పాకిస్థాన్ అధ్యక్షుడు జనరల్ జియా ఉల్ హక్ (1988), స్వీడన్ ప్రధాని అర్విడ్ లిండ్‌మాన్ (1936), బ్రెజిల్ అధ్యక్షులు రామోస్ (1958), ఇరాక్ అధ్యక్షుడు అబ్దుల్ సలామ్ ఆరిఫ్ (1966)లు విమాన ప్రమాదాల్లో అర్ధంతరంగా తనువు చాలించారు. 2020లో ప్రఖ్యాత బాస్కెట్ బాల్ ఆటగాడు కోబ్ బ్రయాంట్ కుమార్తెతో సహా హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు.

ఇజ్రాయెల్‌పై నెటిజన్ల ట్రోల్

- ఇరాన్‌లో సంబరాలు జరుపుకొన్న ప్రజలు!

టెహ్రాన్/టెల్‌అవీవ్, మే 20: ఇబ్రహీం రైసీ మరణంపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. ఇది ఇజ్రాయెల్ పనేనా? అంటూ ఎక్కువ మంది ట్రోల్ చేశారు. రైసీ ఆదివారం ఉదయం డ్యామ్ ప్రారంభోత్సవం నిమిత్తం అజర్‌బైజాన్ దేశానికి వెళ్లారని, ఆ దేశానికి ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలున్నాయని నెటిజన్లు గుర్తుచేశారు. అజర్‌బైజాన్ సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడం ఇజ్రాయెల్ పనేనంటూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. హెలికాప్టర్ ప్రమాదానికి తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని వివరించింది. ఇదిలా ఉండగా, రైసీ హెలికాప్టర్ కూలిపోయిందని ఆదివారం సాయంత్రం వార్తలు రావడంతోనే.. టెహ్రాన్‌తోపాటు.. పలు నగరాల్లో ఇరానీయులు సంబురాలు జరుపుకొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కఠిన శిక్షలకు కేంద్ర బిందువుగా ఉన్న రైసీ మరణం తమకు సంతోషంగా ఉందని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. రెండేళ్ల క్రితం హిజాబ్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌లో జరిగిన ఆందోళనలను అణచివేయడంలో రైసీది కీలక భూమిక అని, ఆ సందర్భంలో ప్రభుత్వం చేతిలో 500 మందికి పైగా మరణించారని గుర్తుచేస్తున్నారు.

హెలికాప్టర్ ప్రమాదంలో..

ఇరాన్ అధ్యక్షుడి దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) రాత్రంతా అటవీ ప్రాంతంలో గాలించి, సోమవారం తెల్లవారుజామున 5.30 సమయంలో(ఇరాన్ కాలమానం ప్రకారం) రైసీ హెలికాప్టర్ కూలిపోయిన ప్రదేశానికి చేరుకున్నాయి. హెలికాప్టర్ కూలిపోగానే చెలరేగిన మంటల్లో రైసీ, ఇరాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ అబ్దుల్లాహియాన్(60), తూర్పు అజర్‌బైజాన్ గవర్నర్ మాలిక్ రహ్మతీ, తబ్రీజ్ ప్రావిన్స్ ఇమామ్ సహా.. మొత్తం ఎనిమిది మంది మృతిచెందినట్లు గుర్తించారు. ఉదయం 8 గంటల సమయంలో ఇరాన్ ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. హెలికాప్టర్ శకలాలు, మృతదేహాలను తరలిస్తున్న చిత్రాలను మీడియాకు అందజేసింది. టెహ్రాన్‌లో బుధవారం రైసీ అంత్యక్రియలు జరుగుతాయని వివరించింది. అత్యవసరంగా భేటీ అయిన ఇరాన్ క్యాబినెట్.. ఐదు రోజులపాటు సంతాపదినాలను ప్రకటించింది. కాగా.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి రైసీ నమ్మిన బంటు. ఖమేనీకి రైసీనే వారసుడని సుప్రీంలీడర్‌ను ఎన్నుకునే 88 మంది సభ్యులున్న 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ' సభ్యులంతా విశ్వసించేవారు. మరణించే వరకు రైసీ ఆ కమిటీకి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఇబ్రహీం రైసీ 1960 నవంబరులో మషాద్‌లో జన్మించారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపేవారు. అలా కోమ్ నగరంలో యువ మతగురువుగా ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. రైసీకి ఖమేనీతో కోమ్‌లోనే పరిచయం ఏర్పడింది. పాశ్చాత్య మద్దతు ఉన్న షా పాలనకు వ్యతిరేకంగా 1979లో జరిగిన విప్లవోద్యమంలో రైసీ పాల్గొన్నారు. కాగా, ప్రమాదంపై దర్యాప్తునకు ఖమేనీ ఆదేశాలు జారీ చేశారు. వైమానికదళం చీఫ్ అబ్దుల్లాహీకి దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు.

ప్రపంచ దేశాధినేతల దిగ్భ్రాంతి

రైసీ మృతిపట్ల ప్రపంచ దేశాధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైసీ మరణం ఇరానీయులు తీరని లోటని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. కాగా, రైసీ గౌరవార్థం న్యూఢిల్లీలోని ఇరాన్ ఎంబసీ సోమవారం రాయబార కార్యాలయంలోని ఇరాన్ జెండాను అవనతం చేసింది.

తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బేర్

రైసీ మరణంతో ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బేర్ నియమితులయ్యారు. ప్రస్తుతం మొఖ్బేర్ మొదటి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు మరణించినా.. రాజీనామా చేసినా.. ఉపాధ్యక్షుల్లో మొదటి స్థానంలో ఉన్నవారిని తాత్కాలిక అధ్యక్షుడిగా నియమిస్తారు. ఆ తర్వాత 50 రోజుల్లో అధ్యక్ష ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. రైసీతోపాటు హెలికాప్టర్‌లో మరణించిన విదేశాంగ మంత్రి ఆమిర్ అబ్దుల్లాహియాన్ స్థానంలో మహమ్మద్ అలీ బఘేరీని నియమిస్తూ ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, జూన్ 29న కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది.


ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం.

రైసీ అలియాస్ డెత్ కమిషన్!

యుద్ధ ఖైదీల పట్ల రైసీ అత్యంత క్రూరంగా వ్యవహరించేవారని, అందుకే ఆయనను 'డెత్ కమిషన్' అని పిలుస్తారని చెబుతుంటారు. 1988 ఇరాన్-ఇరాక్ యుద్ధ ఖైదీల విచారణకు రైసీ దేశవ్యాప్తంగా 'డెత్ కమిషన్'లను నియమించారు. యుద్ధ ఖైదీలపై విచారణ లేకుండానే మరణ శిక్షలను విధించడం 'డెత్ కమిషన్' లక్ష్యం.! ఇలా అప్పట్లో 5 వేల మందికి పైగా యుద్ధ ఖైదీలను దారుణంగా హతమార్చారనే అభియోగాలున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఈ దారుణాలపై రైసీని విచారించాలని పిలుపునిచ్చింది. ఇరాన్‌లో మరణ శిక్ష అంటే ఉరి ఒక్కటే కాదు..! రాళ్లతో కొట్టి చంపడం, కొండ శిఖరాల నుంచి కిందకు తోసేయడం వంటి శిక్షలు ఉంటాయి. యుద్ధ ఖైదీలే కాకుండా.. ప్రభుత్వ విధానాలను విమర్శించే వారినీ ఇలాగే చిత్ర హింసలు పెట్టి, చంపేవారని సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హాదీ ఘేమీ పేర్కొన్నారు. అలా క్రూరమైన శిక్షలతో రాజకీయ ప్రత్యర్థులను వణికించిన రైసీ దారుణాలు 2017 అధ్యక్ష ఎన్నికల సమయంలో వెలుగులోకి వచ్చాయి. ఆ ఎన్నికల్లో హసన్ రౌహాని చేతిలో రైసీ ఓడిపోయారు. డెత్ కమిషన్‌పై విచారణ జరిపించిన అమెరికా 2019లో రైసీపై ఆంక్షలను విధించింది. 2021 ఎన్నికల్లో రైసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

రైసీ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది

రైసీ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్-ఇరాన్ సంబంధాల బలోపేతానికి ఆయన చేసిన కృషి మరవలేనిది. ఆయన కుటుంబ సభ్యులకు, ఇరాన్ ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ విచార సమయంలో ఇరాన్‌కు అండగా ఉంటాం. రైసీ, అబ్దుల్లాహియాన్, ఇతర అధికారుల సంస్మరణార్థం భారత్‌లో ఒక రోజు సంతాప దినాన్ని ప్రకటిస్తున్నాను. - భారత ప్రధాని నరేంద్ర మోదీ

టెక్నాలజీలో ఇరాన్ వెనుకంజ

వెపన్ గ్రేడ్ యురేనియం తయారీలో ఇరాన్ ముందున్నా.. టెక్నాలజీలో వెనకంజలో ఉన్నట్లు తాజా హెలికాప్టర్ ప్రమాదం స్పష్టం చేస్తోంది. రైసీ ప్రయాణానికి వినియోగించిన హెలికాప్టర్ బెల్-212 కేటగిరీకి చెందినది. ఇది అమెరికా తయారీ. 1970లలో కొనుగోలు చేసిన హెలికాప్టర్. ఇదొక్కటే కాదు.. ఇరాన్ సైన్యం వాడుతున్న హెలికాప్టర్లు, యుద్ధ విమానాల్లో సింహభాగం కాలం చెల్లినవే..! ఇరాన్‌పై ఆంక్షల కారణంగా వీటి మరమ్మతులకు విడిభాగాలను కూడా దిగుమతి చేసుకోలేని స్థితిలో ఇరాన్ ఉంది. ప్రతికూల వాతావరణానికి.. దాదాపుగా కాలం చెల్లిన హెలికాప్టర్ తోడవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు.. కూలిన హెలికాప్టర్‌ను గాలించడంలో ఇరాన్ విఫలమైనట్లు స్పష్టమవుతోంది. హెలికాప్టర్ ఆదివారం మధ్యాహ్నం కూలిపోతే.. సోమవారం తెల్లవారుజాము వరకు దాని జాడను కనుక్కోలేకపోయారు. రాత్రిళ్లు అడవుల్లో గాలింపు చేపట్టే టెక్నాలజీకి కూడా ఇరాన్ నోచుకోలేదు. తుర్కియే, జోర్డాన్ వంటి దేశాలు ముందుకు రావడంతోనే.. రాత్రంతా గాలింపు సులభమైంది. హెలికాప్టర్ పైలట్ వాడిన సెల్‌ఫోన్ లోకేషన్‌ను గుర్తించడంలోనూ తుర్కియే సాంకేతిక సమాచారం అందించింది.

ఇరాన్ ప్రగతిలో రైసీ ముద్ర

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి



ఇబ్రహీం రైసీ హయాంలో ఇరాన్ బలీయమైన శక్తిగా ఎదిగింది. ఉద్రిక్తతలు, అశాంతికి నెలవైన మధ్య ప్రాచ్య దేశాల్లో.. ఆర్థిక ఆంక్షలు, అంతర్గత నిరసనల మధ్య కూడ ఇరాన్ ప్రగతిని సాధించడంలో రైసీ కీలకపాత్ర పోషించారు. రైసీ తన పదవీకాలంలో సంక్లిష్టమైన ఇజ్రాయెల్-పాలస్తీనా ఉద్రిక్తతను మరింత పెంచారు. ఇజ్రాయెల్ చరిత్రలో మొదటిసారిగా గత అక్టోబరులో హమాస్ జరిపిన క్షిపణి దాడులకు ఇరాన్ లోపాయికారీగా పూర్తి మద్దతు ఇచ్చింది. తదనంతరం గాజాపై ఇజ్రాయెల్ సృష్టించిన మారణకాండ వల్ల అరబ్ దేశాలు అయోమయ స్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ యుద్ధం ద్వారా అరబ్ దేశాలు ఇజ్రాయెల్ దగ్గరకు చేరకుండా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని విశ్లేషకుల అభిప్రాయం. గల్ఫ్‌కు పొరుగున ఉన్న కీలకమైన యెమెన్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించడంలో కూడా రైసీ విజయం సాధించారు. హూతీ సాయుధ షియా వర్గాల ద్వార ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్‌కు వెళ్లే నౌకలపై దాడులతో ప్రపంచం నివ్వెరపోయింది. ఇజ్రాయెల్ పొరుగున ఉన్న లెబనాన్, సిరియా దేశాల్లోని షియా వర్గాల సహాయంతో ఇజ్రాయెల్, అమెరికాలకు పెద్ద అవరోధంగా మారారు. ఇప్పటికే చైనాలో ఒకసారి ప్రధాని మోదీతో సమావేశమైన ఇబ్రహీం రైసీ త్వరలోనే భారత్‌లో పర్యటించాలని అనుకున్నారు. భారతీయులు ముందస్తు వీసా అవసరం లేకుండా 15 రోజుల పాటు ఇరాన్‌లో పర్యటించడానికి వెసులుబాటు కూడ ఇచ్చారు. నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న రైసీ అనూహ్యంగా చనిపోయారు. ఇరాన్‌లో అధ్యక్షుడి కంటే రహ్‌బర్(మార్గదర్శకుడు, సర్వాధికారాలు కలిగిన నేత) పదవి అత్యున్నతమైనది. ప్రస్తుతం ఈ పదవిలో కొనసాగుతున్న అలీ హుస్సేన్ ఖమేనీ(85) రైసీ వారసుడిగా పగ్గాలు చేపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు.

అదేం అధ్యయనం?

- కొవాక్సిన్ దుష్ప్రభావాలపై బీహెచ్‌యు స్టడీని తప్పుపట్టిన భారత వైద్య పరిశోధన మండలి

న్యూఢిల్లీ, మే 20: భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాక్సిన్ దుష్ప్రభావాలపై బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యు) అధ్యయనం సరైన పద్ధతిలో జరగలేదని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది. ఈ అధ్యయనం కోసం అనుసరించిన మెథడాలజీని తప్పుబట్టింది. వర్సిటీ తన నివేదికలో.. తప్పుదోవ పట్టించేలా తమ పేరును ఉటంకించిందని, వెంటనే అందులోంచి పేరును తొలగించాలని.. పేరును తప్పుగా ఉటంకించినట్టుగా పేర్కొంటూ సవరణ కూడా వేయాలని నివేదికను ప్రచురించిన డ్రగ్ సేఫ్టీ జర్నల్ సంపాదకుడు నితిన్ జోషికి ఐసీఎంఆర్ డీజీ రాజీవ్ భల్ లేఖ రాశారు. లేకపోతే న్యాయపరమైన, పాలనాపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. 1024 మందిని వ్యాక్సిన్ వేయించుకున్న ఏడాది తర్వాత ఫోన్ ద్వారా సంప్రదించిన బీహెచ్‌యూ... 12 నెలల వ్యవధిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు వచ్చాయా అని అడిగింది. వారు చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు తప్ప.. ఎలాంటి వైద్య రికార్డులనూ పరిశీలించి, ధ్రువీకరించుకోలేదు.

లోయలో ప్రాణాలు బోల్తా!

చర్ల, మే 20: రోజు కూలీకి వెళ్తే తప్ప మర్నాడు ఇంట్లోవాళ్లకు ఐదువేళ్లు నోట్లోకి వెళ్లలేని పరిస్థితి ఆ గిరిజన కుటుంబాలది! పొద్దున్నే అడవుల్లోకి వెళ్లి చెట్టూ పుట్టా తిరిగి తునికాకు (బీడీలు చుట్టే ఆకు) సేకరిస్తారు. సోమవారం కూడా ఉదయమే ఇళ్లలోని పిల్లలు, వృద్ధుల కోసం వంట చేసి.. పని కోసం మినీ ట్రక్కులో బయలుదేరారు. అయితే వీరిలో ఏ ఒక్కరూ మళ్లీ ఇల్లు చేరలేదు. ఓ మాయదారి లోయ కొందరి ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా వి ంగేసిందిరోడ్డు మీద వేగంగా వెళుతూ అదుపు తప్పిన ట్రక్కు 20 అడుగుల లోయలోకి బోల్తా కొట్టింది. 19 మంది దుర్మరణంపాలయ్యారు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో ఈ ఘోరం జరిగింది. డ్రైవర్ మినహా మృతులు, క్షతగాత్రులంతా మహిళలే. పైగా ఒకే ఊరివారు. మృతుల్లో కొందరు ఒకే కుటుంబానికి చెందినవారు. కబీర్‌ధామ్ జిల్లా సెమ్హరాలోని బైగా తెగకు చెందిన 25 మంది మహిళలు సోమవారం ఉదయం ఓ పికప్ వాహనంలో తునికాకు సేకరణకు బయలుదేరారు. సేకరించడం పూర్తయ్యాక అదే వాహనంలో ఊరికి తిరుగుముఖం పట్టారు. వాహనం కుక్‌దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలోకి పడిపోయింది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

దక్షిణాదీ మాదే

అక్కడ అన్ని పార్టీల కంటే ఎక్కువ సీట్లు బీజేపీకే

- దేశవ్యాప్తంగా ఎన్డీయేకు 400 సీట్లు
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ



భువనేశ్వర్, మే 20: దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని పార్టీల కన్నా బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాది భారీ విజయాలతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిపి 400 సీట్లు దాటుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. "మరోసారి మోదీ సర్కారు... నాలుగో తారీఖున 400 సీట్లు" నినాదంతో దేశవ్యాప్త ప్రచారం చేసినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి ఆయన పీటీఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి బలం లేదన్న ప్రచారాన్ని ఈసారి ఎన్నికల్లో పటాపంచలు చేస్తామన్నారు. తమ మిత్రపక్షాలు కూడా దక్షిణాదిలో పెద్ద ఎత్తున సీట్లు గెలవబోతున్నాయని చెప్పారు. ఓట్లశాతం భారీగా పెరగనుందని ప్రకటించారు. దక్షిణాదిలో 131 సీట్లుంటే గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 29 సీట్లు గెలిచి, దక్షిణాదిలో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఒడిసా, బెంగాల్లో కూడా బీజేపీకి పెరుగుతున్న మద్దతు చూసి ఇతర పార్టీలకు, మీడియా సంస్థలకు రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రెడ్ కారిడార్‌గా పేరొందిన ప్రాంతం కాషాయ కారిడార్‌గా మారిపోనుందని ప్రకటించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి గత నాలుగు దశల ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో ఖాతా తెరవని పరిస్థితి నెలకొందని చెప్పారు. తాము ఏ రాష్ట్రానికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటామని అన్నారు. బీజేపీ అంటే ఉత్తరాది పార్టీయని, బనియా-బ్రాహ్మిణ్ పార్టీ అని పథకం ప్రకారం చేసిన దుష్ప్రచారాన్ని ఈ ఎన్నికలతో పటాపంచలు చేస్తామని మోదీ ప్రకటించారు. మూడోసారి అధికారానికి రాగానే ఉమ్మడి పౌర స్మృతి, జమిలి ఎన్నికలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే 100 రోజుల్లో అమలు చేయాల్సిన అంశాలను ఇంతకుముందే సిద్ధం చేశామని, వాటిని 125 రోజుల్లో అమలు చేస్తామని ప్రధాని ప్రకటించారు. తాను మైనారిటీలకు వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడలేదని, బీజేపీ ఎప్పుడూ మైనారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మోదీ చెప్పారు. ఎవరినీ ప్రత్యేక పౌరులుగా గుర్తించడానికి తాను సిద్ధంగా లేనన్నారు. కాంగ్రెస్ మైనారిటీల ఓట్ల కోసం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని, దాన్ని మాత్రమే తాను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చిన పార్టీ బీజేపీయేనని మోదీ ప్రస్తావించారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను మొత్తం రిజర్వేషన్లను ముడి పెట్టి మాట్లాడటం సరికాదని ప్రధాని అన్నారు. ఈసారి కాంగ్రెస్ కార్యకర్తలే ఆ పార్టీకి ఓటేయడానికి బయటకు రాలేదని, అందుకే పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని వ్యాఖ్యానించారు. టెంపో నిండా డబ్బు పంపితే అదానీ-అంబానీలకు వ్యతిరేకంగా మాట్లాడనని స్వయంగా కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ అన్నారని మోదీ ప్రస్తావించారు.

ఐదో దశలో 60.09%

న్యూఢిల్లీ, మే 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఐదో దశలో దేశవ్యాప్తంగా 60.09% పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి 11.30 గంటల వరకు అందిన సమాచారాన్ని బట్టి ఈమేరకు పోలింగ్ శాతం నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గంలో గత 35 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 54.49 శాతం పోలింగ్ బారాముల్లాలో నమోదైనట్లు ఈసీ తెలిపింది. ఐదో దశలో భాగంగా సోమవారం 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 పార్లమెంటు స్థానాలలో ఎన్నికలు జరిగాయి. ఐదో దశ పూర్తికావడంతో ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 428 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఒడిశాలోని 63 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ముగిశాయి. కాగా, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ సోదరుడు బాబు బెనర్జీ ఓటరు జాబితాలో పేరు లేక ఓటు వేయలేకపోయారు.

428లో ఎన్ని సాధిస్తాం?

- ఎన్నికల్లో పార్టీ సాధించే సీట్లపై బీజేపీ పెద్దల సమీక్ష
- చివరి 2 దశల్లో 90 సీట్ల సాధనే లక్ష్యంగా ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 20(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇప్పటి వరకూ అయిదు దశల్లో పోలింగ్ ముగిసిన 428 స్థానాల్లో.. ఎన్ని సీట్లను సాధించగలదనే అంశంపై బీజేపీ నేతలు సోమవారం చర్చలు జరిపారు. ఢిల్లీలోని బీజేపీ జాతీయ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకూ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలవారీగా బీజేపీ సాధించబోయే ఫలితాలను వారు అంచనా వేసినట్లు తెలిసింది. మిగిలిన 114 స్థానాల్లో 90కి పైగా సీట్లు గెలిచేందుకు పకడ్బందీగా వ్యూహరచన చేయాలని వారు నిర్ణయించారు. ప్రస్తుతం లోక్ సభలో ఎన్డీఏ సంఖ్యాబలం 342. బీజేపీ చెబుతున్నట్లుగా 400 సీట్లు సాధించాలంటే.. మరో 58 సీట్లు కావాలి. ఇందుకు పశ్చిమబెంగాల్, ఒడిశాలోని 63 సీట్లలో బీజేపీ 90% సీట్లు సాధించాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో ఒడిశాలో బీజేపీ 21 సీట్లలో 8 సీట్లు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈసారి మహా అయితే మరో నాలుగు సీట్లు అదనంగా గెలుచుకుంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇక పశ్చిమ బెంగాల్‌లోని 42 సీట్లలో.. 2019లో 18 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈ సారి రెట్టింపుస్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్డీఏ గతంలో భారీ విజయాలు సాధించిన బిహార్, మహారాష్ట్రలో ఈసారి వ్యతిరేక పవనాలు ఎదుర్కొంటోందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. 2019 ఎన్నికల్లో మహారాష్ట్రలో శివసేనతో కలిసి బీజేపీ పోటీ చేయడంతో 48 స్థానాలకు గాను 41 సీట్లు గెలుచుకోలిగింది. ఈసారి శివసేన దూరం కావడంతో బీజేపీకి 20 సీట్లు కూడా కష్టమేనని అంచనాలు వినపడుతున్నాయి. ఇక బిహార్‌లో మొత్తం 40 స్థానాల్లో గతంలో ఎన్డీయే కూటమి 39 స్థానాలు గెలుచుకుంది. ఈసారి కూడా జేడీ(యు), లోక్ జనశక్తితో కలిసి బీజేపీ పోటీ చేస్తున్నప్పటికీ నితీశ్ ప్రభ తగ్గడం, తేజస్వీ బలం పెరగడంతో ఇక్కడ కూడా ఎన్డీయేకి సగం సీట్లు దక్కడమే గగనం అంటున్నారు. అంటే ఒక్క బిహార్, మహారాష్ట్రలోనే ఎన్డీఏ దాదాపు 40 సీట్లు కోల్పోతుందని ఇండియా కూటమి వర్గాలు అంటున్నాయి. ఇక ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో ఎన్డీయే చెప్పుకోదగ్గ సంఖ్యలో సీట్లు కోల్పోతుందని అంచనా. ఈ నేపథ్యంలో మిగిలిన 114 స్థానాల్లో బీజేపీ మరిన్ని ఎక్కువ సీట్లు సాధించేందుకు ప్రయత్నిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇక దక్షిణాదిన కర్ణాటకలో అయిదారు సీట్లు కోల్పోయినా.. ఏపీ, తెలంగాణలో ఈ నష్టాన్ని పూడ్చుకుంటామని బీజేపీ నేతలు ఈ సమావేశంలో ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెలంగాణలో 8-10 సీట్లు దక్కే అవకాశాలున్నాయని తరుణ్ చుగ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.


ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్న యువకులు

మత్తు మజా.. మస్త్ మజా..!

- హైదరాబాద్ వ్యాపారి బర్త్ డే సందర్భంగా బెంగళూరులోని ఫాం హౌస్‌లో రేవ్ పార్టీ..
- పార్టీలో ఏపీ రాజకీయ, సినీ ప్రముఖులు

బెంగళూరు, హైదరాబాద్ సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో మత్తులో ఊగుతూ మస్త్‌గా ఎంజాయ్ చేస్తూ.. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పట్టుబడ్డారు. హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారి బర్త్‌డే సందర్భంగా బెంగళూరులోని ఫాంహౌస్‌లో ఈ రేవ్ పార్టీ నిర్వహించారు. పార్టీలో భారీగా డ్రగ్స్ వినియోగిస్తున్నారనే సమాచారం మేరకు బెంగళూరు సీసీబీ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఈ దాడిలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలతోపాటు.. టాలీవుడ్, సీరియల్ నటులు, మోడల్స్ మాదక ద్రవ్యాలు వినియోగిస్తూ అడ్డంగా దొరికిపోయారు. ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ వ్యాపారి.. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని జీఆర్ ఫాంహౌస్‌లో బర్త్ డే పార్టీ పేరుతో రహస్యంగా రేవ్ పార్టీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన పార్టీ రాత్రి 12 గంటలకు ముగియాల్సి ఉన్నా.. ఆ తర్వాత కూడా డీజేలతో హోరెత్తించడంతో స్థానికులు హెబ్బగూడి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో బెంగళూరు సీసీబీ (సిటీ క్రైమ్ బ్రాంచి) పోలీసులు ఈ ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీలో పాల్గొన్న సుమారు 100మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో 75 శాతం మందికిపైగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాసులని వారిలో రాజకీయ, సినీ ప్రముఖులు ఉన్నారని సమాచారం. కన్నడ సీరియల్ నటులతోపాటు 20 మందికిపైగా మోడల్స్ పార్టీలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో 17 గ్రాముల ఎండీఎంఏ, కొకైన్‌తోపాటు 15 ఖరీదైన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధనరెడ్డి పేరుతో పాస్ ఉన్న కారు సైతం లభ్యమైందని తెలిసింది. ఐతే.. ఈ ఆరోపణలను కాకాణి ఖండించారు. ఆ కారుతో తనకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ పార్టీలో పాల్గొన్న 30 మంది యువతులు, 70 మంది యువకులు ఏపీ, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చినట్టు తెలుస్తోంది. ఈవెంట్ కోసం ఫాంహౌస్ నిర్వాహకులకు రూ.30 నుంచి రూ.50 లక్షలు చెల్లించినట్టు సమాచారం. రేవ్ పార్టీలో పాల్గొన్న వారిలో సినీ, రాజకీయ ప్రముఖులు ఎంతమంది ఉన్నారు..? ఎవరెవరు డ్రగ్స్ తీసుకున్నారు..? అనేది తెలియరాలేదు. అందుకోసం మెడికల్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

పార్టీలో లేనన్న హేమ... ఉందన్న పోలీసులు?

పార్టీలో పాల్గొన్న వారిలో టాలీవుడ్ సినీ నటులు, టీవీ నటులు, మోడల్స్ ఉన్నట్లు తేలడంతో పాటు.. ప్రముఖ తెలుగు నటి హేమ కూడా ఉన్నారని మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. దీంతో హేమ.. తాను రేవ్ పార్టీలో పాల్గొనలేదని, హైదరాబాద్‌లోనే చిల్ అవుతున్నానని ఓ వీడియో రిలీజ్ చేశారు. అయితే సాయంత్రానికి నటి హేమ తమ అధీనంలోనే ఉందని బెంగళూరు పోలీసులు వెల్లడించినట్టు వార్తలు వచ్చాయి. హేమ రిలీజ్ చేసిన వీడియో నిజం కాదని, అందరినీ తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినట్టు పోలీసులు తెలిపినట్టు సమాచారం.

పార్టీలకు వెళ్లే అలవాటు లేదు: శ్రీకాంత్

రేవ్‌పార్టీలో పట్టుబడిన వారిలో ప్రముఖ తెలుగు సినీనటుడు శ్రీకాంత్ కూడా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దాంతో వెంటనే స్పందించిన శ్రీకాంత్.. హైదరాబాద్‌లోని తన ఇంటి వద్ద నుంచి ఒక వీడియో విడుదల చేశారు. నాకు పార్టీలకు, పబ్‌లకు వెళ్లే అలవాటులేదని పేర్కొన్నారు. ఎక్కడైనా బర్త్‌డే పార్టీలకు వెళ్లినా కొద్దిసేపు ఉండి వెంటనే వచ్చేస్తానన్నారు. బెంగళూరులో పట్టుబడ్డ వారిలో ఒక వ్యక్తి నాలాగే కనిపించడంతో మీడియా మిత్రులు పొరపడి ఉంటారన్నారు.

లోకం తీరు



అమెరికాలో జడ్జిగా విజయవాడ మహిళ

- శాక్రమెంటో కౌంటీ సుపీరియర్ జడ్జిగా జయ బాడిగ
- ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళగా రికార్డు
- బందరు మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ కుమార్తె


జయ బాడిగ

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో విజయవాడ మహిళకు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ, ప్రేమలత దంపతుల కుమార్తె.. జయ బాడిగ కాలిఫోర్నియాలోని శాక్రమెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా నియమితులయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. 2022 నుంచి ఇదే కోర్టులో జయ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. జయ తండ్రి బాడిగ రామకృష్ణ 2004-09 వరకు మచిలీపట్నం ఎంపీగా చేశారు. రామకృష్ణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జయ మూడో కుమార్తె. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే సాగింది. ఉస్మానియా యూనివర్సిటీలో సైకాలజీ, పొలిటికల్ సైన్స్‌లో బీఏ పూర్తిచేసిన అనంతరం అమెరికా వెళ్లిన ఆమె బోస్టన్ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. శాంటాక్లారా విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా (జూరిస్ డాక్టర్ డిగ్రీ) పొందారు. ఆ తర్వాత 2009లో కాలిఫోర్నియా స్టేట్ బార్ ఎగ్జామ్‌ను క్లియర్ చేశారు. 10 ఏళ్లకుపైగా న్యాయవాద వృత్తిలో ప్రైవేట్ ప్రాక్టీస్ కొనసాగించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రయిల్ అడ్వకసీలో ఫ్యాకల్టీ మెంబర్‌గా ఉన్నారు. మెక్‌జార్జ్ స్కూల్ ఆఫ్ లాలో అధ్యాపకురాలిగా ఉన్నారు. జయతోపాటు మరో భారత సంతతి న్యాయమూర్తి రాజ్ సింగ్ బధేషా సహా 18 మందిని న్యాయమూర్తులుగా నియమిస్తూ గవర్నర్ న్యూసోమ్ ప్రకటన చేశారు.

నిందితులను వదిలి మీడియాపై కేసులా..!

- తప్పుదారి పట్టించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల కమిషన్‌కు అచ్చెన్నాయుడు లేఖ

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల అనంతరం జరిగిన హింసలో పోలీసుల పాత్రను వెల్లడి చేసిన మీడియాపై విశాఖలో పోలీసులు కేసులు నమోదు చేసి భయపెడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. విశాఖ కంచరపాలెంలో తమకు ఓటు వేయలేదన్న కారణంతో ఓ కుటుంబంపై వైసీపీ నేతల దాడి చేసిన ఘటనను లేఖలో పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఘటనకు సంబంధించిన వార్తలను ప్రసారం చేసిన మీడియా సంస్థలపై కేసులు పెట్టడాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. మీడియాపై కేసులు ఎత్తేసి, కేసును తప్పుదారి పట్టించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖలో బాధితుల గళం వినిపించిన ఈనాడు, ఆంధ్రజ్యోతి జర్నలిస్టులతో పాటు బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు పైనా కేసులు నమోదు చేశారన్నారు. ఇదే అంశంపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు శాఖలో జే బ్రాండ్‌గా ముద్ర వేయించుకొన్న కొందరు అధికారుల అరాచకం పరాకాష్ఠకు చేరిన తీరుకు మీడియాపై కేసుల నమోదు ఒక నిదర్శనంగా నిలిచిందని మండిపడ్డారు.

మీడియాపై కేసులు అప్రజాస్వామికం: నాదెండ్ల మనోహర్

బాధితులెవరైనా, బాధించేది ఎవరైనా దాన్ని నిర్భయంగా ప్రజలకి తెలియచేయడం మీడియా బాధ్యతని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మీడియాపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 'బాధితులు చేసిన ఆరోపణలు మీడియాలో ప్రసారం చేయడాన్ని నేరంగా పరిగణించడం అప్రజాస్వామికమం. మీడియా నియంత్రణకు జీవో నంబర్ 1 తీసుకువచ్చారు. బాధితులతో కలసి ప్రెస్‌మీట్ నిర్వహించినందుకు విశాఖ నార్త్ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుపైనా కేసు నమోదు చేయడం చూస్తే ఈ కేసులు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని అర్థమవుతుంది' అని మనోహర్ అన్నారు.

అరాచకాలు సృష్టించింది వైసీపీయే

- వాటిని టీడీపీపై రుద్దే ప్రయత్నం.. దుష్ప్రచారంపై ఈసీకి ఫిర్యాదు
- పరువు నష్టం దావా వేస్తాం: టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో అరాచకాలను సృష్టించిన వైసీపీ నేతలు దాన్ని టీడీపీ నేతలపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. కులం రంగుపులిమి, అధికారులతో లేని సంబంధాలను అంటగట్టి మేం లబ్ధి పొందినట్లు వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని నరసారావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు మండిపడ్డారు. సోమవారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'అధికారులను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందామని వైసీపీ, వైసీపీ బ్లూ మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారంపై సిట్ విచారణ జరిపి నిజాలను బయట పెట్టాలి. కాల్‌డేటా బయటకు తీసి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. అవాస్తవాలను ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. తప్పుడు ప్రచారంపై ఈసీ, సిట్ చీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం. పరువు నష్టం దావాకు చర్యలు తీసుకుంటాం. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మా కుటుంబానికి పరిచయం ఉన్నట్లు, టీడీపీ చెప్పినట్లు పోలీసులు వినడంతోనే పల్నాడులో హింస జరిగిందని జగన్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. నావైపు తప్పుంటే నాపేరును కూడా చార్జ్‌షీట్‌లో చేర్చాలి. ప్రలోభాలకు గురిచేశామని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారంపై నిజాలు బయటపెట్టాలి' అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటన చేస్తూ... 'తప్పు చేయడం, ఆ తప్పును ఎదుటివారిపై నెట్టడం వైసీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. పోలింగ్ రోజు ఓటర్లు, టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి, సిగ్గు లేకుండా టీడీపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అధికారులను మార్చిన చోటే అల్లర్లు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తోంది. ఓటమి భయంతో పల్నాడును వల్లకాడు చేశారు' అని ధూళిపాళ్ల మండిపడ్డారు.

జగన్ మీడియాలో విష ప్రచారం: సీఈవోకు ఫిర్యాదు

పల్నాడులో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై జగన్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. సోమవారం టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారు నాయక్‌తో కలసి ఆయన అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలసి ఫిర్యాదు చేశారు.

సీఎస్ జవహర్‌రెడ్డే అల్లర్లన్నింటికీ బాధ్యుడు: దేవినేని ఉమ

సీఈవోను కలిసిన తరువాత దేవినేని ఉమామహేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 'పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఎన్నో అవాంతరాలు జరిగాయి. ఎంత మంది ఫారం-12ను దరఖాస్తు చేసుకున్నారు, ఎంత మంది ఓటు హక్కును వినియోగించుకున్నారో వివరాలు ఇవ్వాలని సీఈవోను కోరాం. అరాచకాలను అదుపు చేయాలని, మీడియాపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని సీఈఓను కోరాం' అని ఉమా తెలిపారు. పల్నాడులో జవహర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రామకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి పర్యవేక్షణలోనే పోలింగ్ రోజు బందోబస్తు పెట్టారని, కాబట్టి ఈ అల్లర్లన్నింటికీ సీఎస్ జవహర్‌రెడ్డే బాధ్యుడని ఉమా విమర్శించారు.

విజయనగరంలో సీఎస్ పర్యటన

- గుట్టుగా వచ్చి.. వెళ్లిన జవహర్‌రెడ్డి

విజయనగరం, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్ రెడ్డి సోమవారం విజయనగరం జిల్లాలో పర్యటించారు. భోగాపురం మండలంలో జరుగుతున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ పనులను ఆయన పరిశీలించారు. ఈ విషయమై అధికారులకు ముందుగానే సమాచారం ఉన్నా కనీసం బయటకు పొక్కనీయలేదు. జిల్లాకు ఏ అధికారి వచ్చినా జిల్లా పౌర సంబంధాల అధికారులు మెయిల్, వాట్సాప్ గ్రూపులో వివరాలు తెలియజేస్తుంటారు. కానీ సీఎస్ జిల్లాకు వస్తున్న విషయాన్ని మాత్రం అత్యంత రహస్యంగా ఉంచారు. ఆయన వెళ్లిన తర్వాత మాత్రమే మీడియాకు వివరాలు చెప్పారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులను సీఎస్ పరిశీలించారు. నిర్దిష్ట సమయానికి పనులు పూర్తి చేయాలని నిర్మాణ కంపెనీని ఆదేశించారు.

ఆరోగ్యశ్రీకి.. బకాయిల అనారోగ్యం!

- నెలకు రూ.300 కోట్ల చొప్పున రూ.1300 కోట్లకుపైగా పెండింగ్
- బిల్లుల విడుదలకు సర్కారు ససేమిరా
- ఇతరత్రా పథకాలకే తొలి ప్రాధాన్యం
- రోగుల పట్ల మితిమీరిన నిర్లక్ష్యం
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో తీవ్ర ఇక్కట్లు
- ప్రభుత్వ ఆసుపత్రులకు 230 కోట్లు బకాయి పడ్డ ఆరోగ్య శ్రీ ట్రస్ట్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అనారోగ్య శ్రీగా మార్చుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత నాలుగు మాసాలుగా ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పథకం కుంటుపడి.. రోగులకు ప్రాణసంకటంగా మారింది. తమ బకాయిలు చెల్లించాలంటూ ఆస్పత్రులు అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేకపోవడం గమనార్హం. నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తమకు రావాల్సిన రూ.1300 కోట్ల బిల్లుల కోసం జనవరి నుంచి పోరాటం చేస్తూనే ఉన్నాయి. డాక్టర్లకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామని చెప్పినా వైసీపీ సర్కార్ స్పందించలేదు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఆస్పత్రుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. బకాయిలు భారీగా పేరుకుపోయాయి.. మరోవైపు రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రులు ఎన్నికల కోడ్ వచ్చినా సమ్మె నోటీసులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ బకాయిలు క్లియర్ కాలేదు. మార్చి 16కి ముందు ఎలాంటి కోడ్ లేదు. కాబట్టి బకాయిల విషయంలో ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తే అప్పుడే ఆస్పత్రులు తీసుకునే పరిస్థితి ఉండేది. కానీ, మార్చి 16 తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇప్పుడు ఏ నెలకు ఆ నెల నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు విడుదల కావాలి. కానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓట్ల కోసం ప్రభుత్వ పథకాలకు ఇచ్చే ప్రాధాన్యత ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపునకు ఇవ్వడం లేదని యాజమాన్యాలు విమర్శిస్తున్నాయి. దీంతో కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగులను చేర్చుకునేందుకు ససేమిరా అంటున్నాయి. ఆరోగ్యశ్రీ రోగులు చేసేది లేక డబ్బులు చెల్లించి చికిత్సలు చేయించుకుంటున్నారు. కొన్ని ఆస్పత్రులు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద రోగులకు సేవలందిస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రులకూ..

ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా సర్కారు బకాయి పడింది. రాష్ట్రంలోని 11 బోధనాసుపత్రులకు, జిల్లా, ఏరియా ఆస్పత్రులకు కలిసి రూ.230 కోట్లు బకాయి పడింది. ప్రభుత్వ ఆసుపత్రులకు సర్కారే బకాయి పడడం ఏమిటనే సందేహం తలెత్తుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించే 80 శాతం శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ కిందే నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద ప్రయివేటు ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసినా బిల్లులు ఇవ్వాల్సిందే. ఆ నిధులను ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కోసం వినియోగిస్తారు. ఇలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించిన శస్త్ర చికిత్సలకు కూడా నిధులు విడుదల చేయడం లేదు. మొత్తంగా రూ.230 కోట్లు బకాయిలు పడింది. దీనిలో రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఒక్కొక్క ఆసుపత్రికి రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు రావాల్సి ఉంది. ఈ నిధుల కోసం ఆస్పత్రుల సూపరింటెండెంట్లు ఎదురు చూస్తున్నారు. ప్రయివేటు నెట్‌వర్క్ ఆస్పత్రులకే బిల్లులు చెల్లించని ప్రభుత్వం ఇక సర్కారు దవాఖానాలకు ఏమి ఇస్తుందని కొంత మంది ఆ నిధుల ఊసే ఎత్తడం లేదు.

ఆరోగ్యశ్రీ పథకం కింద సర్కారు చెల్లించాల్సిన బకాయిలు రోజు రోజుకు పేరుకుపోతున్నాయి. ఒక్క నెల బిల్లులు చెల్లించకపోయినా దాదాపు రూ.300 కోట్లు పెండింగ్ పడుతున్నాయి. ఇప్పటికే దాదాపు నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.1300 కోట్లు బకాయిలు పడింది. ఈ నెలాఖరుకు ఈ మొత్తం మరింత పెరిగిపోనుంది. బిల్లులు పేరుకుపోవడం, సర్కారు రూపాయి కూడా ఇవ్వకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వహణ అత్యంత కష్టంగా మారింది.

22 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం

- మరోసారి ట్రస్ట్‌కు నెట్‌వర్క్ ఆస్పత్రుల లేఖ

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): బకాయిలు విడుదల చేయాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు మరోసారి ట్రస్ట్‌కు సమ్మె నోటీసులు ఇచ్చాయి. లేదంటే ఈ నెల 22వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ సేవలు నిలిపివేస్తున్నట్లు సోమవారం ట్రస్టు సీఈవోకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులు బకాయిల విడుదల కోసం ఇప్పటికే పలు మార్లు నోటీసులు ఇచ్చి, వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. తొలుత ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషాకు ఈ నెల 2వ తేదీన సమ్మె నోటీసును అందించాయి. ఆ సమయంలో బకాయిలు విడుదల చేస్తామని ట్రస్ట్ చెప్పినా, కేవలం ఈహెచ్‌ఎస్ బకాయిలు రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేశారని లేఖలో పేర్కొన్నాయి. 2023 ఆగస్టు నుంచి ఆరోగ్యశ్రీ బకాయిలు దాదాపు రూ.1500 కోట్లు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని, లేదంటే సేవలు నిలిపివేడయం అనివార్యమని స్పష్టం చేశాయి. ఈ లేఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల ప్రధానాధికారి, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కూడా పంపించాయి.

మాటలు.. కోటలు!

జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కోటలు దాటేలా మాటలు చెబుతోంది. కానీ, చేతల్లోకి వచ్చే సరికి మాత్రం ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా చోద్యం చూస్తూ.. ఆరోగ్యశ్రీ పథకాన్ని గాలికి వదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1300 కోట్లు బకాయిలంటే సాధారణ విషయం కాదు. దాదాపు ఆరేడు నెలల నుంచి ప్రభుత్వం ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడం లేదని స్పష్టం అవుతోంది. ఈ స్థాయిలో బకాయిలు పెట్టుకుని ఆరోగ్యశ్రీకి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పడంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు బకాయిలు రూ.వేల కోట్లు ఉంటే ప్రభుత్వం మాత్రం నచ్చినప్పుడు, లేదా నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆందోళన చేసినప్పుడు రూ.100 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొంటోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలకు.. ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు పొంతన లేకుండా పోయింది. ఏప్రిల్ నెలాఖరులో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిల కింద రూ.103 కోట్లు విడుదల చేసింది. అప్పటికి ఉన్న బకాయిలు దాదాపు రూ.1400 కోట్లు. రూ.103 కోట్లు విడుదల చేసినా మరో రూ.1300 కోట్లు బకాయిలున్నాయి. ఈ నెలాఖరుకు మరో రూ.300 కోట్లు పెండింగ్ బిల్లులు పెరుగుతాయి. కాగా, ఏప్రిల్ నెలాఖరున ఇచ్చిన రూ.103 కోట్లు కూడా కేంద్రం ఆయుష్మాన్ భారత్ కింద రూ.70 కోట్లు విడుదల చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు కలిపి రూ.103 కోట్లు జమ చేసింది.

తిరుమలలో మళ్లీ చిరుతల కలకలం

- దివ్యారామం వద్ద కనిపించినట్లు భక్తుల ఫిర్యాదు
- అప్రమత్తమైన అటవీ, విజిలెన్స్ అధికారులు

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు నడిచి వెళ్లే అలిపిరి మార్గంలో మరోసారి చిరుతల సంచారంతో కలకలం రేగింది. అలిపిరి మెట్లు ముగిసే దివ్యారామం వద్ద రెండు చిరుతలను చూశామంటూ కొంతమంది భక్తులు చెప్పడంతో ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అలిపిరి మెట్లు ముగిసే జీఎన్సీకి సమీపంలో రెండు చిరుతలు కనిపించడంతో సమీపంలో కాలినడకన వెళ్తున్న భక్తులు పెద్దగా కేకలు వేశారు. వెంటనే సమీపంలోని విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే భక్తుల కేకలతో చిరుతలు అడవిలోకి వెళ్లిపోయాయి. వెంటనే ఫారెస్ట్ అధికారులు కాలినడక భక్తులను అప్రమత్తం చేసి, గుంపులుగా అనుమతిస్తున్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా వదలవద్దని మైకుల ద్వారా ప్రచారం చేశారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు వివిధ విభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. నిరంతరం కాలినడక మార్గంలో నిఘా ఉంచాలని ఆదేశించారు.


జస్టిస్ జ్యోతిర్మయి, కుటుంబసభ్యులకు కనకదుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న దేవస్థానం ఈఈ రమాదేవి

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ జ్యోతిర్మయి

విజయవాడ(వన్‌టౌన్), మే 20: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం న్యాయమూర్తికి ఈవో రమాదేవి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను అందజేశారు.

తిరుమలలో సిఫారసు లేఖల స్వీకరణ

- అనుమతి ఇచ్చిన ఈసీ

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి సోమవారం నుంచి టీటీడీ తిరిగి సిఫారసు లేఖలు తీసుకుంటోంది. గత నెల 16నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ ప్రముఖుల నుంచి బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలను కల్పిస్తోంది. ఈనెల 13న ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాటు రద్దీ పెరుగుతున్న క్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఈ నెల 15న ఈసీకి లేఖ రాశారు. భక్తుల రద్దీ పెరిగిన క్రమంలో సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలనే డిమాండ్ ఉందని, అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. టీటీడీ అభ్యర్థనను పరిశీలించిన కేంద్ర ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించింది.

టీటీడీని ప్రక్షాళన చేయాలి: కంభంపాటి



టీటీడీని ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని టీడీపీ నేత కంభంపాటి రామ్మోహన్ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు తిరుమలలో అనేక మార్పులను ప్రజలు చూస్తారన్నారు. తమ ప్రభుత్వం రావాలనే పేదలంతా కోరుకుంటున్న క్రమంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. చంద్రబాబు సీఎంగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసేముందు స్వామి కృప ఉండాలని ప్రార్థించానన్నారు.

విజయవాడ విమానాశ్రయంలో అంతర్జాతీయ కార్గో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి: ఏపీ చాంబర్స్

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ విమానాశ్రయంలో అంతర్జాతీయ కార్గో కేంద్రాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఆసన్నమైందని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు అన్నారు. తమ విజ్ఞప్తి మేరకు విజయవాడ నుంచి ముంబయికి ఎయిరిండియా డైలీ ఫ్లైట్ నడపటానికి షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడ రీజియన్ నుంచి అంతర్జాతీయంగా సరకు రవాణాకు ఎంతో డిమాండ్ ఉందని ఆయన అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా పండ్లు, కూరగాయలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులు వంటివి పెద్ద సంఖ్యలో ఉత్పత్తి అవుతుంటాయని తెలిపారు. అంతర్జాతీయ కార్గో ఫెసిలిటీ కేంద్రంలోనే అంతర్భాగంగా కోల్డ్ స్టోరేజ్‌ను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాల కోసం వెళ్లి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి..

- దేశాన్ని పట్టిపీడిస్తున్న బ్యాంకింగ్ సైబర్ నేరాల్లో తెలుగు యువకుల పాత్ర
- బట్టబయలవుతున్న కంబోడియా బాగోతాలు
- దుబాయి మీదుగా మానవ అక్రమ రవాణా, మోసాలు
- గాజువాకకు చెందిన ఏజెంట్ అరెస్టుతో బయటకు వస్తున్న బాధితులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


కంబోడియాకు వెళ్లడానికి నిరాకరించి దుబాయిలో నరకయాతన అనుభవించిన తెలుగు యువకులు(ఫైల్)

దేశాన్ని పట్టిపీడిస్తున్న బ్యాంకింగ్ సైబర్ నేరాల్లో తెలుగు యువకుల పాత్ర ఒక్కొక్కటిగా బహిర్గతమవుతోంది. ఈ కేసులో తాజాగా విశాఖపట్నం పోలీసులు అరెస్ట్ అయిన.. ఏజెంట్ చుక్కా రాజేశ్, అతడి ముఠా.. దుబాయికి ఆ తర్వాత అక్కడి నుంచి కంబోడియాకు సైబర్ నేరాలు చేసే ముఠాకు తమను కూడా అప్పగించే ప్రయత్నం చేసినట్లు కొంతమంది బాధితులు వెల్లడించారు. ఈ సంఘటన నేపథ్యంలో ప్రస్తుతం ఇండియాలోనే ఉన్న విశాఖ, గాజువాక, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు బాధితులు, సోమవారం 'ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధితో మాట్లాడారు. గాజువాకకు చెందిన రాజేశ్ ఇంజనీరింగ్ చేసిన అనంతరం దుబాయిలో కొన్నాళ్లు ఉద్యోగం చేసి ఆ తర్వాత దుబాయి ఉద్యోగాల పేరిట తమను తీసుకోవచ్చి మోసం చేశాడని యువకులు చెప్పారు. రూ.లక్షన్నర తీసుకుని తమను దుబాయికి తరలించి ఏ పనీ ఇప్పించక మోసం చేశాడని తెలిపారు. దుబాయిలో పని లేదని, మరో లక్ష రూపాయిలిస్తే ఇక్కడి నుంచి కంబోడియాకు పంపిస్తానని చెప్పగా తమలో అత్యధికులు అతడి మాటలను నమ్మలేదని యువకులు వెల్లడించారు. ఇప్పటికే దుబాయి పేర మోసపోయిన తాము మళ్లీ అదనంగా డబ్బులిచ్చి ఎక్కడో కంబోడియాకు వెళ్లి మోసపోలేమని చెప్పామని వారన్నారు. అయినా తమతో పాటు వెళ్లిన వారిలో ఒకరిద్దరు విశాఖవాసులు కంబోడియాకు వెళ్లి సైబర్ నేరస్థుల వలలో చిక్కుకున్నారని చెప్పారు. ఒక బ్యాచ్‌లో 26 మందిని తీసుకురాగా, వీరందరూ విశాఖ పరిసర ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. తమకు జరిగిన మోసం గురించి గత ఏడాది దుబాయి నుంచి అమరావతిలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని బాధితులు పేర్కొన్నారు. దుబాయిలో అనుభవించిన నరకయాతన గురించి బయట ఎవరికైనా చెబితే తీవ్ర పరిమాణాలు ఎదురవుతాయని ఈ ముఠా తమను హెచ్చరించిందని, దిక్కులేక మౌనంగా ఉండిపోయామని, ఇప్పుడు విశాఖపట్టణం పోలీసులు విచారణ చేస్తుండడంతో తమకు విశ్వాసం కలుగుతోందని వారన్నారు. ఉత్తర భారతానికి చెందిన అమన్, ఆశీశ్, ఆశోక్ లతో పాటు విశాఖకు చెందిన అనూష అనే మహిళ, లోహిత్ అనే యువకుడు కూడా ఒక జంటగా ఏర్పడి ఉద్యోగాల పేరిట మోసం చేశారని, తమను కంబోడియాకు వెళ్లమని ఒత్తిడి చేయగా తాము నిరాకరించి సుదీర్ఘ నిరీక్షణంతరం గత సంవత్సరం స్వదేశానికి తిరిగి వచ్చినట్లుగా బాధితులు చెప్పారు. తమ నుంచి వసూలు చేసిన డబ్బు ఇప్పటికీ తిరిగి ఇవ్వలేదని, అతడి వెంట తిరిగి తిరిగి అలసిపోయామని వారు వాపోయారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరారు.

సిమ్ కార్డులు ఎలా వెళ్తున్నాయి!

- విదేశాల్లో భారతీయ సిమ్ కార్డుల పనితీరుపై కేంద్ర హోం శాఖ సమీక్ష

కంబోడియా కేంద్రంగా పెరిగిపోతున్న బ్యాంకింగ్ సైబర్ నేరాల నేపథ్యంలో విదేశాల్లో భారతీయ సిమ్ కార్డులు ఎలాంటి నియంత్రణా లేకుండా ఏ విధంగా పని చేస్తున్నాయి.. దీంతో బ్యాంకింగ్ రంగంపై పడుతున్న ప్రభావం ఎంత అనే అంశాలపై కేంద్ర హోం శాఖ లోతుగా కసరత్తు చేస్తోంది. ఈమేరకు కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా కొద్ది వారాల క్రితం విదేశీ వ్యవహారాలు, టెలికం మంత్రిత్వ శాఖలతో పాటు సీబీఐ, రిజర్వు బ్యాంకు, ఇతర కేంద్ర నిఘా సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం జరిపింది. భారీ సంఖ్యలో టోకుగా యాక్టివ్ సిమ్ కార్డులను విదేశాలకు ఏ విధంగా పంపగలుగుతున్నారని కేంద్ర హోం శాఖ కార్యదర్శి టెలికం అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం.

విదేశాలకు సిమ్‌కార్డులు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- నిందితుడు విశాఖ వాసి

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా కోసం విదేశాలకు సిమ్ కార్డులను తరలిస్తున్న వ్యక్తిని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. విశాఖపట్టణానికి చెందిన ఎన్‌ఆర్ శ్రీనివాస్ రావు (55) దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి గుర్తింపు కార్డులతో సిమ్‌కార్డులను సేకరించి, వియత్నాం తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులకు అనుమానం రావడంతో శ్రీనివాస్ రావు లగేజీ బ్యాగులను పరిశీలించి సిమ్ కార్డులను గుర్తించారు. విశాఖపట్నం నుంచి వియత్నాంకు సిమ్‌కార్డులను తరలించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఈ మేరకు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి జియో, ఎయిర్‌టెల్ కంపెనీలకు చెందిన 24 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 94.37 శాతం హాజరు

జేఎన్టీయూకే, మే 20: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్షకు సంబంధించి ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్ష ఐదవ రోజు సాఫీగా జరిగినట్టు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 61,330 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 57,880 మంది హాజరయ్యారని 3450 మంది గైర్హాజరు కాగా మొత్తం 94.37 శాతం హాజరు నమోదైందన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయని తెలిపారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24న ప్రారంభం కానున్నాయి. జూన్ 3 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్షల ఏర్పాట్లకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లుచేసింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ సోమవారం అన్ని జిల్లాల డీఈవోలు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డితో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. సప్లిమెంటరీ పరీక్షలకు 1,61,877 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 96, 938 మంది అబ్బాయిలు, 64,939 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ పరీక్షలకు 685 సెంటర్లు ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల మార్గాల్లో సరిపడా బస్సులు నడిపేలా చూస్తున్నామని, సెంటర్లలో వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

వైసీపీకి ఓటు.. ఎస్సైకి నోటు!

- ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలు
- సబ్ ఇన్‌స్పెక్టర్‌కు 5 వేలు ఫోన్‌పే చేసిన దర్శి వైసీపీ నాయకులు
- ఫిర్యాదు రావడంతో విచారణ.. ఖాజాబాబుపై సస్పెన్షన్ వేటు


ఎస్ఐ ఖాజా బాబు

దర్శి, మే 20: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ వైసీపీ చేసిన అవినీతి, అక్రమాలు, ప్రలోభాలు వెలుగులోకి వస్తున్నాయి. కొంత మంది అధికారులు ఏకపక్షంగా అధికార పార్టీకి కొమ్ముకాశారని తేలిపోయింది. ఒక ఎస్సైకి వైసీపీ నాయకులు రూ.5 వేలు ఇచ్చి ఓటు వేయించుకున్న వ్యవహారం వెలుగు చూసింది. ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన ఖాజాబాబు మంగళగిరిలో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయనకు దర్శిలో ఓటు ఉంది. వైసీపీ నాయకులు ఈయన ఓటుకు ఖరీదు కట్టి రూ.5 వేలను ఫోన్‌పే ద్వారా ఖాజా బాబు ఖాతాకు పంపారు. అనంతరం, ఆయన తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా పంపించారు. అయితే.. ఓటుకు నోటు తీసుకున్న విషయాన్ని పసిగట్టిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దర్శి పోలీసులు ఈ నెల 7న ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఎస్ఐ ఖాజా బాబు ఓటుకు రూ.5 వేలు తీసుకున్నట్లు ఆధారాలు లభించటంతో గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి.. ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారే ఓటుకు నోటు తీసుకున్నట్లు తెలిసి జనం విస్తుపోతున్నారు.

ఏకపక్షంగా భూ రికార్డుల్లో పేర్ల మార్పు కుదరదు

- రెవెన్యూ అధికారుల తీరును తప్పుబట్టిన హైకోర్టు

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూయజమానులకు నోటీసులిచ్చి, వారి నుంచి వివరణ తీసుకున్న తరువాతే రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చాలని అధికారులకు హైకోర్టు తేల్చిచెప్పింది. ఎఫెక్టెడ్ పార్టీకి నోటీసులు ఇవ్వకుండా, వారి వాదన పరిగణలోకి తీసుకోకుండానే రికార్డుల్లో పేరు మార్చడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. చట్టనిబంధనలు అనుసరించకుండా ఇష్టానుసారంగా భూరికార్డుల్లో పేర్లు మార్చడానికి వీల్లేదని చిన్నం పాండురంగారావు కేసులో హైకోర్టు గతంలోనే స్పష్టం చేసిందని గుర్తు చేసింది. భూయజమానులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రికార్డుల్లో పేర్లు మార్చడాన్ని సవాల్ చేస్తూ తరచూ వ్యాజ్యాలు దాఖలు కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. నెల్లూరు జిల్లా, కలిగిరి మండలం, పరికోట గ్రామానికి చెందిన పిటిషనర్ల భూములను రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా మారుస్తూ తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసింది. పిటిషనర్ల భూముల విషయంలో కలగజేసుకోవద్దని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. భూముల సమగ్ర రీసర్వే పేరుతో నెల్లూరు జిల్లా, కలిగిరి మండలం, పరికోట గ్రామం పరిధిలో సర్వే నంబర్ 227-1, 227-2 పరిధిలో తమ ఆధీనంలో ఉన్న భూములను రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా మార్చారంటూ కోట మహేశ్వరరెడ్డి, మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి... రికార్డుల్లో పేర్లను మారుస్తూ తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేశారు.

మరోవైపు తమకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా ఆర్ఓఆర్‌లో తమ పేరు మీద ఉన్న భూరికార్డులను మార్చి థర్డ్ పార్టీకి హక్కులు కల్పించారని పేర్కొంటూ పశ్చిమగోదావరి జిల్లా, రామన్నపాలేనికి చెందిన వి.సత్యనాగేంద్ర ప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. రికార్డుల్లో పేరు మార్చే ముందు అధికారులు నోటీసుల ఇచ్చి, తన వాదన చెప్పుకొనేందుకు అవకాశం కల్పించలేదన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి.. అప్పటికే రికార్డుల్లో పేరు నమోదై ఉన్న భూయజమానికి నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా భూరికార్డుల్లో పేర్లు ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. వేసవి సెలవుల తరువాత విచారణ జరుపుతామన్నారు.

ఎవరికి ఎన్ని సీట్లో?

- అభ్యర్థుల లెక్కలు.. పార్టీల విశ్లేషణలు
- ఇప్పటికే సర్వే బృందాల నివేదికలు
- ఆయా టీంలతో చంద్రబాబు 2 గంటలు భేటీ
- టీడీపీ కూటమికి 115 సీట్లు అంచనా
- మరో లెక్కప్రకారం 136 దాటొచ్చని విశ్లేషణ
- పోటాపోటీ నెలకొందన్న వైసీపీ బృందాలు!
- అభ్యర్థుల వ్యక్తిగత రిపోర్టులు
- వీటిని పోల్చుకుని కొందరిలో జోష్.. మరికొందరు బేజార్
- ఇదే సమయంలో పందెంరాయుళ్ల బెడద
- బెట్టింగులు కాయాలా వద్దా అని ఒత్తిళ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో పోలింగ్ ముగిసి వారం దాటిపోయింది. మరో రెండు వారాలకు గాని ఫలితాలు వెలువడవు. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనుంది. ఇంకా చాలా సమయం ఉండడంతో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం ఓట్ల లెక్కలు, విశ్లేషణల్లో మునిగి తేలుతున్నారు. ఏ వర్గం ప్రజలు ఎవరికి ఓటేసి ఉంటారో అన్న అంచనాలపై లోతుగా చర్చించుకుంటున్నారు. ప్రత్యర్థి శిబిరం అంచనాలు ఎలా ఉన్నాయా అని ఆరాలు తీస్తున్నారు. ఈ సమాలోచనల గొడవల్లో తాముంటే మధ్యలో పందెం రాయుళ్ల దెబ్బకు నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 13న రాష్ట్రంలో జరిగిన పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉందో తెలుసుకోవడానికి ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ సాంకేతిక బృందాలతో విశ్లేషణలు తయారు చేయించుకున్నాయి. ఈ బృందాలు రకరకాల నమూనాలతో లెక్కలుగట్టి ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో విశ్లేషించి తమను నియోగించుకున్న పార్టీలకు నివేదికలు అందజేశాయి. అన్ని పార్టీల్లో ఈ కసరత్తు ఇప్పటికే పూర్తయింది. క్షేత్ర స్థాయి సమాచారంతో ఈ నివేదికలను సరిపోల్చుకునే పనిని కొత్తగా ఈ బృందాలకు అప్పగించారు. ఉదాహరణకు.. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు తమ పార్టీ కోసం పనిచేసిన సాంకేతిక బృందాలతో టీడీపీ అధినేత చంద్రబాబు సుమారు రెండు గంటలపాటు సమావేశమయ్యారు. ఒక లెక్క ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమికి 115 సీట్లకు తక్కువ కాకుండా వస్తాయని.. మరో అంచనాలో కూటమి స్కోరు 136 దాటిపోతుందని ఈ బృందాలు తమ ప్రజంటేషన్లో పేర్కొన్నట్లు సమాచారం. ఇదే తరహా నివేదికలను వైసీపీ నియోగించుకున్న బృందాలు కూడా ఆ పార్టీ నాయకత్వానికి ఇచ్చాయి. పరిస్థితి పోటాపోటీగా ఉందని అవి పేర్కొన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీ సైతం అంచనాలు రూపొందించినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమే అధికారంలోకి వస్తుందని, కానీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తి మెజారిటీ టీడీపీకి సొంతంగా రాదని.. జనసేన, బీజేపీ సహకారంతోనే సర్కారు ఏర్పాటవుతుందని ఆ పార్టీ విశ్లేషిస్తున్నట్లు సన్నిహిత వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

హుషారు.. కలవరం

పార్టీల అంచనాలతో సంబంధం లేకుండా అభ్యర్థులు కూడా ఎవరికి వారు తమ నియోజకవర్గాల్లో జనం నాడిపై సొంత విశ్లేషణలు తయారు చేసుకుంటున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా పార్టీ నేతలను పిలిపించుకుని.. అక్కడ తమకు ఎన్ని ఓట్లు లభించే అవకాశం ఉందో తెలుసుకుని.. లెక్కలు వేసుకుంటున్నారు. పల్నాడు జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంలో గత నాలుగు ఎన్నికల్లో ఒక్కసారి కూడా టీడీపీ గెలువలేదు. ఈసారి అక్కడ పోటీ చేసిన అభ్యర్థి తాను 15 వేలకు పైగా మెజారిటీతో గెలుస్తానని లెక్కగట్టారు. ప్రతి గ్రామం నేతల నుంచి సమాచారం తెప్పించుకున్న ఆయన.. గ్రామాలవారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయో లెక్కలుగట్టి ఈ విశ్లేషణ రూపొందించారు. దీంతో ఆయన అనుచర వర్గం హుషారుగా తిరుగుతోంది. టీడీపీ శిబిరంలో ఉత్సాహం చూసి ప్రత్యర్థి శిబిరంలో కలవరం ఏర్పడింది.

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఎన్నిక పోటాపోటీగా జరిగింది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు తామే గెలుస్తున్నామని లెక్కలు వేసుకొన్నారు. రెండ్రోజుల తర్వాత వారిద్దరికీ అనుమానం వచ్చి ప్రత్యర్థి శిబిరం లెక్కలు తెప్పించుకుని సరిపోల్చుకున్నారు. ఆ తర్వాత ఒక అభ్యర్థి ముఖంలో కళ తప్పిందని ప్రచారం జరుగుతోంది.
- గోదావరి జిల్లాల్లో ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి తన నియోజకవర్గంలో ఓటర్లు ఎటు ఓటు వేశారో తెలుసుకోవడానికి ఒక బృందాన్ని నియమించి పోలింగ్ అనంతర సర్వే చేయిస్తున్నారు. నియోజకవర్గంలో కనీసం పది వేల మంది ఓటర్ల మనోగతం తెలుసుకోవాలని ఆయన ఆ బృందానికి టార్గెట్ పెట్టారు. ఈ సర్వే ఇంకా జరుగుతోంది.

సందట్లో సడేమియా..

తమ పరిస్థితి ఎలా ఉందో అర్థంగాక ఒత్తిడిలో ఉన్న అభ్యర్థులను పందెం రాయుళ్లు ఇంకా ఒత్తిడికి గురి చేస్తున్నారు. నియోజకవర్గంలో గెలుపోటములపై బెట్టింగ్‌లు వస్తున్నాయని.. ఏం కాయాలి.. ఎంత కాయాలని కొందరు పందెం రాయుళ్లు నేరుగా అభ్యర్థులనే అడుగుతున్నారు. 'పందెం వద్దని చెబితే నా పరిస్థితి బాగో లేదని.. భయపడుతున్నానని ప్రచారం చేస్తారు. పందెం కాయవచ్చని చెబితే తర్వాత నష్టం వస్తే నా వల్లే నష్టపోయామని నానా యాగీ చేస్తారు. ఏం చెప్పాలో తోచడం కావడం లేదు' అని కృష్ణా జిల్లాకు చెందిన అభ్యర్థి ఒకరు వాపోయారు. కొందరు అభ్యర్థులు తమ ఫలితం మీద ఏం పందేలు జరుగుతున్నాయో రహస్యంగా వాకబు చేస్తున్నారు. తమ గెలుపోటములపై బయట ఏమనుకుంటున్నారో దీనివల్ల తెలుస్తుందని వారు భావిస్తున్నారు.

వైసీపీకి 151 మించి సీట్లు వస్తే నా ముఖంపై పేడ కొడతారు!

- లేదంటే జగన్‌కే అది జరుగుతుంది: పీకే

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చెప్పినట్లుగా వైసీపీకి 151 మించి అసెంబ్లీ సీట్లొస్తే తన ముఖాన పేడకొడతారని.. లేదంటే ఆయనకే అది జరుగుతుందని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) వ్యాఖ్యానించారు. ఇటీవల విజయవాడ ఐ-ప్యాక్ కార్యాలయానికి వెళ్లిన జగన్.. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రభావమేమీలేదంటూ తేలిగ్గా మాట్లాడారు. ఐప్యాక్ టీమ్ హెడ్ రుషిరాజ్ బృందమే వైసీపీ కోసం కష్టపడినట్లు తెలిపారు. ఏపీలో ఫలితాలపై తాజాగా యూట్యూబ్ చానల్ మోజో జర్నలిస్ట్ బర్కా దత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఘోర పరాజయాన్ని చవిచూడబోతున్నారని పునరుద్ఘాటించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రానుందని తెలిపారు. దేశంలో మళ్లీ బీజేపీయే గెలుస్తుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీపై ప్రజల్లో వ్యతిరేకత లేదని.. మళ్లీ ఆయన సారథ్యంలోనే కేంద్రంలో సర్కారు ఏర్పడుతుందన్నారు. అయితే తామే రాబోతున్నామని రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్‌లాంటివారు కూడా చెబుతున్నారని.. జగన్ మాటలూ అలాంటివేనని పీకే కొట్టిపారేశారు. కేవలం సంక్షేమ పథకాలతోనే ప్రభుత్వాలు ఏర్పడవన్నారు.

అనుభవించు రాజా!

(మొదటి పేజీ తరువాయి)

బారికేడ్లతో ప్రజలను ఆమడ దూరం ఉంచారు.

సచివాలయానికి దూరం

సచివాలయానికి వెళ్లకుండా ఇంట్లో నుంచే పాలన చేసిన ఏకైక సీఎం జగన్. ఈ ఐదేళ్ల వ్యవధిలో జగన్ 50 సార్లు మాత్రమే సచివాలయానికి వచ్చారు. అది కూడా మంత్రివర్గ సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే! ఇంట్లో కేబినెట్ భేటీలు నిర్వహించరాదనే నిబంధన ఉండటంతో.. ఇష్టంలేకున్నా, కష్టంమీదే ఆయన సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. లేకుంటే అటువైపు చూసేవారు కాదేమో! 2019 మేలో అధికారం చేపట్టాక మొదటి పక్షం రోజులు మాత్రమే ఆయన సచివాలయానికి వెళ్లారు. ఆ తర్వాత అటువైపు చూడటం మానేశారు. ప్రభుత్వ సొమ్ముతో తాడేపల్లి ప్యాలెస్‌లో భారీ నిర్మాణాలు, సకల ఏర్పా ట్లు చేసుకున్నారు. డిసెంబరులో మూడు రాజధానుల పాట అందుకున్నాక సచివాలయానికి పూర్తిగా దూరమయ్యారు. మంత్రులు కూడా సచివాలయానికి వెళ్లడం మానేశారు. ఆయా శాఖల ముఖ్యకార్యదర్శు లు, విభాగాధిపతులు కొందరు సచివాలయానికి వెళ్లకుండా సొంతంగా ఇంట్లోనే క్యాంపు ఆఫీసులు పెట్టుకున్నారు. మంత్రివర్గ సమావేశాల్లో పాల్గొనేందుకు మాత్రమే జగన్ సచివాలయానికి వెళ్లారు. ఈ ఐదేళ్లలో 50 సార్లు మాత్రమే సచివాలయానికి వచ్చారు. అంటే.. 60 నెలల పాలనలో జగన్ మంత్రివర్గ భేటీలు నిర్వహించింది 50 సార్లు మాత్రమే.

రాచరిక పాలనలా...

ఐదేళ్ల కాలంలో జగన్ అధికార దర్పాన్ని, రాచరిక, నియంత పోకడలను ప్రదర్శించారు. అవసరం లేకున్నా సలహాదారులు, వారికి సలహాదారులు, చివరకు అధికారులకు సలహాదారులను నియమించడం జగన్ పాలనలోనే జరిగింది. పండగలు, ఉత్సవాలు ప్రజల మధ్య జరుపుకోవడం పాలకుల ఆనవాయితీ. ఇలాంటివి జగన్‌కు నచ్చవు. చివరకు దేవుడు కూడా తన దగ్గరకే రావాలన్నట్టుగా జగన్ వ్యవహరించారు. ఇక అవినీతి గురించి రోజుల కొద్దీ కథలు కథలుగా చెప్పొచ్చు. ఇసుక, కొండలు, గుట్టలు, గనులు.. ప్రకృతి వనరులను దేన్నీ వదలకుండా దోచేశారు. మద్యంలో వేల కోట్లు కొల్లగొట్టారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా జగన్‌లా 'అధికారాన్ని' అనుభవించి ఉండరేమో!

ఇదీ చంద్రబాబు మార్క్

2014-19లో నవ్యాంధ్రకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో 108 సార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించారు. నెలకు సగటున ఒక సమావేశం విధిగా జరిపేవారు. కీలకమైన అంశాలు ఉన్నప్పుడు నెలకు రెండు మూడుసార్లు మంత్రివర్గ భేటీలు జరిగిన సందర్భాలున్నాయి. జిల్లాల్లో పర్యటించినపుడు లేదా ఢిల్లీ, విదేశీ పర్యటనలు ఉంటే తప్ప చంద్రబాబు విధిగా సచివాలయానికి వచ్చేవారు. వారంలో ఐదు రోజులు కచ్చితంగా సచివాలయంలో ఉండేవారు. సచివాలయం అంటే పాలనా కేంద్రం కావున అక్కడికి సీఎంతో పాటు మంత్రులు, అధికారులు, సిబ్బంది సమయానుగుణంగా వచ్చేలా చంద్రబాబు పాలన సాగింది. మంత్రుల హాజరు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. 2014 జూలైలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక.. ఆ ఒక్క నెలలోనే 13 సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిపారు. 2015లో 24, 2016లో 22, 2017లో 18 సార్లు కేబినెట్ భేటీలు నిర్వహించారు. 2019లో ఎన్నికల కోడ్ రావడానికి ముందు కూడా అరడజను సార్లు సమావేశాలు నిర్వహించిన చరిత్ర చంద్రబాబుది. ఇక జిల్లాలకు వెళ్లినపుడు అవసరాన్ని బట్టి చంద్రబాబు అక్కడే బస చేసేవారు. ఒకేసారి రెండు మూడు రోజులు జిల్లాల పర్యటన చేసేవారు.

గులకరాయి కేసులో 'బెయిల్' విచారణ 23కు వాయిదా

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో గులకరాయితో దాడి చేసిన కేసులో నిందితుడు సతీశ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై విచారణను కోర్టు ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జరిగిన విచారణలో సతీశ్‌కుమార్ తరఫున న్యాయవాది సలీం వాదనలు వినిపించారు. సతీశ్‌కుమార్‌కు బెయిల్ ఇవ్వాలని కోరారు. ప్రతివాదనలు వినిపించడానికి ప్రభుత్వ న్యాయవాది సమయం కోరడంతో విచారణను కోర్టు 23వ తేదీకి వాయిదా వేసింది.

తాడిపత్రి హింసలో 728 మందిపై కేసులు

తాడిపత్రి టౌన్, మే 20: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు చెలరేగిన హింసకు సంబంధించి మొత్తం ఏడు కేసులను పోలీసులు నమోదు చేశారు. మొత్తం 728 మందిపై కేసులు నమోదవగా, వారిలో 396 మందిని ఇప్పటి వరకు గుర్తించారు. మరో 332 మందిని గుర్తించాల్సి ఉంది. టీడీపీ, వైసీపీకి చెందిన 91 మందిని ఇప్పటికే అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తాడిపత్రిలో జరిగిన హింస, పోలీసుల నిర్లక్ష్యంపై సిట్ అధికారులు రెండు రోజులపాటు దర్యాప్తు చేశారు. సమగ్ర వివరాలను సేకరించారు. కేసుల వివరాలను ఎన్నికల సంఘానికి నివేదించారు.

వంట గ్యాస్‌లో దోపిడీ

లీగల్ మెట్రాలజీ తనిఖీల్లో 224 కేసులు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్లలో ఆయిల్ కంపెనీలు, డీలర్లు మోసాలకు తెగబడుతున్నారు. ఓవైపు వంట గ్యాస్ ధరలు పెరిగి వినియోగదారులు అదనపు భారం మోస్తుంటే, తూకంలో మోసాలకు పాల్పడుతూ కంపెనీలు, డీలర్లు ఇంకొంత భారం మోపుతున్నాయి. సోమవారం తూనికలు కొలతల శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేసిన తనిఖీల్లో తక్కువ తూకంతో సిలిండర్లు నింపుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. కొన్ని చోట్ల ఏకంగా 2కిలోలు తగ్గించి రీఫిల్ చేస్తున్నారు. అనేక చోట్ల కిలో గ్యాస్ తగ్గించి నింపుతున్నారు. 14.2కిలోలు ఉండాల్సిన గ్యాస్ సిలిండర్ 12కిలోలే వస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. 5కిలోల గ్యాస్ సిలిండర్‌లోనూ అరకిలో మేర గ్యాస్ తగ్గుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ అక్రమాలపై అధికారులు 39 కేసులు నమోదుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా తనిఖీలు చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయని వినియోగదారులు అంటున్నారు. బియ్యం తూకాల్లోనూ అక్రమాలు జరుగుతున్నట్లు తేలింది. కిరాణా, బియ్యం స్టోర్లపై 82 కేసులు పెట్టారు. ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ షాపులపై 103 కేసులు నమోదు చేసినట్లు పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్ తెలిపారు. తూకాల్లో తేడాలు గుర్తిస్తే 1967 నంబరుకు కాల్ చేయాలన్నారు.

అవి ప్రాణాంతక దాడులే!

(మొదటి పేజీ తరువాయి)

చేయకపోవడం, అల్లర్ల కేసుల్లో నిందితులుగా ఉన్న 1,370 మందిలో కనీసం పదిశాతం మందిని కూడా అరెస్టు చేయక పోవడానికి కారణాలను నివేదికలో పొందుపరచింది. ప్రాణాంతకమైన ఇనుప రాడ్లు, కత్తులు, సమ్మెటలు, రాళ్ల దాడులు బీభత్సంగా జరిగినా ఎఫ్ఐఆర్‌లలో ఆ స్థాయి ఐపీసీ సెక్షన్లు నమోదు చేయలేదని తేల్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు పోలింగ్ రోజు జరిగిన విధ్వంసం కేసుల్లో ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రస్తావనే లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని పేర్కొంది. నేరం తీవ్రత, లభించిన ఆధారాలకు అనుగుణంగా చర్యలు లేవని పెదవి విరిచింది. నలుగురు డీఎస్పీల నేతృత్వంలో 12 మంది సభ్యులతో కూడిన సిట్ బృందాలు మూడు జిల్లాలకు వెళ్లి విచారణ జరిపాయి. పల్నాడు జిల్లాలో 8 పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన 22 కేసులు, అనంతపురం జిల్లాలో నమోదైన 7 కేసులు, తిరుపతి జిల్లాలో నాలుగు కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించాయి. నేరం/ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి అన్ని వర్గాలతో మాట్లాడి, నాటి దృశ్యాలను వీక్షించి, సాక్షుల వాంగ్మూలాలతో ధ్రువీకరించుకుని అన్ని అంశాలను నివేదికలో పొందుపరచింది. బాధ్యులెవరు.. బాధితులెవరు.. నిందితుల వెనకున్నది ఎవరు.. వారికి సహకరించిన పోలీసుల పాత్రేంటి.. రాజకీయ పార్టీల నేతల కుట్రలు ఏమైనా ఉన్నాయా.. తదితర కోణాల్లో పరిశీలించింది. పలు ఎఫ్ఐఆర్‌లలో కొన్ని సెక్షన్లు చేర్చాలని.. బయటే ఉన్న 90శాతాని(1,246మంది)కి పైగా నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని సూచించింది. హింసాత్మక దాడుల కుట్ర దారులను గుర్తించి కస్టడీలోకి తీసుకుని విచారించాలని అభిప్రాయపడింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఏర్పాటైన దర్యాప్తు బృందాలను మరింత బలోపేతం చేసి టెక్నాలజీ వినియోగించి ఎక్కడున్నా అరెస్టు చేయాలని నిర్దేశించింది. సీసీ ఫుటేజీలు, సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు, ఫొటోలు, సాక్షుల వాంగ్మూలాలు, బాధితుల ఆరోపణలన్నీ పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి ఆధారాలతో కోర్టుల్లో చార్జిషీట్లు వేయాలని స్థానిక ఎస్‌హెచ్‌వోలకు సూచించింది. సిట్ నివేదికపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. సిట్ బృందం సూచనలను పరిగణనలోకి తీసుకుని పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆయా జిల్లాల ఎస్పీలు, గుంటూరు రేంజ్ ఐజీ, అనంతపురం డీఐజీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ)కి పంపించారు.

విద్రోహ శక్తులను గట్టిగా విచారించాలి..

రెండు గ్రూపులు విచక్షణరహితంగా రాళ్లు రువ్వుకోవడానికి కొందరు సంఘ విద్రోహ శక్తులు నిర్భయంగా, ఉద్దేశపూర్వకంగా కారణమైనట్లు సిట్ గుర్తించింది. కొందరి గాయాల తీవ్రతను పరిశీలిస్తే కొన్ని మరణాలు కూడా సంభవించి ఉండేవని అనిపించినట్లు తెలిపింది. ఇటువంటి వారిపై గట్టిగా విచారణ చేపడితే అన్ని కోణాలు వెలుగులోకి వస్తాయని, వారు ఇప్పటికే తప్పించుకున్నందున వెతికి అరెస్టు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే 94 మందికి 41ఏ నోటీసులు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపిన సమాచారాన్ని నివేదికలో ఉటంకించింది. విద్రోహ శక్తులతోపాటు కొందరు రాజకీయ నాయకులపైనా చర్య తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

3 జిల్లాల్లో నమోదైన 33 కేసుల్లో నిందితులు, అరెస్టుల వివరాలిలా..

అసెంబ్లీ నియోజకవర్గం	నమోదైన కేసులు	నిందితులు	గుర్తించిన వ్యక్తులు	అరెస్టు చేయాల్సిన నిందితులు	41నోటీసుల జారీ
నరసరావుపేట	10	178	116	140	38
మాచర్ల	8	296	51	267	29
గురజాల	4	107	107	64	24
చంద్రగిరి	2	37	37	36	0
తిరుపతి	2	24	24	11	0
తాడిపత్రి	7	728	396	634	3

కేసులు తేలేవరకు సిట్ కొనసాగింపు!

ఈ నివేదిక ఇవ్వడంతో సిట్ పని పూర్తికాలేదని డీజీపీ స్పష్టం చేసినట్లు తెలిసింది. 124 మందినే అరెస్టు చేశారని, 94 మందికి 41ఏ నోటీసులిచ్చారని.. మిగతా వారినీ అరెస్టు చేసి చార్జిషీట్లు వేయాలని సిట్ సభ్యులే సిఫారసు చేసినందున.. ఈ బాధ్యతను స్థానిక పోలీసులతో సమన్వయంతో వారే చేయాలని ఆదేశించినట్లు సమాచారం. పూర్తిగా స్థానిక పోలీసులకు అప్పగిస్తే సరిగా జరగదని.. కఠినంగా వ్యవహరిస్తే తప్ప మరోసారి ఇలాంటి హింసాకాండకు అవకాశం ఉండదని చెప్పినట్లు తెలిసింది. అందుచేత ఈ ప్రక్రియ పర్యవేక్షణకు సిట్ కొనసాగడం అవసరమని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, అనంతపురం రేంజ్ డీఐజీ శేముషితో, జిల్లాల ఎస్పీలు, స్థానిక డీఎస్పీలతో సమన్వయం చేసుకుంటూ కేసులను మానిటర్ చేయాలని ఐజీ బ్రిజ్‌లాల్ ఎస్పీ రమాదేవిని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. దీంతో సిట్ సభ్యులు సోమవారం కూడా ఆయా జిల్లాల పోలీసు స్టేషన్లలో రికార్డులు పరిశీలించారు. సిట్ అధికారి సౌమ్యలత నరసరావుపేట రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఐదు కేసులపై మరిన్ని వివరాలు సేకరించారు.

మీడియాపై కేసు సరే.. ఎఫ్ఐఆర్‌లో 'వారి' పేర్లు ఏవీ?

- విశాఖ బర్మా క్యాంపు కేసులో కీలక నిందితులను తప్పించారా?
- చర్చనీయాంశమైన పోలీసుల తీరు
- 'ఫలానా' వారే దాడి చేశారని బాధితులు చెబుతున్నా పట్టని వైనం
- నిందితులకు వైసీపీతో సంబంధాలు
- నేతల ఒత్తిడితోనే నిందితులను తప్పించారని బాధిత కుటుంబం ఆరోపణ

విశాఖపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని కంచరపాలెం బర్మా క్యాంపులో సుంకర ధనలక్ష్మి కుటుంబంపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన కీలక నిందితులపై పోలీసులు కేసు పెట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పైగా ఈ విషయాన్ని ప్రసారం చేశారంటూ మీడియాపై కేసులు పెట్టిన పోలీసులు.. నిందితులను వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనివెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఉండి ఉంటాయని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. దీంతో ఈ వివాదాన్ని 'వ్యక్తిగత కక్షలు' అంటూ కొట్టి పారేస్తున్నారు. కానీ, 'ఇది వైసీపీ వాళ్లు చేసిన దాడి' అని బాధిత కుటుంబం చెబుతోంది. దాడి చేసిన వారందరి పేర్లు తాము చెబితే.. కేవలం ఒక్క లోకేశ్ పేరు తప్ప ఇంకెవరి పేర్లు ఎఫ్ఐఆర్‌లో పెట్టలేదని ఆరోపిస్తోంది. ఇప్పటికీ వారితో తమకు ప్రాణభయం ఉందని, వారందరిపైనా చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబం కోరుతోంది. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.





వైసీపీ జెండాతో భూలోక, వివాదానికి కారణమైన శిలాఫలకం

ఇదీ జరిగింది

ఈ నెల 15వ తేదీ రాత్రి తమపై లోకేశ్‌తో పాటు భూలోక, చిన్ని, ఆశా, ఆశా భర్త, భాస్కర్, సాయి, మున్నా తదితరులు దాడి చేశారని బాధిత కుటుంబంలోని సుంకర నూకరత్నం, ధనలక్ష్మి, మణికంఠ ఆరోపిస్తున్నారు. ఇదే విషయం పోలీసులకు కూడా చెప్పారు. కానీ, ఎఫ్ఐఆర్‌లో ఒక్క లోకేశ్ పేరు మాత్రమే పెట్టి ఇతరుల పేర్లు చేర్చలేదు. ముఖ్యంగా భూలోక అనే యువకుడు ఉన్నాడు. వైసీపీలో కీలక కార్యకర్తగా పనిచేస్తున్నాడు. మిగిలినవారు కూడా అదే పార్టీకి చెందిన వారు. ఈ కారణంగానే పోలీసులు వీరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని కుటుంబం ఆరోపిస్తోంది. ఇదిలావుంటే, ధనలక్ష్మి కుటుంబానికి ప్రధాని మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరైంది. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద రుణం తీసుకున్నారు. వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆమె తన ఇంటి గోడకు అమర్చుకున్నారు. ఎన్నికల సమయంలో అలాంటివి ఉంచకూడదని వైసీపీకి చెందినవారు పదేపదే హెచ్చరించడంతో దానిపై కొద్దిరోజులు కాగితం అంటించారు. పోలింగ్ ముగిసిన తర్వాత కాగితం తీసేశారు. ఆ తర్వాత జరిగిన చర్చల్లో తాము కూటమికి ఓట్లు వేశామని, వైసీపీకి వేయలేదని ధనలక్ష్మి బయటకు చెప్పడంతో గొడవ మొదలైంది. ఈ కారణంగానే తమపై దాడి చేశారని నూకరత్నం, ధనలక్ష్మి చెబుతుండగా, వ్యక్తిగత కక్షలని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో లోకేశ్ మరో ఇద్దరితో కలిసి మణికంఠను కొట్టాడని నమోదు చేసినా, ఆ 'ఇద్దరు' ఎవరో వెల్లడించలేదు. వారిని అరెస్టు కూడా చేయలేదు.

వారిని వదిలేసి మీడియాపై కేసు

మహిళలపై దాడి చేసి దారుణంగా కొట్టిన వారిని అరెస్టు చేయకపోగా, వారి పేర్లు కూడా గోప్యంగా ఉంచిన పోలీసులు, బాధితుల ఆవేదనను మీడియాలో ప్రసారం చేసినందుకు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'పై కేసు నమోదు చేశారు. కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో క్రైం నెంబరు 186/2024 కింద క్రిమినల్ కేసు పెట్టారు. స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు.

పార్టీ మారాడని వైసీపీ వర్గీయుల దాడి

పల్నాడు జిల్లా కృష్ణాపురంలో దారుణం

శావల్యాపురం, మే 20: పార్టీ మారాడన్న అక్కసుతో టీడీపీ కార్యకర్తపై పలువురు వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు పంచాయతీలోని కృష్ణాపురంలో సోమవారం రాత్రి జరిగిందీ దారుణం. గ్రామానికి చెందిన మండల రామకృష్ణ గతంలో వైసీపీకి అనుకూలంగా ఉండేవారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థికి మద్దతుగా వ్యవహరించడంతో ఆయనపై గ్రామంలోని వైసీపీ వర్గీయులు కక్ష పెంచుకున్నారు. సోమవారం రాత్రి ఆయన తన ఇంటికి వెళుతుండగా దారిలో వైసీపీకి చెందిన హుస్సేన్, బికారి, గంధం పెద్ద అయ్యన్న, వినయ్, నాసరయ్య, హజరత్, నాగూర్‌లతో పాటు మరికొందరు క్రికెట్ బ్యాటుతో దాడి చేశారు. తీవ్రగాయాలై రామకృష్ణ రక్తపు మడుగులో రోడ్డుపై పడిపోవడంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొన్నారు. ఇరువర్గాలు వాగ్వాదం చేస్తుండటంతో పోలీసులు వారించి రామకృష్ణను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



గాయాలతో రోడ్డుపై పడిపోయిన రామకృష్ణ

రేపు అల్పపీడనం

- 24 కల్లా వాయుగుండంగా మార్పు
- 25న ఒడిశాలో తీరం దాటే చాన్స్
- తుఫానుగా మారేందుకూ అవకాశం?
- రాష్ట్రం వైపు వస్తుందంటున్న కొన్ని మోడల్స్
- రుతుపవనాల పురోగతికి దోహదం
- నేడు, రేపు సీమ, ఉత్తరాంధ్రలో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది ఈశాన్యంగా పయనించి ఈనెల 24వ తేదీ నాటికి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ వాయుగుండంగా బలపడనున్నది. ఈ నెలాఖరుకల్లా ఇది తుఫానుగా మారే అవకాశాలను తోసిపుచ్చలేమని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అయితే దీన్ని ముందే నిర్ధారించడం తొందరపాటే అవుతుందని పేర్కొంది. అందుకే తుఫానుగా మారే విషయంపై అధికారికంగా ప్రకటన చేయలేదు. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా తుఫానుగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది. అల్పపీడనం మధ్య బంగాళాఖాతం నుంచి ఈనెల 25వ తేదీ నాటికి ఇది ఒడిశా తీరం దిశగా పయనిస్తుందని ఐరోపా మోడల్ చెబుతుండగా...ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందని మరికొన్ని మోడళ్లు చెబుతున్నాయి. ఒకటి, రెండు మోడళ్లు ఏపీ తీరం దిశగా వస్తుందని తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఏపీలను జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం చేసింది. వాయుగుండం గమనంపై బుధవారానికి మరింత స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు అంటున్నారు. అల్పపీడనం బలపడి వాయుగుండంగా బలపడే క్రమంలో రాష్ట్రంలో ఎండలు పెరిగి గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వారు హెచ్చరిస్తున్నారు. ఎండలు పెరిగే క్రమంలో వడగాడ్పులకు అవకాశం ఉందన్నారు.

నైరుతి పురోగతికి దోహదం..

అండమాన్ సముద్రం, పక్కనే ఉన్న బంగాళాఖాతంలో రుతుపవనాలు ముందుకు సాగడానికి ఈ అల్పపీడనం దోహదపడుతుందని ఐఎండీ డైరెక్టర్ డాక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వివరించారు. నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించాయి. ఈ నెల 31వ తేదీ నాటికి కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని, జూన్ రెండో వారం నాటికి ఒడిశాలోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో బుధ, గురువారాల్లో మల్కన్‌గిరి, కోరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాలతో సహా ఉత్తర ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. ఒడిశాలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీర ప్రాంతాల్లో వేడి, తేమతో కూడిన పరిస్థితులు కొనసాగుతాయని, రానున్న ఐదు రోజులు పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీల వరకూ పెరిగే అవకాశం ఉందని ఐఎండీ భువనేశ్వర్ కేంద్రం డైరెక్టర్ మనోరమ మొహంతి తెలిపారు.

నేడు, రేపు వర్షాలు

ఎండ తీవ్రత, ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, రెండు, మూడుచోట్ల భారీవర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని 30 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఓబులదేవర చెరువులో 42.5, వెదురుకుప్పంలో 38.2, మండపేట, కొత్తవలసల్లో 30.5, అడ్డతీగలలో 27.2, నర్సీపట్నంలో 26 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, ఉపరితల ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజులు ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు ఏలూరు జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.



అల్లూరి జిల్లా కొయ్యూరులో పడుతున్న వర్షం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 21 మే 2024



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీ ఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్ ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు

- ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/ థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600; ప్రతి అదనపు సబ్జెక్టుకు రూ.450
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/ డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సందార్భానుసారం సంస్థ ఎంట్రెన్స్ టెస్ట్ కూడా నిర్వహించవచ్చు. వసతి సౌకర్యం, ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1,00,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1,25,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు, కౌన్సెలింగ్:** జూన్ 18 నుంచి 21 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.cbip.org

ఎన్‌ఐటీసీలో పారామెడికల్ కోర్సులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్(ఎన్‌ఐటీసీ)- క్రాఫ్ట్‌మన్ ట్రెయినింగ్ స్కీం(సీటీఎస్) కింద పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్(ఎన్‌సీవీటీ) సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రముఖ పీఎస్‌యూలలో సబార్డినేట్ ఉద్యోగాలు సహా వివిధ సర్వీస్ పోస్టుల భర్తీకి ఈ సర్టిఫికెట్‌లు తప్పనిసరి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వుడు అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం వర్తిస్తుంది. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తుంది. ఇందుకు నెలకు రూ.100లు చెల్లించాల్సి ఉంటుంది.

కోర్సులు-సీట్లు: హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 216 సీట్లు ఉన్నాయి. ఫిజియోథెరపి టెక్నీషియన్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 60 సీట్లు ఉన్నాయి. డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో 48 సీట్లు ఉన్నాయి. రేడియాలజీ టెక్నీషియన్ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫిజియోథెరపి టెక్నీషియన్, డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులకు పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రేడియాలజీ టెక్నీషియన్ కోర్సుకు సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థి వయసు 2024 ఆగస్టు 1 నాటికి పద్నాలుగేళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.nitcindia.com

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఇండియా శ్రామిక మార్కెట్

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరం లేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.



విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేథ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగిన వారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షలకొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

లిటిల్స్




మీకు తెలుసా?

- కొమ్ములు కొమ్మల్లా ఉండే ఈ జింకను రెన్ డీర్ అని పిలుస్తారు. ఉత్తర అమెరికాలో ఉండే వీటిని కరిబు(ఫ్రెంచ్ భాషలో) అంటారు. ఇవి ఆర్కిటిక్, సైబీరియా, ఉత్తర యూరప్ దగ్గరి ప్రాంతాల్లో నివసిస్తాయి.
- మగ జంతువులు కొట్లాడుకున్నప్పుడు కొమ్ములతోనే ఫైట్ ఉంటుంది.
- దీని శరీరంపై రెండు కోట్స్ ఉన్నట్లుంటాయి. లోపల ఉన్నితో అయితే పైన జుట్టు కనిపిస్తాయి.
- రష్యాలో కొన్ని లక్షల రెన్‌డీర్స్ ఉంటాయి. గుంపులు గుంపులుగా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తాయి.
- ఆడ, మగ జంతువులు రెండింటికీ కొమ్ములు ఉంటాయి.



- యూరోపియన్ రెన్‌డీర్స్ తక్కువ దూరానికి వలసలు వెళ్తాయి. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతాయి. రోజుకు కనీసం 55 కిలోమీటర్లు వెళ్తాయి. ఆగుతూ, నడుస్తూ ఏడాదికి 5000 కి.మీ. ప్రయాణిస్తాయివి. ఇవి ఒక చోట కుదురుగా ఉండవు. మంచి ఆహారం, ప్రాంతం కోసం వెళ్తూనే ఉంటాయి.
- యూరప్‌లో కొందరు చలిలో దూరప్రాంతాలకు వెళ్లాలనుకుంటే బరువును వీటిపై మోసుకెళ్తుంటారు.
- వీటిలో ఎనిమిది రకాల జాతులు ఉన్నాయి.
- పచ్చిక, మొక్కలు, పండ్లను తిని బతుకుతాయి. వీటి జీవనకాలం కనీసం 15 ఏళ్లనుంచి 20 ఏళ్ల వరకూ ఉంటుంది.
- ఇవి నదులు అడ్డు వచ్చినప్పుడు అతవేగంగా ఈతకొట్టగలవు.


సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 312

					9	4	1	
				1	6		7	3
			8				2	
1							4	
3		8				6		9
	6							7
	8				3			
2	9		5	8				
	4	1	2					

సుడోకు - 311 సమాధానం

6	1	9	2	7	8	5	3	4
4	7	5	6	1	3	2	9	8
2	3	8	4	9	5	1	7	6
7	6	4	3	8	1	9	5	2
8	9	1	5	2	7	6	4	3
5	2	3	9	6	4	7	8	1
9	4	2	8	5	6	3	1	7
3	5	7	1	4	2	8	6	9
1	8	6	7	3	9	4	2	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.